ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 3
జిల్లా వార్తలు
బుధవారం 17, ఏప్రిల్ 2024

కొందరికే కోడ్

మేం ఎన్ని అక్రమాలు చేసినా అది సక్రమమే.. అదే ప్రతిపక్ష పార్టీ వారిని పలకరించినా తప్పే.. ఇదీ ప్రస్తుతం వైసీపీ నేతల తీరు. ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే బాలినేని.. కొందరు ఆర్పీలు టీడీపీ ప్రచారంలో ఉన్నారని వెల్లడించడంతోపాటు, వారిపై తాను స్వయంగా ఫిర్యాదుచేసినా అధికారులు చర్యలు తీసుకోలేదంటూ ఆవేశంగా మాట్లాడారు. అయితే వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే.. గత కొద్దిరోజులుగా కొందరు ఆర్పీలు వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పార్టీ కండువాలు కప్పుకొని మరీ బహిరంగంగానే తిరుగుతున్నారు. మరోవైపు ఓ రెస్టారెంట్‌లో బాలినేని కోడలు వారికి విందు కూడా ఇచ్చారు. అయితే పదిహేను రోజుల క్రితం దామచర్ల నాగసత్యలత ఓ కార్యక్రమానికి హాజరు కాగా, స్థానిక ఆర్పీలు పలుకరించారు. దీనిపై వైసీపీ వారు రాద్ధాంతం చేశారు. కోడ్ ఉల్లంఘించారంటూ వారిపై ఫిర్యాదు చేయడంతో అధికారులు వారి లాగిన్‌లు నిలిపివేశారు. మరి అధికారులకు వైసీపీ ప్రచారంలో ఉన్న ఆర్పీలు కనిపించడం లేదు ఎందుకో మరి.


ఈనెల 13న ఒంగోలులోని 37వ డివిజన్‌లో బాలినేని కోడలు శ్రీకావ్యతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆర్పీలు

చెప్పేవన్నీ అసత్యాలు.. చేసేవన్నీ అరాచకాలు..!

- వైసీపీ నేతల అబద్ధాలపై విస్తుపోతున్న జనం
- ఒంగోలులో ఆ పార్టీ ప్రచారాల్లో మెప్మా ఆర్పీలు
- యథేచ్ఛగా ఎన్నికల నియమావళి ఉల్లంఘన
- పార్టీ కండువాలతో ఉన్న వారిని పట్టించుకోరు
- అన్నీ తెలిసి కూడా మెప్మా అధికారుల మౌనం
- అదే టీడీపీ నేతకు పూలబొకే ఇచ్చినందుకు ఐదుగురు ఆర్పీలపై చర్యలు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 16 : చెప్పేది అబద్ధాలు.. చేసేది అక్రమాలు అన్నట్లు ఉంది వైసీపీ నాయకుల వ్యవహారం. తమవైపు పనిచేస్తే అంతా సరైనదే.. అదే ప్రత్యర్థి పార్టీ వారిని కనీసం పలకరించినా తప్పే అన్నట్లు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఒంగోలు నగరంలో మెప్మా ఆర్పీలే నిదర్శనం. ఆర్పీలు బహిరంగంగా వైసీపీ కండువాలు వేసుకొని, ప్లకార్డులు పట్టి ప్రచారం చేస్తుంటే ఓకే. అదే ప్రతిపక్ష పార్టీ వారిని మర్యాదపూర్వకంగా పలకరించినా తప్పు అంటూ బెదిరిస్తున్న పరిస్థితి. జిల్లా అధికారులు కూడా వైసీపీ నేతలకే వంతపాడుతుండటంతో కొందరు ఉద్యోగులు రెచ్చిపోతున్నారు. ఏకంగా వైసీపీ నేత కోడలితో కలిసి ప్రచారంలో పాల్గొనడమే కాకుండా పార్టీలకు వెళుతున్నారు. వివరాల్లోకి వెళితే.. వలంటీర్ ఎన్నికల ప్రచారంలో ఉందని ప్రశ్నించినందుకు ఐదురోజుల క్రితం ఒంగోలులో వైసీపీ నేతలు చేసిన రణరంగం రాష్ట్రం మొత్తం చూసింది. పైగా తామేమీ నిబంధనలు అతిక్రమించలేదంటూ రాద్ధాంతం చేశారు. ఈ విషయంలో వందల సంఖ్యలో వైసీపీ శ్రేణులు జనంపై రౌడీయిజం చేశారు. చివరికి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నానా హడావుడి చేసి, పేషెంట్లను భయభ్రాంతులకు గురిచేశారు. జరిగిన ఘటనపై తమ తప్పేమీ లేదంటూ అబద్ధాలను సైతం అరిచి చెప్పారు. అయితే జరిగిన భౌతిక దాడులు, విధ్వంసంపై జీజీహెచ్ అధికారులు బాధ్యులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ, వైసీపీ శ్రేణులను పోలీసులు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆసమయంలో ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్దకు వచ్చిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఏకంగా అధికారుల తీరును తప్పుబట్టారు. కలెక్టర్ సైతం తన ఫోన్ ఎత్తడం లేదని, కొందరు ఆర్పీలు టీడీపీ ప్రచారంలో ఉన్నారని వెల్లడించడంతోపాటు, వారిపై తాను స్వయంగా ఫిర్యాదుచేసినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు వైసీపీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ ఆవేశంగా మాట్లాడారు. కానీ వైసీపీ నేతలు, వారికి అనుయాయులుగా పనిచేస్తున్న కొందరు ఆర్పీలు చేసిన తప్పుడు ఫిర్యాదుతో అప్పటికే కొందరు ఆర్పీలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు జరిగిన ఘటనలపై తమ తప్పేమీ లేదని పదేపదే నొక్కి చెబుతున్న వైసీపీ నేతలు తమ పార్టీ ప్రచారంలో ఉన్న మెప్మా ఆర్పీల గురించి ఏం సమాధానం చెబుతారో మరి. వారిపై జిల్లా ఎన్నికల అధికారి ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

వైసీపీ ప్రచారంలో ఆర్పీలు ఉంటే ఉల్లంఘన కాదా ?

కొందరు ఆర్పీలు వైసీపీ కార్యకర్తలు మాదిరిగా పనిచేస్తున్నారు. ఏకంగా ప్రచార సభలు, కార్యక్రమాలలో పార్టీ కండువాలు కప్పుకొని మరీ బహిరంగంగానే తిరుగుతున్నారు. ప్లకార్డులు పట్టుకుని ఇల్లిల్లూ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఓ రెస్టారెంట్‌లో ఎమ్మెల్యే బాలినేని కోడలు వారికి విందు కూడా ఇచ్చారు. అందులో పార్టీశ్రేణులతోపాటు, ప్రచారంలో పాల్గొన్న ఆర్పీలు కూడా ఉన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అటు టీడీపీ, ఇటు వైసీపీ నాయకులు నగరంలోని డివిజన్‌లలో ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేశారు. పదిహేను రోజుల క్రితం 47వ డివిజన్‌లో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత ఓ కార్యక్రమానికి హాజరు కాగా, కొందరు ఆర్పీలు ఆమెకు పూలబొకే ఇచ్చారు. దీంతో వైసీపీ సానుభూతిరులుగా ఉండే కొందరు ఆర్పీలు ఫొటోలు తీసి మరీ రాద్ధాంతం చేశారు. తాము మాత్రమే సచ్ఛీలురమంటూ చెప్పుకునే వైసీపీ వారు, సదరు ఆర్పీలు కోడ్ ఉల్లంఘించారంటూ వేలెత్తిచూపి అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా మెప్మా అధికారులు సైతం అధికారపార్టీ ఒత్తిళ్లకు లొంగి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ చెప్పారంటూ టీడీపీ ఆర్పీల లాగిన్లు నిలిపివేశారు.


50వ డివిజన్‌లో వైసీపీ కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఆర్పీ

తెలిసి కూడా మెప్మా అధికారుల మౌనం

టీడీపీ సానుభూతిపరులు అంటూ ముద్ర వేసి ఐదుగురు ఆర్పీలపై కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే అధికారం మాది, మమ్మల్ని అడిగేవారు ఎవరు? అంటూ యథేచ్ఛగా కొందరు ఆర్పీలు వైసీపీ ఎమ్మెల్యే బాలినేని, ఆయన సతీమణి, ఆయన కోడలితో ఎన్నికల ప్రచారంలో నిరంతరం కనిపిస్తున్నా అధికారుల కళ్లకు మాత్రం కనిపించడం లేదు. వైసీపీ ఆర్పీల కోడ్ ఉల్లంఘనపై పలువురు మెప్మా పీడీకి సమాచారం అందించి, ఆధారాలతో సహా చూపినా స్పందన అంతంతమాత్రమే. లిఖితపూర్వక ఫిర్యాదు ఉంటేనే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పడం గమనార్హం. జిల్లాలో మెప్మా పనితీరుపై ఇప్పటికే చాలా ఆరోపణలు ఉండగా, మరోవైపు అధికారపార్టీ నేతల ఒత్తిడితో వాస్తవాలు తెలిసినా మౌనం వహించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో టీడీపీకో న్యాయం. వైసీపీకో న్యాయమా? అని నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు



మెప్మా ఆర్పీలు, ఇతర సిబ్బంది ఎవరైనా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే ఈసీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరు ఆర్పీలపై కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకున్నాం. వారి లాగిన్‌లు నిలిపివేశాం. అలాగే వైసీపీ ప్రచారంలో కూడా ఆర్పీలు పాల్గొంటున్నట్లు నా దృష్టికి కూడా వచ్చింది. అందుకు సంబంధించిన ఫొటోలను కూడా ఓ వ్యక్తి నాకు వాట్సాప్ చేశారు. దీనిపై విచారణ చేస్తున్నాం. అయితే లిఖితపూర్వంగా, ఆధారాలతో ఫిర్యాదుచేస్తేనే చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు.

- టి. రవికుమార్, మెప్మా పీడీ



సీతారాముల కల్యాణం చూతము రారండి..

- నేడు శ్రీరామనవమి
- సిద్ధమైన ఆలయాలు

శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బుధవారం ఊరూరా సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా జరుపుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అందుకోసం అనేక చోట్ల చలువ పందిళ్లు వేశారు. ఆలయాలను ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే కల్యాణంలో మన జిల్లాకు ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ సీతారామ కల్యాణంలో ఉపయోగించే గోటి తలంబ్రాలను ఉమ్మడి జిల్లాలోని చీరాలకు చెందిన మహిళలు తయారుచేస్తారు. నిత్యం వడ్లను గోటితో ఒలుస్తూ.. ప్రతి వడ్ల గింజను వలిచేటప్పుడు రామనామాన్ని పలుకుతుంటారు. ఇప్పటికే అవి భద్రాచలం చేరాయి.

- ఒంగోలు కల్చరల్



సిలిండర్లపై సూపర్ సిక్స్

- ఒంగోలులో దామచర్ల వినూత్న ప్రచారం

మూడు సిలిండర్లపై సూపర్ సిక్స్ ప్రచారం అదిరింది. టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ తన ప్రచారంలో భాగంగా వినూత్న వాహనాన్ని సిద్ధం చేశారు. సరికొత్త ఐడియాతో సిద్ధం చేసిన ఆ వాహనంతో టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన ఏడాదికి ఒక్కో ఇంటికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల హామీని ప్రజలకు మరింత చేరువ చేశారు. అలాగే ఆ సిలిండర్లపై సూపర్‌సిక్స్ పథకాల గురించి రాయించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఆటోలో మూడు సిలిండర్ల నమూనాను ఉంచి నియోజకవర్గంలో వినూత్న ప్రచారానికి తెరతీశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా దామచర్ల ఏర్పాటుచేసిన ఉచిత గ్యాస్ సిలిండర్ల ప్రచార వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- ఒంగోలు (కార్పొరేషన్)

దర్శిలో కదంతొక్కిన బీసీలు

- టీడీపీ జయహో సభ విజయవంతం
- తండోపతండాలుగా తరలివచ్చిన ప్రజలు
- పలుసంఘాల నాయకులు హాజరు

వివరాలు లోపలి పేజీల్లో..


జయహో బీసీ సభలో మాట్లాడుతున్న కూటమి దర్శి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి. వేదికపై టీడీపీ నాయకులు బాలాజీ, పాపారావు, రాఘవరెడ్డి


డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మిపై ఆర్డీకి ఫిర్యాదు చేస్తున్న సుజన్

వైద్యారోగ్యశాఖలో అక్రమాలపై విచారణ

- డీఎంహెచ్‌వోతోపాటు ఇతర అధికారుల పాత్రపై ఆర్డీ ఆరా
- రికార్డుల పరిశీలన, పలు అంశాలపై ప్రశ్నలు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 16 : జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై ఆశాఖ రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డి.పద్మశశిధర్ విచారణ చేపట్టారు. ప్రైవేటు వైద్యశాలలకు అనుమతుల మంజూరుతోపాటు డిప్యుటేషన్లు, ఉద్యోగుల తొలగింపు, నకిలీ సర్టిఫికెట్లు ఉన్న ఉద్యోగుల కొనసాగింపు తదితర అక్రమాలపై ముగ్గురు ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ చేసేందుకు డాక్టర్ పద్మశశిధర్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఆమె మంగళవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ముందుగా నోటీసులు ఇచ్చిన ప్రకారం రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజ్యలక్ష్మిని పలు అంశాలపై విచారించారు. సూపరింటెండెంట్‌తోపాటు ఇతర అధికారులు, ఆయా సీట్ల గుమస్తాలతో మాట్లాడినట్లు తెలిసింది. ముందుగా ప్రైవేటు వైద్యశాలలకు ఇచ్చిన అనుమతులపై ఆరా తీసినట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. మాన్యువల్‌గా ఎన్ని అనుమతులు ఇచ్చారు.. తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. మరోవైపు అక్రమాలపై ఫిర్యాదుచేసిన టంగుటూరుకు చెందిన శ్రీనివాసులు, కొమ్ము సృజన్, ప్రొద్దుటూరుకు చెందిన అడ్వకేట్ విజయభాస్కర్‌రెడ్డిలను కూడా ఆర్డీ విచారించారు. వారు డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్ పయ్యావుల శ్రీనివాసులు అక్రమాలకు పాల్పడినట్లు పలు ఆధారాలను ఇచ్చినట్లు తెలిసింది. ఇంకోవైపు అనేకమంది నకిలీ సర్టిఫికెట్లతో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు చేస్తున్నారని, అన్ని అర్హతలు ఉన్న వారిని మాత్రం తొలగించారన్నారని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరోవైపు ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులతోపాటు నియామకాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణాధికారి పద్మశశిధర్‌ను కలిసి మరికొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

చివరకు అతిథులే మిగిలారు

- జనం లేక వెలవెలబోయిన చెవిరెడ్డి పరిచయ వేదిక
- ఒంగోలులో తుస్సుమన్న సభ

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16 : వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరిచయ వేదిక జనం లేక వెలవెలబోయింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఒంగోలులోని ఏ1 కన్వెన్షన్ హాలు ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. ఉదయం కొత్తపట్నం మండలంలో, సాయంత్రం ఆరు గంటలకు ఒంగోలులో నిర్వహించారు. ఈ పరిచయ వేదిక కార్యక్రమానికి నగరంతోపాటు ఒంగోలు రూరల్ మండలం నుంచి పార్టీ ముఖ్యనాయకులు, వివిధ హోదాల్లో ఉండే వారితో పాటు పార్టీశ్రేణులను ఆహ్వానించారు. అయితే సభకు ఆశించిన స్థాయిలో పార్టీశ్రేణులు, ప్రజలు రాకపోవడంతో అందరిలోనూ నిరుత్సాహం నెలకొంది. ఈ పరిచయ వేదిక ఆహ్వానంగా సోమవారం నుంచి విస్తృత ప్రచారం చేసినా కనీసం పార్టీశ్రేణుల నుంచి పెద్దగా స్పందన లేదు. వేదిక ముందు వైపు కొంతమేర జనం ఉండగా మిగిలిన ప్రాంతంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఈ పరిచయ సభలో గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, నాగార్జునరెడ్డితోపాటు మేయర్ గంగాడ సుజాత, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు వేదికపై ఉన్నారు. అయితే ఉన్న కొద్దిమందితోనే సభ ప్రారంభించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభం కావాల్సిన సభ గంట ఆలస్యంగా ప్రారంభించినా కుర్చీలు నిండని పరిస్థితి ఏర్పడింది. చెవిరెడ్డి పరిచయ సభకు పెద్దఎత్తున పార్టీశ్రేణులతోపాటు వైసీపీ అభిమానులు తరలివస్తారని ఆశించినా ఆ స్థాయిలో రాకపోవడంతో పార్టీ ముఖ్యనాయకుల్లో ఆందోళన మొదలైంది. భారీఎత్తున చికెన్, మటన్, చేప, రొయ్యలు తదితర వంటకాలతో భోజనాలు ఏర్పాటుచేసినా ఉపయోగం లేకుండాపోయింది. చంద్రగిరి నుంచి 500 మంది వంటవాళ్లను పిలిచి వంటలు చేయిస్తున్నట్లు సీఎం సొంత పత్రికలో హడావుడి చేసినా స్పందన కరువైంది. పూర్తిగా స్లమ్ ఏరియాలో కార్యక్రమాన్ని పెట్టినా ఆ చుట్టుపక్కల నుంచి పెద్దగా హాజరుకాలేదు. కొంతమందిని తరలించినా వారు కూడా సభ ప్రారంభమైన కొద్దిసేపటికే వెనుదిరిగారు. నామినేషన్లకు ముందే పరిస్థితి ఈ విధంగా ఉంటే రానున్న రోజుల్లో ఏవిధంగా ఉంటుందోనని సభకు వచ్చిన ఆ పార్టీశ్రేణులు మాట్లాడుకోవడం వినిపించింది.




చెవిరెడ్డి మాట్లాడుతుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న బాలినేని

సివిల్స్‌లో సత్తా

- మెరిసిన ఊళ్లపాలెం పేదింటి బిడ్డ
- 780 ర్యాంకు కైవసం
- కానిస్టేబుల్ నుంచి ఐఆర్ఎస్‌గా..!

వివరాలు మెయిన్‌లో..

మార్కాపురం జిల్లా, వెలిగొండే లక్ష్యం!

- ఎమ్మెల్యేగా ఉంటే వాటి సాధనకు కలిసొస్తుంది
- నియోజకవర్గానికే పరిమితమై పనిచేశా, అదే నాబలం
- నా రాజకీయ బంధాల ముందు ప్రలోభాలు పనిచేయవు
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ కూటమి అభ్యర్థి కందుల

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

'మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు, వెలిగొండ జలాలు మా ప్రాంతంలో ప్రవహించడం.. ఇవే నా లక్ష్యాలు. వీటి కోసం పాదయాత్రలు చేశా. ఈ ప్రాంతానికి వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు, ముఖ్యంగా జగన్ తీరని అన్యాయం చేశారు. ఇప్పుడు ఆ రెండు విషయాలపై మా అధినేత చంద్రబాబు బహిరంగ హామీ ఇచ్చారు. నిరంతరం ఆయనతో టచ్‌లో ఉండి వాటిని సాధించేందుకు నేను పాటుపడతా. ఎమ్మెల్యేగా ఉంటే నా ప్రయత్నానికి మరింతగా ఉపయోగపడుతుంది. అందుకే నన్ను గెలిపించమని ప్రజలను కోరుతున్నా' అని టీడీపీ కూటమి మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం ఆంధ్రజ్యోతికి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలపై స్పష్టమైన సమాధానాలు చెప్పారు. గెలుపోటములకతీతంగా తాను నియోజకవర్గ ప్రజలతో రాజకీయ సంబంధాలు కొనసాగించానని చెప్పారు. అందువలన తన ప్రత్యర్థులు డబ్బు, కులం, మతం పేరుతో ప్రజలతో తనకున్న సంబంధాలు తెంచలేరన్న ధీమాను వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గ ప్రజలకు కాదు కదా, కనీసం ఆ పార్టీ శ్రేణులకైనా న్యాయం చేయలేదనే విషయం నగ్నసత్యమన్నారు. అందుకే అభ్యర్థులను మార్చి ప్రయోగాలు చేస్తున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే వెలిగొండను పూర్తి చేసి, నిర్వాసిత గ్రామాల వారికి ఇవ్వాల్సిన నష్టపరిహారం అందించి తాగు, సాగునీటిని అందిస్తానని కందుల స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లాతోపాటు ఈప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి పునాదులు వేస్తానని చంద్రబాబు బహిరంగంగా ప్రకటించారని కందుల చెప్పారు. కానీ నిన్నగాక మొన్న నియోజకవర్గానికి వచ్చిన సీఎం జగన్ మా నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించలేదన్నారు. ఆయన చెప్పిన మెడికల్ కళాశాల నిర్మాణం పునాదులకే పరిమితమైందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటును గొప్పగా చెప్పుకున్న ఆయన మార్కాపురం జిల్లా ఏర్పాటు ఊసే ఎత్తలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉంటే ఆ రెండు అంశాలపై అటు అసెంబ్లీలోనూ, ఇటు బయట నిరంతరం ప్రభుత్వంతో మాట్లాడి వాటి సాధనకు పూర్తిస్థాయిలో పనిచేసే అవకాశం ఉంటుందన్న విషయాన్ని ప్రజలకు ఎన్నికల ప్రచారంలో వివరిస్తున్నానని చెప్పారు. ప్రలోభాలతో తమ పార్టీ నుంచి ఒకరిద్దరు నాయకులను వారు తీసుకెళ్లవచ్చని, కానీ కిందిస్థాయిలో వైసీపీ నాయకులు కోకొల్లలుగా టీడీపీలో చేరుతున్నారన్నారు. అన్ని విషయాలు గమనించే మా వైపు వలసలు పెరిగాయని భావిస్తున్నానని కందుల అభిప్రాయపడ్డారు.



సీతారాముల కల్యాణం చూతము రారండి!

- నవమి వేడుకలకు సిద్ధమైన దేవాలయాలు
- చలువ పందిళ్లు, పానకం పండుగ ప్రత్యేకం
- పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు
- నేడు శ్రీరామనవమి

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 16: "శ్రీరాఘవం దశరధాత్మజ మప్రమేయం సీతాపతిం రఘులాన్వయ రత్నదీపం అజానుబాహుం అరవింద దళాయతాక్షం" అంటూ ప్రజలందరూ భక్తిపారవశ్యంతో అయోధ్యారాముని, సీతాపతిని కొలుస్తూ, వాడవాడలా ఆ సీతారాముల కల్యాణం జగత్కల్యాణంగా, పరమ పవిత్రమైనదిగా భావిస్తూ పరవశించిపోయే శుభదినం 'శ్రీరామనవమి'. అటువంటి శ్రీరామనవమి పర్వదిన వేడుకలను, కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పలు దేవాలయాలు, సంస్థలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధనవమిని 'శ్రీరామనవమి'గా జరుపుకోవటం ఆనవాయితీ. త్రేతాయుగంలో దశరథ మహారాజు నిర్వహించిన పుత్రకామేష్టి యాగం ఫలితంగా సాక్షాత్తు ఆ శ్రీమహావిష్ణువే శ్రీరామునిగా కౌసల్యాదేవికి చైత్రశుద్ధ నవమినాడు జన్మించినందున ఆ రోజును శ్రీరామనవమిగా జరుపుకుంటాము. ఇక శ్రీమహావిష్ణువు శ్రీరామునిగా లోకకళ్యాణం కోసం జన్మించి రావణ సంహారం చేశాడనేదానికి ప్రతీకగా ఆయన జన్మించిన శ్రీరామనవమి రోజునే అభిజిత్ లగ్నంలో కళ్యాణోత్సవాన్ని జరుపుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. అంతేకాకుండా ఈ శ్రీరామనవమి వసంతరుతువులో వస్తుంది. దీంతో ఉగాది మొదలుకుని శ్రీరామనవమి వరకు 'వసంత నవరాత్రులు' జరుపుకోవటం, ఈ తొమ్మిది రోజులు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించటం పరిపాటి.

ప్రత్యేకతలు

ఏ పండుగకు లేనివిధంగా శ్రీరామనవమి పండుగకు గ్రామగ్రామాన తాటాకులతో చలువపందిళ్లు వేస్తారు. శ్రీరామనవమి వేసవికాలంలో రావటం, ఈ పండుగను ప్రజలందరూ సామూహికంగా ఒకచోట చేరి కళ్యాణాన్ని ఒక ఉత్సవ రూపంలో తాటాకు పందిళ్ల నీడలో జరుపుతారు. ఆదేవిధంగా బెల్లం, మిరియాలు మున్నగువాటిని కలిపిచేసే 'పానకం' సైతం శరీరానికి చలువ చేసేదే. అందుకే ఈ వేసవి ప్రారంభంలో వచ్చే శ్రీరామనవమికి పానకాన్ని, పెసరపప్పుతో తయారుచేసిన 'వడపప్పు'ని నైవేద్యం పెట్టి భక్తులకు పంపిణీ చేస్తారు. అదేవిధంగా వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం పొందటానికి పలు పందిళ్లలో 'విసనకర్రల'ను అందజేస్తారు.

భద్రాచల కల్యాణంలో మన ప్రత్యేకత..

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే స్వామివారికల్యాణంలో మన జిల్లాకు ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ సీతారామ కల్యాణంలో ఉపయోగించే 'తలంబ్రాలు' మన జిల్లాలో సైతం తయారవుతాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన మహిళలు గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం దసరా పండుగ మొదలు ఎంతో భక్తి శ్రద్ధలతో దాదాపు ఆరునెలలు శ్రమించి 'గోటి తలంబ్రాలు' తయారు చేస్తారు. అంటే ప్రతినిత్యం వడ్లను గోటితో ఒలుస్తూ ప్రతి వడ్ల గింజను వలిచేటపుడు రామనామాన్ని పలుకుతుంటారు. అదేవిధంగా పసుపుకొమ్ములను రోటిలో దంచి ఆ పసుపు, వడ్లను ఒలిచి తయారుచేసిన బియ్యపు గింజలతో 'తలంబ్రాలు' తయారు చేస్తారు. ఈ విధంగా దాదాపు 440 కేజీల తలంబ్రాలను తయారుచేసి చీరాల పట్టణవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం వాటిని సీతారాముల కల్యాణంలో ఉపయోగించేందుకు భద్రాచలం తీసుకువెళ్లారు.




ఒంగోలు నగరం సీతారామపురం కొండపై శ్రీరాముల వారి గుడికి విద్యుద్దీపాలంకరణ, స్వామివార్ల మూలవిరాట్‌లు

కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లావ్యాప్తంగా శ్రీరామనవమి పండుగ సందర్భంగా పలు వైష్ణవ ఆలయాలలో శ్రీసీతారామ కల్యాణం నిర్వహించటానికి ఆయా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాలలో స్థానికులు కమిటీలుగా ఏర్పడి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇక జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో లాయర్‌పేట సాయిబాబా మందిరం, గడియారం వారి వీధిలోని కుర్తాళం పీఠపాలిత శ్రీ అనంత కోదండరామస్వామి దేవస్థానం, గుర్రంవారి వీధిలోని శ్రీసీతారామచంద్రమూర్తి దేవస్థానం, సీతారాంపురం శ్రీసీతారామచంద్ర మూర్తి ఆలయం, ఐశ్వర్యనగర్ శ్రీసీతారామస్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం, నిర్మల్‌నగర్ పార్కువద్ద ఏర్పాటు చేసిన కళ్యాణమండపం, పోలీస్ క్వార్టర్స్‌లోని శ్రీ సీతారామాలయం, మంగమూరు రోడ్డు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, రామ్‌నగర్ శ్రీ సీతారామచంద్రమూర్తి దేవస్థానం, గద్దలగుంట నెహ్రూ బొమ్మ దగ్గర పండుగ సందర్భంగా కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు.

పోలింగ్ ప్రక్రియలో
మైక్రో అబ్జర్వర్లది కీలక పాత్ర : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16: పోలింగ్ ప్రక్రియ నిబంధనల మేరకు జరిగేలా పర్యవేక్షించడంలో మైక్రో అబ్జర్వర్లది కీలక పాత్రని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మంగళవారం మైక్రో అబ్జర్వర్ల మొదటి విడత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బంది తమకు సంబంధించిన నియమావళిని ఎలాంటి ఉల్లంఘన లేకుండా పాటిస్తున్నారో లేదో చూడాల్సిన బాధ్యత మైక్రో అబ్జర్వర్లపై ఉందన్నారు. ఈక్రమంలోనే మైక్రో అబ్జర్వర్లకు ప్రస్తుతం తొలివిడత శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాకు ఎన్నికల అబ్జర్వర్ వచ్చిన అనంతరం ఆయన సమక్షంలో మైక్రో అబ్జర్వర్లకు మరోసారి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ జరిగిన తీరును గుర్తించడంలో మైక్రో అబ్జర్వర్లు ఇచ్చే నివేదిక అత్యంత కీలకమన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియను, ఆ ప్రాంగణంలో భద్రత ఏర్పాట్లను, వెబ్ కెమెరాల ఏర్పాటు చేసిన విధానం, అవి పనిచేస్తున్న తీరును పరిశీలించడంతో పాటు మాక్ పోలింగ్ నిర్వహణ మొదలు కొని ఈవీఎంలను సక్రమంగా అనుసంధానం చేస్తున్నారో లేదో గమనించాలన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన చెక్‌లిస్ట్‌ను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అనుసరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం అబ్దుల్‌రహీం, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మీడియాసెల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

మీడియా సెల్ ఏర్పాటు

జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను, సమాచారాన్ని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసేందుకు మీడియా సెల్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని రికార్డుభవనంలో ఏర్పాటు చేసిన మీడియాసెల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. మీడియా సెల్ ద్వారా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జరుగుతున్న పూర్తి సమాచారాన్ని మీడియాకు అందిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మీడియా సర్టిఫికెషన్ అండ్ మానటరింగ్ కమిటీకి 17 దరఖాస్తులు రాగా నిబంధనల మేరకు 10 దరఖాస్తులను అనుమతించామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఝాన్సీ, డీఐపీఆర్‌వో గ్రేస్‌లినోర, డీపీఆర్వో రమేష్, డీవిజనల్ పీఆర్వో దుర్గా ప్రసాదరావు, ఎంసీఎంసీ సభ్యులు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16: ఒంగోలు నియోజకవర్గంలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వతేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. నామినేషన్లు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్లు వేసేందుకు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, అభ్యర్థితోపాటు మరో ఐదుగురికి అనుమతి ఉందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు, అందుకోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా కోడ్ ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అభ్యర్థులకు నామినేషన్ల ప్రక్రియపై సూచనలు, సలహాలతో పాటు నామినేషన్ల పత్రాలను కూడా అందజేస్తామని, అందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు నియోజకవర్గంలో శాంతిభద్రతలు అంశాలపై డీఎస్పీ, సీఐలతో చర్చించారు.

చీమకుర్తిలో బలగాల కవాతు

చీమకుర్తి, ఏప్రిల్16 : చీమకుర్తి పట్టణంలో పాటు తొర్రగుడిపాడు గ్రామాల్లో పారా మిలిటరీ దళాలు మంగళవారం కవాతును నిర్వహించారు. ప్రజలకు ఎన్నికల్లో భరోసా కల్పించటానికి కవాతును నిర్వహిస్తున్నట్లు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.



కవాతు నిర్వహిస్తున్న బలగాలు

టీడీపీ హయాంలోనే ఒకటో తేదీన జీతాలు

తెలుగుదేశం కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల • విశ్రాంత ఉద్యోగులతో సమావేశం • 29వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



సదస్సులో ప్రసంగిస్తున్న దామచర్ల జనార్దన్




11వ డివిజన్‌లో కార్యాలయం ప్రారంభం, కొణిజేడు బస్టాండులో దామచర్ల, రియాజ్‌కు గజమాలతో స్వాగతం

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 16: నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు వచ్చేవని, అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక పదిహేనవ తేదీ కూడా జీతాలు వచ్చే పరిస్థితి లేదని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆస్టోనా హోటల్‌లో జరిగిన విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవస్థలో మార్పు వస్తేనే సమాజం బాగుంటుందని, విజ్ఞులైన ఓటర్లు, విశ్రాంత ఉద్యోగులు ఒక్కసారి ఆలోచించాలని, అభివృద్ధి చేసే పార్టీకి ఓటు వేయాలని దామచర్ల కోరారు. ఉద్యోగాలు చేసే సమయంలో అనేక ప్రభుత్వాలు చూశారని, అనేక ఎన్నికల విధులు నిర్వహించిన విశ్రాంత ఉద్యోగులకు వాస్తవాలు తెలుసని చెప్పారు. ఉన్నత చదువులు చదువుకుని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేసిన విశ్రాంత ఉద్యోగులు ప్రస్తుత పరిస్థితుల్లో వాస్తవాలు గుర్తించాలన్నారు. అభివృద్ధి చేసేది, అందరి సంక్షేమం కోరే టీడీపీకి ఓటు వేయాలని కోరారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని దామచర్ల విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

డివిజన్లలో కార్యాలయాలు ప్రారంభం

నగరంలోని 11వ డివిజన్‌లోని పార్టీ కార్యాలయాన్ని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షులు గంగవరపు సందీప్ ఆధ్వర్యంలో మంగళవారం క్లోపేటలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ప్రారంభించిన జనార్దన్ మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి టీడీపీకి అత్యధిక మెజారిటీ వచ్చేలా చూడాలని కోరారు. వైసీపీ వైఫల్యాలను వివరించడంతోపాటు, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దు శశికాంత్‌భూషణ్, జి.రాజ్‌విమల్, షేక్ కపిల్‌బాషా, మాగులూరి ప్రేమ్‌కుమార్, మణి, దుర్గ, కొదమల రిచర్డ్స్, జెస్సీ దివాకర్, గంగవరపు ప్రణయ్ పాల్గొన్నారు. అలాగే 13వ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని దామచర్ల ప్రారంభించారు.

సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం

తెలుగుదేశం అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం సాధ్యపడుతుందని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 29వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రజలతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస సంక్షేమం, అభివృద్ధి కుంటుపడ్డాయన్నారు. టీడీపీ హయాంలోనే ఒంగోలు అభివృద్ధి సాధ్యపడిందని, నగరంలో రోడ్లు, డ్రైనేజ్‌ల నిర్మాణంతోపాటు, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ శ్రేణుల నుంచి దామచర్లకు ఘనంగా స్వాగతం లభించింది. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, పెద్ది వెట్టి వరలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి విజయ్‌కుమార్ • ఉప్పుగుండూరులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



గోల్డెన్‌ట్రీ అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి విజయసంకేతం చూపుతున్న బీఎన్



ఉప్పుగుండూరులో ప్రచారం నిర్వహిస్తున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 16: మహిళల అభ్యున్నతి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పేర్నమిట్ట సమీపంలోని సమతానగర్‌లోని గోల్డెన్‌ట్రీ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం మహిళలతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ విజయానికి మహిళలు కీలకభూమిక పోషించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదనే ఆందోళనతో అన్ని రకాల నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. అనంతరం బీఎన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.శంకర్, కల్లూరి వెంకటేశ్వర్లు, గోల్డెన్ ట్రీఅపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ పిన్నిక రవిబాబు, కన్నెగంటి శేషయ్య, డి.వీరాస్వామి, ఎం.శ్రీను, కె.శ్రీరామ్మూర్తి, ఆర్.సుధాకర్, ఆర్.రమేష్, జనసేన కార్పొరేటర్ మలగ రమేష్, బెజవాడ సుశీల, శ్రీలక్ష్మి, రాధిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి..అభివృద్ధి చేస్తా..

నాగులుప్పలపాడు: మీ అందరికి సుపరిచితుడైన తనను త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని, అన్ని వర్గాల వారి అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. ఉప్పుగుండూరు గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యతుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల ప్రభుత్వం తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంతో తనకు విడదీయ్యలేని అనుబంధం ఉందని, అందులో ఉప్పుగుండూరుపై తనకెంతో అభిమనం ఉందని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. రెండు చెరువుల మధ్య రోడ్డు ఏళ్ళ తరబడి అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో తక్షణమే నిధులు మంజూరు చేయించి సిమెంట్ రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. ఇరవై కోట్లకు పైగా నిధులు వెచ్చించి గ్రామంలో అనేక అభివృద్ధి పనులు తన హయాంలోనే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి, చంద్రన్న బీమా కింద గ్రామంలో రూ.50లక్షల పైచిలుకు అందించినట్లు తెలిపారు. తాను చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకొని సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే గా తనను గెలిపిచాలని విజ్ఞప్తి చేశారు. మోసపూరిత వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. ఇంటింటికి తిరిగి ప్రచార పత్రాలను అందజేశారు. తొలుత పార్కు వద్ద నున్న వినాయకుని గుడిలో పూజలు నిర్వహించి కోట్ల బజారు, రామమందిరం, బలిజకాలనీ, అంబేడ్కర్‌నగర్‌లలో ప్రచారం కొనసాగించారు. పార్టీ శ్రేణులు పూలవర్షంతో బీఎన్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, కనగాల శ్రీనివాసరావు, బి.సెల్వం, తిరుమలశెట్టి శ్రీను, తెలగతోటి జాన్సన్, నాగమల్లేశ్వరరావు, జంజనం సుబ్బయ్య, బీజేపీ మండల అధ్యక్షులు సురేష్, జనసేన నాయకులు పెంట్యాల కోటి, బాలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

- రెండు దశల్లో అడ్మిషన్లు
- మే 15నుంచి దరఖాస్తులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 16: ఇంటర్మీడియట్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లపై షెడ్యూల్‌ను ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సౌరబ్ గౌర్ విడుదల చేశారు. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలల్లో అడ్మిషన్లను ఈ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ప్రిన్సిపాల్స్‌ను ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. అడ్మిషన్లు రెండు దశల్లో నిర్వహిస్తారు. మే 15వ తేదీ నుంచి కళాశాలల్లో దరఖాస్తులు విక్రయిస్తారు. మే 22నుంచి పూరించిన దరఖాస్తులను స్వీకరించి విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తారు. మొదటి దశ అడ్మిషన్లు వేసవి సెలవులు అనంతరం కళాశాలలు పునః ప్రారంభమయ్యే జూన్ 1తో ముగుస్తుంది. ఆదేరోజు నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కూడా జూన్ 1 నుంచే తరగతులు ప్రారంభమవుతాయి. రెండో దశ అడ్మిషన్లకు జూన్ 10నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 1నాటికి అడ్మిషన్లు పూర్తి చేయాలి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీలకు 29శాతం, ప్రత్యేక అవసరాలగల విద్యార్థులకు 3శాతం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కు 5శాతం, సైనికోద్యోగులు, మాజీసైనికోద్యోగుల పిల్లలకు 3శాతం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం సీట్లను కేటాయించాలి. అడ్మిషన్లకు సంబంధించి ఎటువంటి ప్రవేశపరీక్షలు నిర్వహించకుండా కేవలం పదో తరగతి మార్కుల ఆధారంగానే అడ్మిషన్లు ఇవ్వాలి. కళాశాలల్లో గ్రూపుల వారీగా ఏ గ్రూపులో ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయో కళాశాలల్లో ప్రధాన ద్వారం వద్దే నోటీసు బోర్డులో ప్రకటించాలి. సీట్ల వివరాలు ప్రతిరోజు తాజా సమాచారం పొందుపర్చాలి. కళాశాలలకు అనుమతించిన మేరకు ప్రవేశాలు నిర్వహించాలి. జనరల్ సబ్జెక్టుల్లో సెక్షన్‌కు 88మంది, ఒకేషనల్‌లో పారామెడికల్ కోర్సులకు 30 మంది, ఇతర కోర్సులకు 40 మందికి మాత్రమే అనుమతి ఉంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు చేయాలి. అడ్మిషన్లలో బోర్డు నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ మొత్తాలు జరిమానాలు విధించడంతో పాటు కళాశాలకు బోర్డు గుర్తింపును కూడా రద్దు చేస్తామని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి హెచ్చరించారు.

రేపటి నుంచి చీమకుర్తిలో
నామినేషన్ల స్వీకరణ : జేసీ

చీమకుర్తి, ఏప్రిల్ 16: సాధారణ ఎన్నికలు నిర్వహణలో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసేవారు తమ నామినేషన్లను గురువారం నుంచి దాఖలు చేయవచ్చని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఆర్వో గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియను పక్కాగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకూ ఆదివారం అయిన 21వ తేదీ తప్ప ప్రతిరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటట వరకు నామినేషన్లను చీమకుర్తిలోని నూతన మున్సిపల్ కార్యాలయంలో స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. 200మీటర్ల దూరంలోనే తమ వాహనాలను నిలిపివేయాలని, 100 మీటర్ల తర్వాత నుంచి నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితోపాటు కేవలం ఐదుగురినే అనుమతిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించటానికి ఇప్పటికే శిక్షణలను పూర్తి చేశామని, మూడు తనిఖీ కేంద్రాలను, ఫ్లైయింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. డీఎస్పీ స్థాయి అధికారి నామినేషన్ల కేంద్రం వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారన్నారు. ఇప్పటి వరకూ 89మంది వలంటీర్లు రాజీనామా చేశారని, మరో పదిమందిని విధులనుంచి తొలగించామని పేర్కొన్నారు. 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు మే 3,4,5 తేదీల్లో మొదటిరౌండ్, 6,7,8తేదీల్లో రెండోరౌండ్ పోలింగ్ నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు .ఇప్పటి వరకూ 831మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్నిరకాల చర్యలు చేపట్టామన్నారు.



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

అవీ..ఇవీ..

రేపటి నుంచి రఘునాయకస్వామి కల్యాణోత్సవాలు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 16: ప్రసిద్ధిగాంచిన చదలవాడలోని శ్రీరఘునాయకస్వామి వారి కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో అనీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణ, శేష వాహనోత్సవం, 20న హంస వాహనోత్సవం, 21న సింహ వాహనోత్సవం, 22న హనుమంత వాహనోత్సవం, 23న గరుడ వాహనోత్సవం, 24న గజవాహనోత్సవం, 25న స్వామివారి కల్యాణం, అనంతరం రథోత్సవం జరుగుతుందన్నారు. 26న స్వామివారి పట్టాభిషేకం, అశ్వ వాహనోత్సవం, 27న వసంతోత్సవం, 28న ద్వాదశ ప్రదిక్షణలు, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

గ్రంథాలయాలను స్కూళ్లకు అనుసంధానం చేయాలి

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 16: జిల్లా కేంద్రాలలో, మండలాల్లో ఉన్న గ్రంథాలయాలను స్థానిక పాఠశాలలకు అనుసంధానం చేసి వేసవిలో గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మరో గ్రంథాలయ ఉద్యమ నాయకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఇతర నేతలతో కలిసి పౌర గ్రంథాలయ సంస్థ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌రెడ్డిని విజయవాడలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ ఇందుకు సంబంధించిన ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలని ఎస్‌పీడీ వి.శ్రీనివాసరావును ఆదేశించినట్లు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గ్రంథాలయాలలో సమ్మర్ క్యాంపులు నిర్వహించి అందులో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, సీఏ ప్రసాద్, టీవీఎస్.రమేష్, కాంతి, ఆళ్ల వెంకటరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ముగిసిన ఓపెన్ ఇంటర్ మూల్యాంకనం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 16: ఒంగోలులోని సెయింట్‌తెరిస్సా హైస్కూలులో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం మంగళవారంతో ముగిసింది. సోమవారం సాయంత్రానికి పేపర్లు దిద్దడం పూర్తి కాగా మంగళవారం వాటి స్క్రూట్నీ, బిల్లుల పరిశీలన పూర్తయింది. జిల్లాలో సుమారు 25వేల జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. మూల్యాంకనాన్ని పర్యవేక్షించేందుకు ఓపెన్ స్కూలు సొసైటీ రాష్ట్ర కార్యాలయం నుంచి అక్బర్‌అలీ పరిశీలకులుగా రాగా క్యాంప్ ఆఫీసర్‌గా డీఈవో డి.సుభద్ర, స్కూలు సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డిలు పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూము ఇన్‌చార్జిగా ప్రభుత్వ పరీక్షల సహాయకమిషనర్ కె.శివకుమార్ వ్యవహరించారు. మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు.

నవయుగ వైతాళికుడు 'కందుకూరి'

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 16 : నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త, స్త్రీ విద్యకై ఉద్యమించిన మహనీయుడు కందుకూరి వీరేశలింగంపంతులు అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగంపంతులు జయంతి వేడుకలను ఉపగ్రంధ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా సిబ్బంది, పాఠకులు వీరేశలింగంపంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధించటమే కాకుండా సంఘ సంస్కరణ భావాలను కూడా వారిలో నింపిన గొప్పవ్యక్తి వీరేశలింగం పంతులు అన్నారు. వివేకవర్ధని పత్రిక ద్వారా సంఘంలోని అవకతవకలను ఎత్తిచూపి, దురాచారాల నిర్మూలనకు ఆయన కృషిచేశారన్నారు. కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, జి.శాంసన్, కె.కృష్ణవేణి, వై.మృదుల్‌కుమార్, ఎన్.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు

శ్రీరామనవమి శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16 : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు మంగళవారం శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. వసంత నవరాత్రుల చివరి రోజైన చైత్ర నవమి నాడు శ్రీరామ నవమి పండుగను దేశ ప్రజలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. సీతారామచంద్రులను ఆదర్శంగా తీసుకొని జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

23న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 16: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరం చివరి పనిదినమైన ఈనెల 23న ప్రోగ్రెస్ కార్డులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేరోజు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాఠశాలలో సమావేశాలు నిర్వహించి వారికి తమ పిల్లల ప్రగతిని వివరించాలన్నారు. తల్లిదండ్రులు వందశాతం మంది సమావేశానికి హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహిస్తున్న వార్షిక పరీక్షలు ఒక్క 9వ తరగతి మినహా మిగిలిన అన్ని తరగతులకు ముగిశాయి. 9వ తరగతికి 18వతేదీతో ముగుస్తాయి. జవాబు పత్రాలను వెంటనే మూల్యాంకనం చేసి ఈనెల 22 నాటికి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డుల్లో కూడా మార్పులు చేశారు. పిల్లల నుంచి వారి తరగతి పాఠ్యపుస్తకాలను వెనక్కు తీసుకోవద్దని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16 : త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.రవి పిలుపునిచ్చారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వీఆర్వోలు, మహిళా పోలీసులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్లు వీఎస్.జ్యోతితో పాటు డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

గణిత అధ్యాపకులకు శిక్షణ

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 16: ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో మంగళవారం గణిత అధ్యాపకులకు శిక్షణ ప్రారంభమైంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన 40 మంది అధ్యాపకులకు ఐదు రోజుల పాటు శిక్షణ కొనసాగనుంది. కమిషనర్ ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.సుమన్ రిసోర్స్‌పర్సన్‌గా పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.కళ్యాణి, కె.కెజియా, ఎన్.నాగేంద్ర, ఎన్.మంజులభారతి, బి.శ్రీనివాసరావు, బీఎన్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీ సమయంలో వాహనదారులు పోలీసులకు సహకరించాలని మద్దిపాడు ఎస్సై మహేష్ కోరారు. మంగళవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నగదు, మద్యం విషయంలో నిఘా పెంచామని, ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

మద్దిపాడు, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈబీ అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆశాఖ సీఐ మార్య బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మద్దిపాడులో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితునికి చేయూత

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 16: అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితునికి రెడ్‌క్రాస్ ప్రతినిధి చేయూతనందించారు. మట్టిగుంట గ్రామానికి చెందిన జెట్టి రాజేష్‌కు చెందిన పూరిల్లు విద్యుదాఘాతంతో పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పి.ప్రకాష్‌బాబు స్పందించి మంగళవారం బాధితుడు రాజేష్‌కు టెంటు, దుప్పట్లు, దోమతెరలు, వంటసామగ్రిని గ్రామ సర్పంచ్ పాలేరు అనీలా నాగేశ్వరరావు, తెలగతోటి శామ్యూల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తెలగతోటి సుబ్బయ్య పాల్గొన్నారు.



సామగ్రిని అందజేస్తున్న ప్రతినిధులు

పాకలలో వైసీపీకి భారీ షాక్.!

వేమిరెడ్డి ప్రధాన అనుచరుడు గోళ్లమూడి టీడీపీలో చేరిక

ఆయన ఆధ్వర్యంలో సైకిలెక్కిన మరో 100 కుటుంబాలు

సింగరాయకొండ, ఏప్రిల్ 16 : సార్వత్రిక ఎన్నికలకు సమయం ముంచుకొస్తున్న వేళ సింగరాయకొండ మండలంలో టీడీపీలోకి వలసల జోరు కొనసాగుతోంది. పాకలలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, ప్రముఖ వ్యాపారవేత్త గోళ్లమూడి శ్రీనివాసరెడ్డి సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, ఎమ్మెల్సీ రామారావు సమక్షంలో ఆయనతోపాటు, 100 కుటుంబాల అనుచరులు సైకిలెక్కారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థంపుచ్చుకున్న వల్లెపు

మండలంలోని కలికివాయి గ్రామానికి చెందిన రాష్ట్ర వడ్డెర ఐక్యవేదిక మాజీ అధ్యక్షుడు, ప్రముఖ బీసీ నాయకుడు వల్లెపు రాఘవులు సొంత గూటికి చేరారు. సోమవారం మండలంలోని పాకలలో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే స్వామి, సత్య సమక్షంలో ఆయన తెలుగుదేశంలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కుండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వల్లెపు రాఘవులు 2007లో టీడీపీ తరపున జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా బరిలో నిలిచారు. ఆతరువాత 2009లో కందుకూరు ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ హైదరాబాద్‌లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.





ఎమ్మెల్యే స్వామి, సత్య, బాలాజీ సమక్షంలో పార్టీలో చేరిన గోళ్లమూడి శ్రీనివాసులరెడ్డి, వల్లెపు రాఘవులును పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీద, స్వామి, సత్య

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కూడా..

పాతసింగరాయకొండ పంచాయతీ పరిధి బాలరెడ్డినగర్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సమన్వయ కమిటీ సభ్యుడు పొట్లూరి లక్ష్మయ్య, వైసీపీ చెందిన 20 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే స్వామి, సత్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ముస్లింల అభ్యున్నతి

కొండపి ఎమ్మెల్యే స్వామి

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు

సింగరాయకొండ, ఏప్రిల్ 5 : రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని కూటమి కొండపి అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానికంగా టీడీపీ ముస్లిం నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేవంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లింలను దగా చేసిన మోసకారి జగన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వంలో పేద ముస్లిం యువతుల వివాహ ఖర్చులకు దుల్హాన్ పథకం కింద రూ.50 వేలు ఇచ్చామని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూడున్నరేళ్ల ఆపథకాన్ని నిలిపేసి తర్వాత కొర్రీలు పెట్టి నిర్వీర్యం చేసిందన్నారు. పేద ముస్లింలకు టీడీపీ హయాంలో ఇచ్చిన రంజాన్ తోఫాను రద్దుచేసి వారి నోట్లో మన్ను కొట్టారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో హజ్‌యాత్రకు వెళ్లడానికి ఆర్థిక సహాయం అందజేశామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో స్థానిక షాదీఖానా పైఅంతస్తు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేయిస్తే వైసీపీ ప్రభుత్వంలో ఆ పనులను కూడా చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. రూ.10లక్షలతో పాకల రోడ్డులో ముస్లిం శ్మశానవాటికను అభివృద్ధి చేశామని తెలిపారు. ఈద్గా మిట్టలో దాదాపు రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం రూ.25 లక్షలతో తాగునీటి పైపులైన్‌ను, రూ.20 లక్షలతో ఈద్గా చుట్టూ ప్రహరీని నిర్మించామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలకు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని తెలిపారు. బీజేపీ పొత్తు వలన ముస్లింలకు నష్టం జరుగుతుందని వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. 2014-19 బీజేపీతో పొత్తులో ఉన్నపుడే ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ కృషి చేసిందని వివరించారు. వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముస్లింలకు చేసిన మేలును గడపగడపకూ వెళ్లి వివరించి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, అజీం, యస్థాని, గౌస్, జాకీర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

టంగుటూరు : రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ కూటమి నాయకులు అన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని ప్రజలను కోరారు. పంచాయతీ పరిధి వాణీనగర్‌లో మంగళవారం ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, ప్రజలు సుఖసంతోషాలతో కొనసాగాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని సూచించారు. జగన్ పాలనలో గుండాగిరి, దౌర్జన్యాలు, దోపిడీలు, ఆక్రమణలు నిత్యకృత్యమయ్యాయని ధ్వజమెత్తారు. ఇలాంటి దుర్మార్గపు పాలనను అంతమొందించి ప్రజాప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకే కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట, ఎమ్మెల్యే అభ్యర్థి డోలాకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు కామని విజయకుమార్, రాంబాబు, బెల్లం కోటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, సర్పంచ్ మద్దిరాల మమత, తోకల భారతి, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, వాణీనగర్ టీడీపీ నాయకుడు మొలకలపల్లి శ్రీనివాసరావు, దయానందం, జక్కుల శ్రీను, కుందేటి వెంకట్రావు, యజమాని, పెద్దోడు పాల్గొన్నారు



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న మాజీ ఎంపీపీ చంద్రశేఖర్

రేపు కాంగ్రెస్ అభ్యర్థి సతీష్ నామినేషన్

కొండపి, ఏప్రిల్ 16 : కొండపి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శ్రీపతి సతీష్ గురువారం ఉదయం 10.45 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌వోకు పత్రాలను అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గంలోని ఆరు మండలాల కాంగ్రెస్, వామపక్షాలు, ఆప్ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

మంత్రి సురేష్‌శ్రీరామనవమి శుభాకాంక్షలు

టంగుటూరు, ఏప్రిల్ 16 : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని శ్రీరామచంద్రుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

చెట్టును ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

బాపట్లరూరల్, ఏప్రిల్ 16 : రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంగళవారం అప్పికట్ల గ్రామసమీపంలో చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చీరాల మండలం తోటవారిపాలెం గ్రామానికి చెందిన కిరణా వ్యాపారి గంగాధర్ అదేగ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గుండుబోయన శ్రీనివాసులతో కలిసి ఆటోలో గుంటూరుకు కిరణా సరుకుల కోసం వెళుతుండగా అప్పికట్ల గ్రామసమీపంలోని నల్లమడ కాల్వ మలుపు వద్ద ఆటో అదుపుతప్పి చెట్టును వేగంగా ఢీకొట్టారు.. ఈఘటనలో ఆటోడ్రైవర్ గుండుబోయన శ్రీనివాసులు(24) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న మరో వ్యక్తి గంగాధర్‌కు గాయాలు కావటంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియావైద్యశాలకు పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు.

టీడీపీలో చేరికలు

కురిచేడు, ఏప్రిల్ 16: కురిచేడు మండలం పడమర వీరాయపాలేనికి చెందిన 50 కుటుంబాలు సోమవారం రాత్రి టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు పిడతల నెమిలయ్య ఆధ్వర్యంలో కడియాల రమేష్, మరికొందరు పార్టీలో చేరారు. వారికి మండల నాయకులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

రవికుమార్‌పై గురిపెట్టిన వైసీపీ

వైవీ స్వగ్రామంలో అర్ధరాత్రి పోలీసుల హడావుడి

టీడీపీ కార్యకర్త ఇంట్లో సోదాలు

సోదాలు చేస్తున్నంతసేపు బెదిరింపులు

దొరికింది రూ.3.44 లక్షలు

బలవంతంగా సంతకం చేయించిన పోలీసులు

మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో

పలువురు టీడీపీలో చేర్పించడంలో అతను కీలకపాత్ర

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అద్దంకి ఎమ్మెల్యే, టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ లక్ష్యంగా అధికార వైసీపీ దురాగతాలకు మరోసారి తెరలేపింది. రవికుమార్ వ్యాపార లావాదేవీలను స్తంభింపజేసిన జగన్ ప్రభుత్వం తాజాగా ఎన్నికల్లో ఆయన అనుచరులను భయభ్రాంతులకు గురిచేసేలా పాల్పడింది. సాక్షాత్తు సీఎం బాబాయి, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి స్వగ్రామంలో టీడీపీ కార్యకర్త ఇంటిపై భారీసంఖ్యలో పోలీసులు దాడిచేసి హడావుడి చేయటమే అందుకు నిదర్శనం ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జరిగింది. మూడురోజుల క్రితం ఆ గ్రామంలో రవికుమార్ ప్రచారం నిర్వహించి కొత్తగా బలహీనవర్గాలకు చెందిన పలువురిని టీడీపీలో చేర్చుకునే కార్యక్రమంలో ముఖ్యపాత్ర పోషించిన కార్యకర్త ఇంటిపై పోలీసులు ఈ దాడులు చేయటం రాజకీయంగా సంచలనమైంది. రవికుమార్ లక్ష్యంగా అధికారపార్టీ అగ్రనేతల ఆదేశాలతోనే ఈ హడావుడి జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

మేదరమెట్లలో పోలీసుల బరితెగింపులు

నియోజకవర్గంలో రాజకీయంగా కీలక గ్రామాల్లో మేదరమెట్ల ఒకటి అది వైవీ సుబ్బారెడ్డి స్వగ్రామం కూడా ఇటీవల ఆ గ్రామంలో వైసీపీ నాయకులతో పాటు వివిధ వర్గాలకు చెందిన బలమైన వ్యక్తులు టీడీపీలో చేరిపోయారు. మాజీ ఎమ్మెల్యే గరటయ్య వర్గం టీడీపీ బాటపట్టింది. మూడురోజుల క్రితం రవికుమార్ ఆ గ్రామంలో కొంతసేపు ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన వైసీపీ శ్రేణులు ఆ రోజు రవికుమార్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. వారు రవికుమార్‌కు మద్దతు ప్రకటించటంతో టీడీపీకి చెందిన సీనియర్ కార్యకర్త బోయపాటి శివశంకర్ తన వంతు పాత్ర పోషించాడు. దీంతో వైసీపీ నాయకత్వంలో మరింత వణుకు పుట్టింది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత పోలీసులు పెద్ద సంఖ్యలో శివశంకర్ ఇంటిని చుట్టుముట్టారు. చీరాల డీఎస్పీ ప్రసాదు ఆధ్వర్యంలో ఆయన పరిధిలోని ముగ్గురు సీఐలు సుమారు పదిమంది ఎస్సైలు పెద్దసంఖ్యలో పోలీసులు ఈ దాడిలో పాల్గొన్నారు. నిద్రిస్తున్న శివశంకర్ కుటుంబీకులను లేపి ఇళ్లంతా సోదా చేశారు. సుమారు నాలుగు గంటల పాటు అణువణువు సోధించారు. చిరు వ్యాపారి అయిన శివశంకర్ ఇంట్లో కేవలం రూ.3.44లక్షలు మాత్రమే దొరికాయి. ఆ డబ్బుకు సంబంధించి ఆధారాలను శివశంకర్ చూపించారు. పొలం అమ్మిన అగ్రిమెంట్ అడ్వాన్స్‌గా రెండు లక్షలు రావటాన్ని చూపించారు. తన కుమార్తెను ఇంజనీరింగ్‌లో చేర్పేందుకు కొంత డబ్బు ఉంచుకున్న విషయాన్ని చెప్పారు. ఆయన భార్య డ్వాక్రా గ్రూపు లీడర్ కావటంతో అందుకు సంబంధించి నిల్వ ఉన్న డబ్బు వివరాలను తెలిపారు. ఆయినా పోలీసులు వాటిని పరిగణనలోకి తీసుకోకుండా డబ్బును అక్రమంగా నిల్వ ఉంటే పట్టుకున్నట్లుగా సంతకం చేయాలని బలవంతం చేసినట్లుగా తెలిసింది. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్నికల్లో వినియోగించేందుకు డబ్బు నిల్వ ఉంచినట్లు రాసి ఆ మేరకు బలవంతంగా బెదిరించి ఆయన సంతకం తీసుకున్నట్లు తెలుస్తోంది. బాధితుడు ఆ విషయాన్ని బహిరంగంగానే చెప్పి వాపోతున్నాడు. మేదరమెట్ల నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేసే లక్ష్యంతోనే వైసీపీ అగ్రనేతల సూచనలతో ఈ వ్యవహారం సాగినట్లు టీడీపీ నాయకులు అనుమానిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో ఈ బెదిరింపు రాజకీయాలు ఏంటని సామాన్య ప్రజానీకం విస్తుబోతున్నారు. ఈ ఘటనపై న్యాయపరంగా, చట్టపరంగా తాడో పేడో తేల్చుకునేందుకు టీడీపీ సిద్ధమవుతోంది.

దర్శిలో కదంతొక్కిన బీసీలు

టీడీపీ జయహో బీసీ విజయవంతం

తండోపతండాలుగా తరలివచ్చిన ప్రజలు

పలుసంఘాల నాయకులు హాజరు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

నియోజకవర్గ కేంద్రమైన దర్శిలో మంగళవారం సాయంత్రం బలహీన వర్గాలకు చెందిన ప్రజానీకం కదంతొక్కారు. జయహో బీసీ, జైజై టీడీపీ అంటూ నినాదాలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, వారు వేసిన నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగిపోయింది. బీసీల మద్దతు చూసి తెలుగుదేశం పార్టీ కూటమి నాయకుల ఉప్పొంగిపోయారు. సభలో ఆయా బీసీ సంఘాల చేసిన ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది.

దర్శి నియోజకవర్గ టీడీపీ కూటమి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బీసీ సదస్సును దర్శిలోని కురిచేడు రోడ్డులో నిర్వహించారు. నియోజక వర్గంలోని దాదాపు అన్నిప్రాంతాల నుంచి బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఊహించని విధంగా సభకు తరలివచ్చారు. నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గంతో పాటు ఇతరత్రా వివిధ బలహీన వర్గాలకు చెందిన సామాజకవర్గాలవారు ఉన్నారు. ఆదినుంచి టీడీపీతో ఉన్నవారితో పాటు ఆ యా బలహీన వర్గాలకు చెందిన ఆయా ఉప కులాల సామాన్య ప్రజలు కూడా తరలిరావటం విశేషం. కూటమి అభ్యర్థిగా డాక్టర్ లక్ష్మి నియోజకవర్గానికి వచ్చిన తొలిరోజు జరిగిన స్వాగత కార్యక్రమం ఒక హైలెట్. ఇప్పటికే పలువర్గాల ఆత్మీయ సదస్సులలో ఆమె పాల్గొన్నారు. మంగళవారం కేవలం బీసీలతో సదస్సు పెట్టగా, కేవలం నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో తరలివచ్చారు. దొనకొండ, దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్ళూరు మండలాల్లోని దాదాపు అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో బలహీన వర్గాల ప్రతినిధులు రావటం స్పష్టంగా కనిపించింది. బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్న గ్రామాల నుంచి అయితే ప్రత్యక వాహనాల్లో తరలివచ్చారు. వారి సంఖ్య తక్కువగా ఉన్న గ్రామాల నుంచి ఆయా వర్గాల ప్రతినిధులు ద్విచక్ర వాహనాలపై స్వచ్ఛందంగా రావటం కనిపించింది.సభకు తరలిరావటం ఒక ఎత్తయితే, సభలో నాయకుల ప్రసంగాల్లో వారు సానుకూలంగా స్పందించిన తీరు అద్భుతం. బీసీ నుంచే తెలుగుదేశం పుట్టిందని కూటమి అభ్యర్థిడాక్టర్ లక్ష్మి అన్నప్పుడు సభికుల నుంచి పెద్దస్థాయిలో కేరింతలు వ్యక్తం మయ్యాయి. ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీని వాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి, సదస్సు నిర్వహణలో కీలక పాత్ర పోషించిన టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నూకసాని బాలాజీతో పాటు యాదవ, రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, విశ్వబ్రాహ్మణ బెస్త, ముదిరాజ్.. ఇలా ఆయా బలహీన వర్గాలకు చెందిన నాయకులు కూడా సభలో పాల్గొని కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మికి మద్దతు ప్రకటించారు.



జయహో బీసీ సదస్సుకు హాజరైన ప్రజలు

మాదిగల అభ్యున్నతిపై చర్చకు సిద్ధమా?

వైసీపీ నాయకులకు తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి రమేష్ సవాల్

కొండపి, ఏప్రిల్ 16 : కొండపి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో మాదిగల అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందన్న దానిపై చర్చకు సిద్ధమా అని వైసీపీ నేతలకు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఐనంపూడి రమేష్ ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలంలో టీడీపీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గం నుంచి మాదిగలు భారీగా హాజరయ్యారన్నారు. ఇది చూసి ఓర్వలేక మాదిగలపై, కొండపి ఎమ్మెల్యే స్వామి, సత్యలపై వైసీపీ నాయకులు, నీలి మీడియా అవాకులు, చవాకులు పేలుతున్నదని ఆయన విమర్శించారు. మాదిగల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడింది టీడీపీయేనని రమేష్ అన్నారు. వైసీపీ పాలనలో మాదిగలతోపాటు, మాలలు, ఇతర ఎస్సీ కులాలకు అన్యాయం జరిగిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎస్సీల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేసిన వైసీపీ అన్ని కులాల వారికి ఆ నిధులను పంచిందని విమర్శించారు. సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిందన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. 2014 నుంచి కొండపి నియోజకవర్గంలోని మాదిగ పల్లెలను ఎమ్మెల్యే స్వామి అభివృద్ధి చేశారన్నారు. దాన్ని తాను చూపిస్తానన్నారు. 2019 నుంచి ఎర్రగొండపాలెంలోని మాదిగ పల్లెల్లో ఏమి అభివృద్ధి జరిగిందో? నిరూపించేందుకు సిద్ధమేనా? అని రమేష్ సవాల్ చేశారు. మంత్రి సురేష్ రెండు సార్లు ఎర్రగొండపాలెంలో, ఒకసారి సంతనూతలపాడులో గెలిచి మాదిగలకు ఏమి న్యాయం చేశారో నిరూపించుకోవాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మాదిగలను దూరంగా పెట్టే మంత్రి సురేష్ ఇప్పుడు ఆ పల్లెలకు వెళ్లి నేను మీబిడ్డనని చెప్పుకుని ఓట్లు అడుక్కోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలోని, కొండపి నియోజకవర్గంలోని మాదిగలంతా టీడీపీ వెంటే ఉన్నారని, సురేష్ కల్లబొల్లి మాటలను మాదిగ సామాజికవర్గం నమ్మే పరిస్థితి లేదని రమేష్ పేర్కొన్నారు.

వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలతో వలంటీర్స్

టంగుటూరు, ఏప్రిల్ 16 : మండలంలోని అనంతవరం గ్రామ సచివాలయం పరిధిలోని 16 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. ఆ పత్రాలను మంగళవారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు అందజేశారు. అనంతవరం సచివాలయ పరిధిలో ఆ గ్రామంతోపాటు వెలగపూడి పంచాయతీలున్నాయి. అనంతవరం పంచాయతీలో 12 మంది, వెలగపూడి పంచాయతీలో ఐదుగురు వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో అనంతవరంలోని కోండ్రు కల్యాణి మినహా మిగిలిన వలంటీర్లంతా రాజీనామా చేశారు. 'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎలాగూ తొలగిస్తారు. ఇప్పుడు రాజీనామా చేస్తే వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టగానే మిమ్మల్నే కొనసాగిస్తుంది. అందుకే రాజీనామాలు చేయండి' అని వలంటీర్ల అసోసియేషన్ కొండపి నియోజకవర్గ నాయకుడి పిలుపు మేరకు తామంతా రాజీనామాలు చేసినట్లు వలంటీర్లు చెప్పారు.

ట్రాక్టర్ వరిగడ్డి దగ్ధం



మంటను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొండపి, ఏప్రిల్ 16 : వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధమైంది. ఈ సంఘటన మర్రిపూడి మండలం జువ్విగుంటలో మంగళవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది కథనం మేరకు.. జువ్విగుంటకు చెందిన మారెడ్డి ఏడుకొండలు తన పొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తున్నారు. ఈ సమయంలో విద్యుత్‌తీగలు తగలడంతో ఒక్కసారిగా వరిగడ్డికి మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న కొండపి అగ్నిమాపక కేంద్రం అధికారి సిహెచ్.వెంకటరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. గడ్డిమొత్తం దగ్ధమవడంతో రూ.25వేల నష్టం వాటిల్లినట్లు వెంకట్రావు తెలిపారు. స్థానికులు గడ్డిని కిందకు లాగడంతో ట్రాక్టరుకు ఏమీ కాలేదు.

28 మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై బాజీబాబు

కొండపి, ఏప్రిల్ 16 : మండలంలోని ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న షేక్ రహీంను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 28 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రహీం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణబాజీ బాబు తెలిపారు.

టీడీపీతోనే మార్కాపురం జిల్లా

- ప్రచార కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకుల హామీ
- నారాయణరెడ్డికి మద్దతుగా జోరుగా చేరికలు



మార్కాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మాగుంట చందన, కందుల వసంతలక్ష్మి

మార్కాపురం, ఏప్రిల్ 16: మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు టీడీపీతోనే సాధ్యమౌతుందని టీడీపీ నాయకులు మాగుంట చందన, కందుల వసంత లక్ష్మిలు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాగళంలో భాగంగా ఇంటింటికీ మీ కందుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే మహిళలకు రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. మహిళల సాధికారతకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సీఎం జగన్ నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. జె బ్రాండ్ లిక్కర్‌తో పేదల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కందుల నారాయణరెడ్డిలను రాబోయే ఎన్నికలలో గెలిపించి మార్కాపురం ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, మాజీకౌన్సిలర్ మర్రి జాన్సీరాణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలోకి కార్యకర్తలకు ఆహ్వానిస్తున్న కందుల రామిరెడ్డి



సిద్ధవరంలో సూపర్‌సిక్స్ పథకాల బాండ్లు అందజేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

మార్కాపురం, ఏప్రిల్ 16: భావితరాల కోసమే టీడీపీకి మద్దతు తెలుపుతున్నట్లు టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు తెలిపాయి. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ మార్కాపురం నియోజకవర్గం పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో 52 బూత్ వైసీపీ కన్వీనర్ షేక్ మహబూబ్ బాష, షేక్ సుభానీ, పి.నాగార్జునరెడ్డి, దుగ్గి వెంకటేశ్వరరెడ్డి, బోగాని నాగయ్య, జోగి ప్రసాదు, బాలకోటి ఆంజనేయులు, తదితర 30 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : మండలంలోని సిద్ధవరం గ్రామంలో మంగళవారం ఇంటింట ప్రచార కార్యక్రమం కందుల నారాయణరెడ్డి తనయుడు విగ్నేష్‌రెడ్డి నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ఎన్డీఏ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి, కందుల నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ప్రతి ఒక్కరికి అభివాదం చేస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ 6 పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈసూపర్‌సిక్స్ పథకాలతో బడుగు బలహీన వర్గాలతోపాటు అన్నీ వర్గాల ప్రజల అభివృద్ధి దోహదం చేస్తాయని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి, ఎంపిఅభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కందుల విగ్నేష్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు అడుగు అడుగున పూలతో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో సిద్ధవరం గ్రామ నాయకులతోపాటు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్యాభర్తలపై గొర్రెల దొంగలు దాడి



గొర్రెలను కాపాడుకొనే క్రమంలో మహిళ చేతిపై కత్తివేటు

కంభం (అర్ధవీడు), ఏప్రిల్ 16 : రాత్రివేళ గొర్రెలకు కాపలాగా ఉన్న వారిపై గొర్రెల దొంగలు దాడి చేశారు. దీంతో ఒకరి చేతికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం గ్రామానికి చెందిన నాగరాజు, రాధిక దంపతులు గొర్రెలను మేపుకొని జీవిస్తున్నారు. సోమవారం రాత్రి తమ గొర్రెలకు కపలాగా గొర్రెల మంద వద్ద నిద్రించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కొంతమంది దొంగలు మంద లోని గొర్రెలను ఎత్తుకుని వెళుతుండగా అలికిడి వచ్చింది. దీంతో భార్యభర్తలు దొంగలను అటకాయించారు. ఈ క్రమంలో దొంగలు కత్తులతో దాడిచేయగా నాగరాజుకు స్వల్పగాయాలయ్యాయి. రాధిక చేతికి తీవ్ర గాయమైంది. గాయపడిన ఇరువురిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంగళగిరి వైద్యశాలకు తరలించారు. అర్ధవీడు పోలీసులు కేసు నమోదు చేసుకకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు



గ్యాస్ సిలెండర్ నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న సిబ్బంది

కంభం, ఏప్రిల్ 16 : ఓ బహుళ అంతస్తులలో, ఫ్యాక్టరీలో ఆకస్మి కంగా జరిగే అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో కంభం అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం కంభంలోని బియ్యం రైస్‌మిల్లులో పని చేసే కార్మికులకు అనుకోకుండా జరిగే అగ్ని ప్రమాదాలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. అలాగే నీరు, ఇతర పరికరాలను అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అగ్నిమాపక అధికారి డి.పిచ్చయ్యచౌదరి తెలిపారు.

అర్ధరాత్రి విద్యుత్ స్తంభం కూల్చివేత

పొదిలి, ఏప్రిల్ 16 :అర్ధరాత్రి గుర్తు తెలియని అగంతకులు విద్యుత్ స్తంభం కూల్చివేసిన ఘటన పట్టణంలోని పాత పంచాయతీ కార్యాలయం ఎదుట కాలనీలో సోమవారం చోటుచేసుకొంది. అర్ధరాత్రి ఎవరో తెలియని అగంతకులు ఎక్సకవేటర్‌తో స్తంభాన్ని కూల్చివేశారు. దీంతో రాత్రి కంటిమీద కునుకు లేకుండా గడిపామని కాలనీవాసులు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయానికి కారకులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.

మినీలారీ ఆర్టీసీ బస్సు ఢీ

పొదిలి, ఏప్రిల్ 16 : మినీలారీ వాహనం, ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పొదిలి, ఒంగోలు ప్రధాన రహదారిలో ఒకదాని వెంబడి ఒకటి బస్సు, మినీలారీ వాహనం ఒంగోలు వైపునకు వెళుతున్నాయి. ఈక్రమంలో ముందు వెళుతున్న మినీలారీ వాహనం డ్రైవర్ టిఫిన్ చేయడం కోసం ఆకస్మికంగా వాహనాన్ని పక్కకు తీశాడు. దీంతో ప్రమదవశాత్తు వెనువైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు మినీలారీని బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మినీలారా వాహన డ్రైవర్‌కు స్వల్పగాయమైంది. బస్సులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సైదా



మార్కాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఇండియా క్లబ్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 16:నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయనున్నట్లు ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ సైదా పేర్కొన్నారు. మార్కాపురంలో మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. మార్కాపురం జిల్లా సాధనకు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా అన్ని రాజకీయ పక్షాలను, ప్రజాసంఘాలను కూడగట్టి 65 రోజుల పాటు పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టు సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడిందని అన్నారు. సమావేశంలో ఇండియా కూటమి నాయకులు అందె నాసరయ్య(సీపీఐ), దగ్గుబాటి సోమయ్య(సీపీఎం), వి.సుదర్శన్(ఆప్), షేక్‌సుబానీ, షేక్ రెహానాబాను కోదారి వెంకటరత్నం, షేక్ ఖాశిం, డి.రఫీ, గుమ్మా బాలనాగయ్య, రూబెన్, రాజు, నన్నేసా తదితరులు పాల్గొన్నారు.

176 మంది వలంటీర్లు రాజీనామాలు ఆమోదం

పుల్లలచెరువు, ఏప్రిల్ 16: ఎర్రగొండపాలెం నియోజవర్గంలో వలంటీర్ల రాజీనామా కొనసాగుతుంది. నియోజకవర్గంలో వై.పాలెం మండలం మినహా మిగిలిన 4 మండలాల్లో ఈ ఒక్క రోజే 176 మంది వలంటీర్లు రాజీనామాను ఎన్నికల అధికారులు ఆమోదించారు. పుల్లలచెరువు మండలంలో 69 మంది, దోర్నాల మండలంలో నలుగురు, పెద్దారవీడు 60 మంది, త్రిపురాంతకం 43 మంది వలంటీర్లు రాజీనామాలు ఆమోదం పొందాయి. నాలుగు మండలాల ఎంపీడీవోలు వారి రాజీనామాలను ఆమోదించారు. వలంటీర్లు వ్యక్తిగతంగా రాజీనామాలు చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, అధికారపార్టీ నాయకుడి ఒత్తిడితో రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

వైసీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకం

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 16 : వైసీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని గిద్దలూరు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి జగన్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నవ రత్నాల పేరుతో నవమోసాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. గిద్దలూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా 13వ రోజు అర్ధవీడు మండలంలోని అచ్చంపేట, బొల్లుపల్లె, పాపి నేనిపల్లి, అంకభూపాలెం, నారంపల్లి, అర్ధవీడు, చీమలేటిపల్లి, దొనకొండ, వీరభద్రాపురం, కొత్తూరు, అయ్యవారిపల్లి, చింతమల్లెలపాడు, చిన్నకందుకూరు, పెద్దకందుకూరు, శంకరాపురం, మొహిద్దీన్‌పురం, బోగోలు గ్రామాల్లో పర్యటించారు. అశోక్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామాల్లోని టీడీపీ శ్రేణులు, గ్రామ ప్రజలు, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరిని కలిసి ఆప్యాయంగా మాట్లాడుతూ.. పర్యటనను కొనసాగించారు. మే 13న జరిగే ఎన్నికల్లో గిద్దలూరు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో మీ ఇంటి బిడ్డకు, పక్క నియోజకవర్గానికి చెందిన వ్యక్తికి మధ్య జరిగే పోటీ అని తనను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అర్ధవీడు మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న అశోక్‌రెడ్డి



కార్యకర్తలను టీడీపీలోనికి ఆహ్వానిస్తున్న దివ్యేష్

ముత్తుముల తనయుడి ప్రచారం

బేస్తవారపేట, గిద్దలూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించడమే అశోక్‌రెడ్డి లక్ష్యమని ఆయన తనయుడు దివ్యేష్ ప్రజలకు వివరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బేస్తవారపేట మండలంలోని పీవీ.పురం, బసినేపల్లె పంచాయతీలోని ముఖ్య నాయకులతో, కార్యకర్తలతో సమావేశమయ్యారు. టీడీపీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెన్నివారిపల్లెలో వైసీపీ నుంచి టీడీపీలోకి పది కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో విస్తృత ప్రచారం

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని పిఆర్‌కాలనీ, అర్బన్ కాలనీలలో ముత్తుముల అశోక్‌రెడ్డి సతీమణి పుష్పలీల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిం చారు. టీడీపీ, జనసేన, బీజేపీ మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు.

రాచర్ల మండలం ఆకవీడు పంచాయతీలోని ఆరవీటికోట, కొత్త్రారు గ్రావాలలో అశోక్‌రెడ్డి గీత ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా తన అన్న ముత్తుముల అశోక్‌రెడ్డి రాజకీయాల్లోకి అడుగు పెట్టాడన్నారు. ఆ సంకల్పంతోనే ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టారన్నారు. మళ్లీ ఆయన్ను గెలిపించాలని అభ్యర్థించారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పుష్పలీల

టీడీపీలో చేరిన పుల్లారెడ్డి

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 16 : వైసీపీ నాయ కుడు పల్లె పుల్లారెడ్డి ఆ పార్టీని వీడి మంగళ వారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు ముత్తుము ల క్రిష్ణకిశోర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానిం చారు. మే 13న జరిగే ఎన్నికలలో అశోక్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తానని పుల్లారెడ్డి ఈ సందర్భంగా అన్నా రు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు షాన్షావలి, కౌన్సిలర్ లొక్కు రమేష్, గడ్డం భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయ కులు రామచంద్రరెడ్డి, బిల్లా రమేష్, వెంకటరామిరెడ్డి, మండ్ల శ్రీను తదితరులు ఉన్నారు.



టీడీపీలో చేరిన పుల్లారెడ్డి

స్వర్ణాంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందాం సహకరించండి

గూడూరి చల్సియా, అజిత్ అభ్యర్థన

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 16: టీడీపీని గెలిపించడం ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించుకుందామని ప్రజలు సహకరించాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు కుమార్తె, కుమారుడు గూడూరి చల్సియా, అజిత్‌లు ఓటర్లను అభ్యర్థించారు. దోర్నాలలోని పాత సినిమా హాలు వెనుక వీధి, కొత్త మసీదు బజా రు, శ్రీశైలం బస్టాండు కూడలిలో మంగళ వారం వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్సియా మాట్లాడుతూ.. ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థిగా తమ తండ్రి ఎరిక్షన్‌బాబును, ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డిలను సైకిలు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజా నాయకుడు, అభివృద్ధి ప్రదాత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టగానే సూపర్‌సిక్స్ పథకాలు అమలు, రద్దుచేసిన పథకాల పునరుద్ధరణ చేయడంతో పాటు, సంక్షేమ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తారన్నారు. ముస్లింలకు టీడీపీతోనే మేలు చేస్తుందన్నారు. ప్రజలు చైతన్యం పొందారని మంచీ చెడూ ఆలోచించి విజ్ఞతతో ఓటు హక్కును సద్విని యోగపర్చుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య చంటి, దేసు నాగేంద్ర బాబు, షేక్ మంజూర్ భాష, కే సుబ్బారెడ్డి, ఇస్మాయిల్, భాష, చల్లా వెంకటేశ్వర్లు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



మసీదు బజారులో ప్రచారం నిర్వహిస్తున్న చల్సియా

వంతెన సరే.. అప్రోచ్ రోడ్డు ఎక్కడ..?

- గుండ్లకమ్మ వంతెనపై ఐదేళ్లగా వైసీపీ సర్కార్ నిర్లక్ష్యం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు


త్రిపురాంతకం, ఏప్రిల్ 15: మండలంలోని వెల్లంపల్లి సమీపంలో గుండ్లకమ్మనదిపై వంతెన నిర్మాణం పూర్తయినా దానికి అనుసంధానంగా అప్రోచ్‌రోడ్డు (వంతెన నుండి ప్రధాన రహదారికి) ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ వంతెన నిర్మాణం పనులు ప్రారంభయ్యాయి. అయితే బడ్జెట్ చాలదంటూ కాంట్రాక్టర్ కాడి కిందేసి వెళ్లారు. దీంతో ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అదనపు నిధులు వచ్చించింది. 2016 ఆగస్టులో పనులను పునఃప్రారభించారు. దీంతో 247 మీటర్ల వంతెన నిర్మాణం, 400 మీటర్ల సీసీ రోడ్డు పూర్తి చేశారు. దీంతో 2019 మార్చి 9న వంతెనను ప్రారంభించారు. కానీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు మాత్రం నిర్మించలేదు. అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు రెండు వైపులా భూమి కోసం ప్రయత్నాలు చేసినా భూయజమానుల నుంచి అంగీకారం రాలేదు. దీంతో నిర్మాణం నిలిచింది. దీంతో అక్కడిక్కడే తక్కువ మలుపులో మట్టిని తోలి ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్లేందుకు తాత్కాలిక ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఆ మూలమలుపులకు, వంతెన చివరి భాగాలకు రక్షణ గోడలులేవు. ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తూ ప్రమాద భరితంగా ఉన్నాయి. కానీ తప్పనిసరి పరిస్థితులలో ద్విచక్ర వాహనదారులు మాత్రం వంతెనపై అలానే ప్రయాణిస్తున్నారు. ట్రాక్టర్లు, కార్లు, లారీలు, ఆటోలు మాత్రం పాడుపడిపోయిన పాత చప్టాపైనే వెళుతున్నాయి. నేలచప్టానే ఉండటంతో వర్షాకాలంలో సాగర్ కాలువకు నీరువిడుదలైనపుడు గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించి చప్టాపై నుంచి నీరు పారుతుంది. దీనికితోడు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో తాత్కాలికం ఏర్పాటు చేసిన దారి

తగ్గనున్న దూరం

వంతెనకు అప్రోచ్ రోడ్డు పూర్తి చేస్తే ఎర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల వారికి ప్రయాణ ఇబ్బందులు తొలగుతాయి. త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం మండలాల్లోని వారు కురిచేడు, దొనకొండ, దర్శి ముండ్లమూరు, ఒంగోలు ప్రాంతాలకు వెళ్లేందుకు, ఒంగోలు, దర్శి, పొదిలి ప్రాంతాలవారు హైదరాబాద్ వెళ్లేందుకు సుమారు 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనికి తోడు చందవరం వద్ద ప్రముఖ బౌద్ధ క్షేత్రం, దొనకొండ వద్ద విమానాశ్రయం, పారిశ్రామిక కారిడార్‌లను ఏర్పాటు చేయనున్నందున ఈ వంతెన నిర్మాణం ఎంతో ఉపయోగకరం.



ఐదేళ్ల క్రితమే పూర్తయిన వంతెన

అవీ.. ఇవీ..

శ్రీరామ నవమి వేడుకలకు సిద్ధం

కంభం, ఏప్రిల్ 16 : శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలన్నీ ముస్తాబవుతున్నాయి. పట్టణంలోని పాత బద్వేలు రోడ్డులోని రామాలయంలో బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. కొత్త బద్వేలు రోడ్డులోని పట్టాభిరామస్వామి దేవాలయంలో, పెద్దబజారులోని అమ్మవారిశాలలో స్వామి వారి కల్యాణం, పట్టాభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపం ఆవరణలో రాముల వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జేవీ.నారాయణ తెలిపారు. గ్రామాల్లోని రామాలయాలన్నీ శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో, పందిర్లు వేసి అన్నదానాలు నిర్వహించేందుకు కమిటీలు సిద్ధం చేశాయి.

23 నుంచి బ్రహ్మోత్సవాలు

గిద్దలూరు, ఏప్రిల్ 16 : నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి బి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 23న మంగళవారం అంకురార్పణ, శేషవాహనం, హనుమంత వాహనం, 24న ఉదయం 11గంటలకు స్వామి వారికి కళ్యాణ మహోత్సవం, రాత్రి 10గంటలకు గరుడోత్సవం, 25న ఉదయం 9గంటలకు తెప్పోత్సవం, సాయంత్రం 4గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీలలో ప్రతి రోజు రాత్రి బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కల్యాణంలో కూర్చునే దంపతులు రూ.2500 చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

రేపటి నుంచి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కంభం, ఏప్రిల్ 16 : కంభం మండలం లింగోజీపల్లి గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీఉపదేశ రామస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈ నెల 18న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు (6 పండ్ల విభాగం) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేయనున్నారు. 19న జరిగే రెండు పండ్ల విభాగంలో విజేతలకు రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు వరుసగా బహుమతులు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొనే వారు 18వ తేదీ ఉదయం 7గంటల్లోగా ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి రసీదు పొందాలన్నారు. వివరాలకు 9908679558, 9849498614 సంప్రదించాలన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీనా

పొదిలి, ఏప్రిల్ 16 : రానున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మార్కాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీనా అన్నారు. మంగళవారం మండలంలోని ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఉన్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్‌బూత్‌లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏ పోలింగ్ కేంద్రంలోనైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రణాళిక వేసుకొని ముందుకు పోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మహ్మమద్ జియా, నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, సీఐ మల్లికార్జున్‌రావ్, ఎస్ఐ కోటయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఉదయం 11 గంటల నుంచి 3 గంటలకు వరకు అవకాశం
- ఎర్రగొండపాలెం ఆర్‌వో శ్రీలేఖ

పుల్లలచెరువు, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎర్రగొండపాలెంలోని ఆర్‌వో కార్యాలయం వద్ద ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించ నున్నట్లు ఆర్‌వో పి.శ్రీలేఖ తెలిపారు. మంగళవారం ఎర్రగొండపాలెంలో ఆర్‌వో కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 21న ఆదివారం నామినేషన్లు తీసుకోబోమన్నారు. అభ్య ర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. ఒక అభ్యర్థి నుంచి గరిష్ఠంగా నాలుగుసెట్ల నామినేషన్లు మాత్ర మే స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ వర్గీయుల ఘర్షణ

- కల్యాణం పీటలపై కూర్చొనే వివాదంలో దాడి
- నలుగురికి తీవ్రగాయాలు



దాడిలో గాయపడిన బాధితులు

పెద్దారవీడు, ఏప్రిల్ 16: రాములోరి కల్యాణానికి సంబంధించిన అంశంపై వైసీపీలోని ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన మండలంలోని చట్లమిట్టలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు కల్యాణం పీటలపై కూర్చునేందుకు సోమవారం రాత్రి వేలంపాట నిర్వహించారు. అందులో కల్యాణంలో కూర్చునేందుకు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు యేరువ అల్లూరిరెడ్డి రూ.33 వేలు చెల్లించేందుకు అంగీకరించాడు. గ్రామ పెద్దలు ఆ డబ్బుల విషయమై మంగళవారం అల్లూరిరెడ్డిని అడిగారు. అయితే తాను పీటలపై కూర్చోవడం లేదని, వేరే వాళ్ల పాట పాడమంటే పాడనని చెప్పాడు. ఆ సమయంలో గ్రామపెద్దలు అల్లూరిరెడ్డి వ్యవహార తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ నుంచి వెళ్లిన అల్లూరిరెడ్డి మద్యంసేవించి వచ్చి గ్రామస్థులపై రాళ్ల, కర్రలతో దాడి చేశాడు. ఈ ఘటనలో కుందురు మల్లికార్జునరెడ్డి, కుందురు వెంకటరెడ్డి, తిరుమలరెడ్డి లక్ష్మిల తలలకు గాయాలయ్యాయి. దాడిలో గాయపడిన వారిని మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

టీడీపీ హయాంలోనే కాపులకు న్యాయం



మాట్లాడుతున్న కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు

దర్శి, ఏప్రిల్ 16: టీడీపీ హయాంలోనే కాపులకు అన్నివిధాలుగా న్యాయం జరిగిందని కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో కాపులు ఎంతోమందికి కీలకమైన పదవులు కట్టబెట్టారని చెప్పారు. రాజకీయంగా ప్రాధాన్యత కల్పించటమేకాక ఆర్థికంగా వెనుకబడిన వారికోసం ఎంతో కృషి చేశారన్నారు. ఐదు శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో భూములన్నీ కైవసం చేసుకుంటారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సంజీవకుమార్, శ్రీనివాసమూర్తి, శ్రీపతి సుబ్బయ్య మానిశెట్టి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సదస్సుకు తరలివెళ్లిన శ్రేణులు



తాళ్లూరు నుంచి తరలివెళుతున్న శ్రేణులు

దొనకొండ, ఏప్రిల్ 16: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం దర్శిలో జరిగిన జయహో బీసీ సదస్సుకు ఆపార్టీ నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు నేతృత్వంలో అన్నిగ్రామాల నుంచి బీసీ సోదరులు భారీగా తరలివెళ్లారు. దాదాపు వందకు పైగా ప్రత్యేక వాహనాల్లో దొనకొండకు చేరుకొని ర్యాలీగా దర్శికి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, కందుల నారపురెడ్డి, యరగొర్ల బసవయ్య, పత్తి వెంకటేశ్వర్లు, పరుచూరి రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: దర్శిలో మంగళవారం సాయంత్రం జరిగిన జయహో బీసీ సదస్సుకు తాళ్లూరు మండలం నుంచి టీడీపీ బీసీశ్రేణులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు పిన్నిక రమేష్, ఆవుల ఆదినారాయణ, వంగపల్లి నాగేశ్వరావు, బి.రాజు, మాగుంటి శ్రీనివాసరావు, తదితరులు తరలివెళ్లారు.

కురిచేడు: బీసీ సదస్సుకు కురిచేడు మండలం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్ళారు. అన్ని గ్రామాల నుంచి వాహనాలలో వెళ్లారు. వారికి కురిచేడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు స్వాగతం పలికారు.

చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు

పామూరు, ఏప్రిల్ 16: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. తిరగళదిన్నె చెక్‌పోస్టు వద్ద సీఐ ఎం.రామానాయక్ మంగళవారం పలు వాహనాలను పరిశీంచారు. అనంతరం విధుల్లో ఉన్న పోలీసులకు పలు సూచనలు చేశారు.

వైసీపీని ఓడించడమే ఎమ్మార్పీఎస్ ధ్యేయం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 16: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఎన్డీయే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గెలుపై ధ్యేయంగా కృషి చేయాలని కనిగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు జేపీ రాజు మాదిగ, బలభద్ర శీనుమాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం సీఎస్‌పురంలో ఎమ్మార్పీఎస్ ఎన్నికల ప్రచార కమిటీని నియమించారు. మాదిగల భవిషత్తు ఎన్డీయే కూటమి మీద ఆధారపడి ఉందన్నారు. అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులుగా బలభద్ర రాంబాబు, కాలువ ప్రభాకర్, బలభద్ర ఇస్మాయిల్, పత్రా నాగయ్య, బి.సురేష్, గొల్లపల్లి విరాట్, గొల్లపల్లి నవీన్‌ను ఎంపిక చేశారు.

వైసీపీని వీడిన ఖాజామోహిద్దీన్

పామూరు, ఏప్రిల్ 16: పామూరు పట్టణానికి చెందిన మాచర్ల ఖాజామోహిద్దీన్ అలియాస్ మాచర్ల శివ మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌బాబు, ఆర్‌ఆర్ రఫీ, షేక్ ఖాజారహంతుల్లా, ఇర్రి కోటిరెడ్డి, షేక్ నాయబ్‌రసూల్, జి.రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేయాలి

పీసీపల్లి, ఏప్రిల్ 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని ఎంపీడీవో వెంకటసుబ్బారావు, ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయపార్టీలు రాత్రి 10 గంటల తరువాత ప్రచారం నిర్వహించరాదన్నారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే మహిళా పోలీసులు వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో కార్యాలయ పరిపాలనా అధికారి రమణారెడ్డి, విస్తరణ అధికారి మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

19మంది వలంటీర్లు రాజీనామా

కనిగిరి, ఏప్రిల్ 16: మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాలయాల్లో సేవలందిస్తున్న 19 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేసినట్టు ఎంపీడీవో మహేష్‌బాబు తెలిపారు. మండలంలోని వంగపాడు గ్రామ సచివాలయ పరిధిలో ఏడుగురు, తాళ్ళూరులో 11 మంది, గోసులవీడులో ఒకరు రాజీనామా చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

టీడీపీలో చేరిన పడమర వీరాయపాలెం గ్రామస్థులు

కురిచేడు, ఏప్రిల్ 16: కురిచేడు మండలం పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు సోమవారం రాత్రి టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు పిడతల నెమిలయ్య ఆధ్వర్యంలో కడియాల రమేష్, మరికొందరు పార్టీలో చేరారు. వారికి మండల నాయకులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఉపాధి పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

తాళ్లూరు, ఏప్రిల్ 16: ఎండల తీవ్రతతో ఉపాధి పనుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని డ్వామా పీడీ అర్జున్‌రావు అన్నారు. తాళ్లూరులో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేపట్టాలన్నారు. పనులకు వెళ్లే కూలీలు తమ వెంట మంచినీరు తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మశ్రీ, ఏపీవో మురళి, ఈసీఎం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌తో పేదలకు మేలు

పీసీపల్లి, ఏప్రిల్ 16: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అమలుచేయనున్న సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పేదలకు మేలు చేకూరుతుందని కూటమి నాయకులు అన్నారు. మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదయిర్లపాడు, పెదఅలవలపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీని ఓడించాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లిన నాయకులు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో పువ్వాడి నాగరాజు, నాగేశ్వరరావు, నాగోలు శ్రీనివాసులు, రాయ బ్రహ్మయ్య, కోమటినూతల వీరయ్య, గోపిరెడ్డి నరసింహారెడ్డి, గుర్రం మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న కూటమి నాయకులు

దర్శిలో కదంతొక్కిన బీసీలు

- టీడీపీ జయహో బీసీ విజయవంతం
- తండోపతండాలుగా తరలివచ్చిన ప్రజలు
- పలుసంఘాల నాయకులు హాజరు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

నియోజకవర్గ కేంద్రమైన దర్శిలో మంగళవారం సాయంత్రం బలహీన వర్గాలకు చెందిన ప్రజానీకం కదంతొక్కారు. జయహో బీసీ, జైజై టీడీపీ అంటూ నినాదాలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, వారు వేసిన నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగిపోయింది. బీసీల మద్దతు చూసి తెలుగుదేశం పార్టీ కూటమి నాయకుల ఉప్పొంగిపోయారు. సభలో ఆయా బీసీ సంఘాల చేసిన ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది.

దర్శి నియోజకవర్గ టీడీపీ కూటమి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బీసీ సదస్సును దర్శిలోని కురిచేడు రోడ్డులో నిర్వహించారు. నియోజకవర్గంలోని దాదాపు అన్నిప్రాంతాల నుంచి బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఊహించని విధంగా సభకు తరలివచ్చారు. నియోజకవర్గంలో యాదవ సాయాజిక వర్గంతో పాటు ఇతరత్రా వివిద బలహీన వర్గాలకు చెందిన సామాజకవర్గాలవారు ఉన్నారు. ఆదినుంచి టీడీపీతో ఉన్నవారితో పాటు ఆయా బలహీన వర్గాలకు చెందిన ఆయా ఉప కులాల సామాన్య ప్రజలు కూడా తరలిరావటం విశేషం.

కూటమి అభ్యర్థిగా డాక్టర్ లక్ష్మి నియోజకవర్గానికి వచ్చిన తొలిరోజు జరిగిన స్వాగత కార్యక్రమం ఒక హైలెట్. ఇప్పటికే పలువర్గాల ఆత్మీయ సదస్సులలో ఆమె పాల్గొన్నారు. మంగళవారం కేవలం బీసీలతో సదస్సు పెట్టగా, కేవలం నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో తరలివచ్చారు. దొనకొండ, దర్శి కురిచేడు, ముండ్లమూరు, తాళ్ళూరు మండలాల్లోని దాదాపు అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో బలహీన వర్గాల ప్రతినిధులు రావటం స్పష్టంగా కనిపించింది. బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్న గ్రామాల నుంచి అయితే ప్రత్యక వాహనాల్లో తరలివచ్చారు. వారి సంఖ్య తక్కువగా ఉన్న గ్రామాల నుంచి ఆయా వర్గాల ప్రతినిధులు ద్విచక్ర వాహనాలపై స్వచ్ఛందంగా రావటం కనిపించింది.

సభకు తరలిరావటం ఒక ఎత్తయితే, సభలో నాయకుల ప్రసంగాల్లో వారు సానుకూలంగా స్పందించిన తీరు అద్భుతం. బీసీ నుంచే తెలుగుదేశం పుట్టిందని కూటమి అభ్యర్థిడాక్టర్ లక్ష్మి అన్నప్పుడు సభికుల నుంచి పెద్దస్థాయిలో కేరింతలు వ్యక్తం మయ్యాయి. ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి, సదస్సు నిర్వహణలో కీలకపాత్ర పోషించిన టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నూకసాని బాలాజీతో పాటు యాదవ, రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, విశ్వబ్రాహ్మణ బెస్త, ముదిరాజ్.. ఇలా ఆయా బలహీన వర్గాలకు చెందిన నాయకులు కూడా సభలో పాల్గొని కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మికి మద్దతు ప్రకటించారు.



జయహో బీసీ సదస్సుకు హాజరైన ప్రజలు

కాపుల సంక్షేమానికి కృషిచేస్తా!

- కనిగిరి అభివృద్ధికి సహకరించాలి
- ఆత్మీయ సమావేశంలో డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 16: కాపు సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ఓ ప్రయివేట్ కల్యాణ మండపంలో రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ బాబురావు అధ్యక్షతన జరిగిన కాపుల ఆత్మీయ సమావేశంలో ఉగ్ర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కనిగిరి అభివృద్ధిలో కాపులంతా సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అయినా గెలుపోటములు శాసించే స్థాయిలో కాపులు ఉన్నారన్నారు. కానీ కాపులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వారి సంక్షేమానికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాపులు సహకారంతో కనిగిరిని కనకగిరిగా మారుస్తామన్నారు. కాపులంతా ఆకాంక్షించే కాపు కల్యాణ మండపానికి స్థలం కేటాయింపు తాను అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే చేపడతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి స్థల కేటాయింపు వీలులేకపోతే తన సొంత నిధులతో స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. కాపులలో కనీసం ఇంటి స్థలం లేని వారు ఎంతోమంది ఉన్నారని కాపుపెద్దలు తన దృష్టికి తీసుకురావటంతో డాక్టర్ ఉగ్ర స్పందిస్తూ తాను అధికారంలోకి వచ్చిన తర్వాత కాపులకు ఇంటి స్థలాలు, విద్య, వైద్యపరంగా సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామన్నారు. సమావేశానికి కనిగిరి నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామయ్యానాయుడు రాలేకపోవటం ఎంతో వెలితిగా ఉందన్నారు. ఆయన స్వస్థతగా ఉన్నారని తెలిసి ఆయన నివాసానికి వెళ్ళి ఆయనను పరామర్శించి వచ్చానని చెప్పారు. ఆయన ఇంటిలో నుంచి బయటికి వచ్చేప్పుడు మా కాపులకు అండగా ఉండటంతో పాటు వారి పురోగతికి సహాయ సహకారాలు అందించాలని గద్గద స్వరంతో అడిగారన్నారు. ఆయన అంత బాధలో కూడా కాపుల సంక్షేమం గురించే ఆలోచించారంటే ఆయనకు కాపులపై ఎంత అభిమానం ఉందో అర్థమైందన్నారు. అందుకే ఆయనకు మాట ఇచ్చానన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాపులకు అండగా ఉంటానని డాక్టర్ ఉగ్ర హామీ ఇచ్చారు. అదేవిదంగా కాపులందరీ ఆమోదంతో తాను అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కాపు కల్యాణ మండప నిర్మాణంతో పాటు ఆ మండపానికి డాక్టర్ రామయ్యనాయుడు పేరుమీద నిర్మించాలని ఉందన్నారు. జనసేనతో కూటమికి యువత బలం చేకూరిందన్నారు. జనసేనాని ఏఒక్క కులానికి చెందినవారు కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాపులంతా ఐక్యంగా ముందుకు వచ్చి తనకు అత్యధిక మెజార్టీ వచ్చేలా సహకరించాలని ఉగ్ర కోరారు.

కార్యక్రమంలో జనసేన నాయకుడు వరికూటి నాగరాజు, బీజేపీ నాయకుడు కొండిశెట్టి రమణయ్య, పారిశ్రామికవేత్త వాకా సత్యనారాయణ, కాపు సంఘం నాయకులు ముండ్లమూరి మాలకొండయ్య, పుల్లయ్య, ఎల్‌వీఆర్, ఎన్‌సీ మాలకొండయ్య, ఉప్పలపాటి హరిబాబు, పాయల పెదతిరుపతయ్య బొబ్బూరి రమేష్, బేతంశెట్టి వీరయ్య, ప్రసాద్, అజయ్, కోటేశ్వరరావు, బాస్కర్, కాపు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ ఉగ్రను కాపు కుటుంబసభ్యులంతా పూలతో ఘనస్వాగతం పలికారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ఆత్మీయ సమావేశానికి హాజరైన కాపు కుటుంబాలు

వైసీపీ పాలనలో అరాచకం

- అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే టీడీపీ ఆవిర్భావం
- పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ

దర్శి, ఏప్రిల్ 16 : వైసీపీ పాలనలో బీసీలపై దాడులు, హత్యలు జరిగాయని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. దర్శిలో మంగళవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ స్థాయి జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని చెప్పారు. బీసీలకు చట్ట సభల్లో అవకాశం కల్పించి రాజకీయంగా అభివృద్ధికి కృషి చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. బీసీల అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. ఎన్నికల కోసం వైసీపీ నాయకులు చెప్పే కల్లిబొల్లి మాటలు నమ్మ వద్దన్నారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల చమట చుక్కల్లో నుంచి టీడీపీ పుట్టిందన్నారు. బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ నిరంతం కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీలో సొంత సామాజిక వర్గానికే పదవులు కట్టబెట్టారన్నారు. టీడీపీలో దివంగత ఎర్రంన్నాయుడుకు కేంద్రమంత్రి, యనమల రామకృష్ణుడుకి స్పీకర్, మంత్రి పదవి, పుట్టా సుధాకర్ యాదవ్‌కు టీడీపీ చైర్మన్ పదవి కట్ట బెట్టడమేకాక ఎంతో మంది బీసీలకు ఉన్నత స్థానం కల్పించినట్టు చెప్పారు .టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్ అమలుచేయటంతో పాటు మహిళల అభ్యున్నతికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు. దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనువరాలిగా, దివంగత గొట్టిపాటి నరసయ్య కుమార్తెగా, గొట్టిపాటి కుటుంబవారసురాలిగా, మీ ఇంటి ఆడపడుచుగా మీ వద్దకు వచ్చానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మోజారిటితో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకరాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలను అణగదొక్కారని విమర్శించారు. బీసీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించారని అన్నారు. రానున్న ఎన్నికల్లో సైకో పోవాలి, సైకిల్ రావాలని కోరారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఐ.రాఘవేంద్ర మాట్లాడుతూ రజకులు వైసీపీ పాలనలో దగా పడ్డారని చెప్పారు. జగన్ పాలనలో ఒక్క ఎమ్మెల్యే సీటు, ఎమ్మెల్సీ సీటు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు రజకులకు ఎమ్మెల్సీ సీటుతో పాటు, రెండు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి గౌరవించారన్నారు..

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ లలిత్‌సాగర్, మాగుంట రాఘవరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, రాష్ట్ర యాదవ సాధికారక కమిటీ కన్వీనర్ వైనాగేశ్వరావు, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసులరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, జనసేన దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గరిక పాటి వెంకట్, బీజేపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ కాలేషావలి, తుపాకుల అప్పారావు, రమణ యాదవ్, శాసనాల వీరబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడతున్న నూకసాని బాలాజీ

నుచ్చుపొద ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

పామూరు, ఏప్రిల్ 16: ఎన్నికల నిబంధనలను భేఖాతర్ చేస్తూ వైసీపీ నాయకులతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను డ్వామా పీడీ అర్జున్ సస్పెండ్ చేశారు. పామూరు మండలంలోని నుచ్చుపొద గ్రామ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసులు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌తో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇందుకుసంబంధించిన కథనం మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పీడీ అర్జున్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులును విధుల నుంచి తొలగిస్తూ పామూరు ఎంపీడీవో పి.పుట్టారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. డ్వామా అధికారుల ఆదేశాల మేరకు ఉపాధి అసిస్టెంట్ శ్రీనివాసులును తొలగిస్తూ జారీచేసిన ఆదేశాలు అందాయని ఏపీవో కె.మాల్యాద్రి తెలిపారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16 : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు మంగళవారం శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. వసంత నవరాత్రుల చివరి రోజైన చైత్ర నవమి నాడు శ్రీరామ నవమి పండుగను దేశ ప్రజలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. సీతారామచంద్రులను ఆదర్శంగా తీసుకొని జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

పీసీపల్లి, ఏప్రిల్ 16: అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన బాధితులకు ఉపాధ్యాయులు సాయం చేశారు. మండలంలోని నేరేడుపల్లిలో ఈ నెల 13న జరిగిన అగ్నిప్రమాదంలో గుండాబత్తిన చైతన్య ఇల్లు పూర్తిగా కాలిపోయింది. చైతన్య కుమార్తె లావణ్య స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈఏడాది 10వ తరగతి చదివింది.

పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆ కుటుంబానికి చేయూతనందించారు. ప్రధానోపాధ్యాయురాలు అంజనీదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది రూ. 22,500 సేకరించారు. మంగళవారం ఎంఈవోలు సంజీవి, శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం చైతన్య కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు.

19న గంధ మహోత్సవం

పామూరు, ఏప్రిల్ 16: పామూరు మేజర్ పంచాయతి గోపాలపురం గ్రామంలో వెలసియున్న శ్రీహజరత్‌సయ్యద్ కరిముల్లాషా ఖాదరీ (ఉరఫ్) కాలేషాపీర్ మస్తాన్‌వలీ రహంతుల్లా అల్లాహీ దర్గా గంధమహోత్సవం (ఉరుసు)ను ఈనెల 19న నిర్వహిస్తున్నట్టు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం దర్గాలో దీపారాధన, ఆదివారం తహలీల్ ఫాతేహా కార్యక్రమాలు జరుగు తాయని తెలిపారు. తొలిరోజు శుక్రవారం భక్తులకు రాత్రి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

- కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 16: పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసమే టీడీపీ ఆవిర్భవించిందని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. పేద ప్రజలకు న్యాయం చేసేందుకు నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. మంగళవారం దర్శి పట్టణంలోని 3, 4 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే పాపారావుతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. తొలుత చర్చిలో ఆమె ప్రార్థనలు చేసి పాస్టర్ల దీవెనలు అందుకున్నారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ ఆధ్వర్యంలోనే ఎస్సీలకు మేలు జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీల పథకాలు రద్దు చేయటమే కాక కనీసం క్రిస్మస్ కానుకలు ఇవ్వకుండా తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, యాదగిరి వాసు, నారపుశెట్టి మధు, కౌన్సిలర్ ఇత్తడి సునీతాదినకర్, తదితరులు పాల్గొన్నారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న కూటమి అభ్యర్థి లక్ష్మి

టీడీపీలో చేరిన ముస్లింలు



టీడీపీలో చేరిన దొనకొండకు చెందిన ముస్లింలు

దొనకొండ, ఏప్రిల్ 16: దొనకొండకు చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులైన ముస్లింలు టీడీపీ మండల మాజీ కోప్షన్ సభ్యుడు షేక్ మూసామియా(సర్దార్) ఆధ్వర్యంలో డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో పార్టీలో చేరారు. సాదిక్, ఏజాద్, అబ్దుల్ అజీమ్, మరో పది మందికి డాక్టర్ లలిత్‌సాగర్ టీడీపీ కండవాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో సైనికుల్లా పనిచేయాలని లలిత్‌సాగర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కందుల నారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

దర్శి, ఏప్రిల్ 16: టీడీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. కూటమి అభ్యర్థి లక్ష్మి సమక్షంలో దర్శి ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే, ముండ్లమూరు మండల ఆర్ఎంపీ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర అర్జున్, మరికొంత మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి భారీగా చేరికలు

తాళ్లూరు, ఏప్రిల్ 16: తూర్పుగంగవరం గ్రామంలో వైసీపీ సీనియర్ నేత గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(చందన) కీలంగా వ్యవహరించి సర్పంచ్ చాట్ల నాగమణి, ఇమ్మానియోల్ వర్గానికి చెందిన 50 ఎస్సీ కుటుంబాలు, సానె ఆంజనేయులు వర్గానికి చెందిన 50 కుటుంబాలు, నాలుగో వార్డు సభ్యులు తోట వరలక్ష్మి భర్త కృష్ణ వర్గానికి చెందిన 30 కుటుంబాలు, తూము రవికుమార్ వర్గానికి చెందిన 15 కుటుంబాలు సోమవారం రాత్రి దర్శి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టిపాపారావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రెండురోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన వైసీపీ వాణిజ్యవిభాగం మండల కన్వీనర్ పాదర్తి సురేష్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రామభద్రాపురంకు చెందిన కైపు వెంకటరమణారెడ్డి, పేరం రమణారెడ్డి, గంగవరంకు చెందిన శిఖాకొల్లి శ్రీనివాసరావులు మంగళవారం లలిత్ సాగర్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వైసీపీ ప్రచారంలో అపశ్రుతి

- బాణసంచా నిప్పురవ్వలు పడి గడ్డివామి దగ్ధం

వెలిగండ్ల, ఏప్రిల్ 16: వైసీపీ నాయకుల అత్యుత్సాహంతో గడ్డివాము కాలిబూడిదైంది. మండలంలోని గుడిపాటిపల్లి పంచాయతీలో మంగళవారం వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బాణసంచా కాల్చగా నిప్పురవ్వలు పడి గడ్డి వాము దగ్ధమవుతున్నా వైసీపీ నాయకులు చూసీచూడనట్లుగా వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న రైతు గుంటక నరసింహారెడ్డి, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేసినా సాధ్యంకాలేదు. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు వైసీపీ నాయకుల తీరుపై ఆందోళనకు దిగారు. అదే గ్రామంలో ఓ వేడుకకు వచ్చిన టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి, దొడ్డా సుబ్బారెడ్డి, తదితరులు విషయం తెలియగానే సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఈక్రమంలో అక్కడే ఉన్న వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు ఇరుపార్టీ నాయకులకు సర్దిచెప్పారు. చివరికి వైసీపీ నాయకులు నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.



కాలి బూడిదైన గడ్డివాము

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

3

బుధవారం 17 ఏప్రిల్ 2024



తెనాలి బోసురోడ్డులో చలువ పందిళ్లు

శ్రీరామ జయజయరామ



తెనాలి గాడిబావి సెంటర్‌లో సిద్ధమైన కల్యాణ వేదిక

- జిల్లా అంతటా నేడే నవమి వేడుకలు
- కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

బాపట్ల,తెనాలిఅర్బన్, ఏప్రిల్ 16: శ్రీరామ.. జయజయ రామ అంటూ భక్తులు నవమి వేడుకలకు సిద్ధమయ్యారు. బుధ వారం వాడవాడలా శ్రీరామనవమి వేడుకలకు విస్తృతంగా ఏర్పాట్లు జరిగాయి. ఆలయాలతో పాటు కూడళ్లలో ఏర్పాటు చేసిన పందిళ్లను విద్యుత్ దీపాలు, మామిడాకులు, అరటి బోదెలు, పూలతో సుందరంగా అలంకరించారు. శ్రీసీ తారాముల కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఆంజ నేయస్వామి దేవాలయాల్లో కూడా సీతారామ కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు. జిల్లా అంతటా కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం భక్తులు భారీగా ఏర్పాట్లు చేశారు. పల్లెలు.. పట్టణాల్లో వేడుకల కోసం ఏర్పాటు చేసిన పందిళ్లు, రామాలయాలు భక్తిపారవశ్యంతో మారుమోగిపోతున్నాయి. గుంటూరు, బాపట్ల, నరసరావుపేట తదితర ప్రాంతాల్లో నవమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు భక్తులు భారీగా ఏర్పాట్లు చేశారు. సీతారాముల కల్యాణానికి మహిళలు తలంబ్రాలు సిద్ధం చేశారు.

తెనాలిలో అంగరంగ వైభవంగా..

అపర భద్రాద్రిగా వినతికెక్కిన తెనాలిలో వైభవంగా నవమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. పట్టణంలోని మెయిన్ రోడ్డు మొత్తం గాడిబావి సెంటర్ నుంచి గాంధీ చౌక్ వరకు చలువ పందిళ్లతో తీర్చిదిద్దారు. గాడిబావి సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని కల్యాణం కోసం ముస్తాబు చేశారు. 1919లో బ్రిటీష్ ప్రభుత్వం నవమి పూజలకు అంగీకరించకపోవడంతో గ్రామస్తులంతా కలిసి రాత్రికి రాత్రి చిన్న ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీంతో దొంగరాముడిగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. భద్రాచలంలో ఉన్న విధంగా ఇక్కడ శ్రీసీతారామ చంద్రులు ఒకేశిలపై ఉండటం విశేషం. క్రమేణా ఆలయాన్ని అభివృద్ధి చేసి ప్రతిఏటా ఉగాది నుంచి నవమి వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 92 ఏళ్లుగా ఈ మందిరంలో ఉత్సవాలు చేస్తున్నారు. ఇక పట్టణంలోని పలు రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి కమిటీల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



తెనాలి హనుమాన్ చౌక్‌లోని సీతారామ మందిరం

టార్గెట్ గొట్టిపాటి

- అద్దంకి ఎమ్మెల్యేపై గురిపెట్టిన వైసీపీ
- రవికుమార్ లక్ష్యంగా అనుచరుడి ఇంట్లో తనిఖీలు

- వైవీ స్వగ్రామంలో అర్ధరాత్రి పోలీసుల హడావుడి
- పోలీసు బలగాలతో హడావిడి..
- కార్యకర్తలకు బెదిరింపులు
- దొరికింది రూ.3.44 లక్షలు, బలవంతంగా సంతకం చేయించిన వైనం
- మూడు రోజుల క్రితం రవికుమార్ సమక్షంలో టీడీపీలో పలువురు చేరిక

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అద్దంకి ఎమ్మెల్యే, టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ లక్ష్యంగా అధికార వైసీపీ దూరగతాలకు మరోసారి తెరలేపింది. రవికుమార్ వ్యాపార లావాదేవీలు స్తంభింపజేసిన జగన్ ప్రభుత్వం తాజాగా ఎన్నికల్లో ఆయన అనుచరులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడింది. మేదరమెట్లకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త బోయపాటి శివశంకర్ ఇంటిపై అర్ధరాత్రి భారీసంఖ్యలో పోలీసుల దాడి చేసి హడావుడి చేయడమే ఇందుకు నిదర్శనం. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఇది జరిగింది. ఎమ్మెల్యే రవికుమార్ లక్ష్యంగా అధికార పార్టీ అగ్ర నేతల ఆదేశాలతోనే ఈ హడావుడి జరిగి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. మూడుసార్లు గెలుపొందిన గొట్టిపాటి రవికుమార్ 2015లో టీడీపీలో చేరి గత ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలుపొందారు. ఆయన్ను వైసీపీలో చేర్చుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. అందుకు రవికుమార్ ససేమిరా అనడంతో వెంటాడి వేధించి ఆయన గ్రానైట్ క్వారీలతో పాటు ఫ్యాక్టరీలను మూతవేయించారు. నాలుగేళ్లుగా వ్యాపారం దెబ్బతిన్నా ఆయన బెదరకుండా ఈ ఎన్నికల్లో టీడీపీ పక్షాన రంగంలోకి దిగారు. రాజ్యసభ సభ్యుడు వైవీ సొంత నియోజకవర్గం అద్దంకి. ఈ క్రమంలో ఆయన సిఫార్సుతో రవికుమార్‌పై పోటీకి పల్నాడు జిల్లా నుంచి ఓ నేతను దిగుమతి చేసుకుని రంగంలోకి దింపారు. అయితే గత కొన్ని రోజులుగా వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరే నాయకుల పరంపర కొనసాగుతుంది. మాజీ ఎమ్మెల్యే గరటయ్య ఆయన కుమారుడు అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా పనిచేసిన చైతన్య ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. పరిస్థితి గమనించి వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలో అధికారాన్ని అడ్డుపెట్టి బెదిరించి పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ నేతలు భావించారు.

పోలీసుల బరితెగింపు

నియోజకవర్గంలో కీలకగ్రామాల్లో ఒకటైన మేదరమెట్ల వైవీ సుబ్బారెడ్డి స్వగ్రామం. ఇటీవల ఆ గ్రామంలో వైసీపీ నాయకులతో పాటు వివిధ వర్గాల వారు టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన పలువురు ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటికి మద్దతు ప్రకటించారు. ఇది వైసీపీ నాయకత్వంలో వణుకు పుట్టించింది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత పోలీసులు పెద్దసంఖ్యలో శివశంకర్ ఇంటిని చుట్టుముట్టారు. చీరాల డీఎస్పీ ప్రసాదు ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు సుమారు పదిమంది ఎస్ఐలు పెద్దసంఖ్యలో పోలీసులు ఈ దాడిలో పాల్గొన్నారు. నిద్రిస్తున్న శివశంకర్ కుటుంబీకులను లేపి సుమారు నాలుగు గంటల పాటు ఇల్లంతా సోదా చేశారు. చిరు వ్యాపారి అయిన శివశంకర్ ఇంట్లో కేవలం రూ.3.44 లక్షలు మాత్రమే దొరికాయి. ఆ డబ్బులకు సంబంధించి ఆధారాలను శివశంకర్ చూపించారు. తన కుమార్తెను ఇంజనీరింగ్‌లో చేర్పించేందుకు కొంత డబ్బు ఉంచుకున్నట్లు తెలిపారు. అయినా పోలీసుల వాటిని పరిగణలోకి తీసుకోకుండా డబ్బును అక్రమంగా నిల్వ ఉంటే పట్టుకున్నట్లుగా సంతకం చేయమని బలవంతం చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేసే లక్ష్యంతోనే వైసీపీ అగ్రనేతల సూచనలతో ఈ వ్యవహారం సాగినట్లు టీడీపీ నాయకులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనపై చట్టపరంగా తాడోపేడో తేల్చుకునేందుకు టీడీపీ సిద్ధమవుతుంది.

పింఛన్లతో.. సరి

మాది సంక్షేమ ప్రభుత్వం.. దేశంలో మరెవ్వరూ సంక్షేమంలో మాతో పోటీ పడలేరు.. అని చెప్పుకుంటూ వస్తోన్న పాలకులు సామాజిక పింఛన్ల పంపిణీ తో సరిపెడుతున్నారు. మిగిలిన పథకా లకు బటన్లు నొక్క డానికే పరిమితమవు తున్నారు. ఎన్నికల ఏడాదిలో హడావుడిగా పలు పథకాలకు బట న్లు నొక్కి సరిపెట్టారు. ఆసరా, చేయూత, విద్యా దీవెన తదితర పథకాలకి సంబంధించిన నగదు విడుదల చేయకుండా పాలకులు పట్టించుకోలేదు. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నగదు ఖాతాదారుల్లో పడక పోవడంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివిధ పథకాలను వాయిదాలు వేస్తూ వచ్చిన ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు హడా వుడిగా బటన్లు నొక్కిందే కాని నగదు విడుదల చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని సమాచారం.





గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి)

- ఎన్నికల నోటిఫికేషన్‌కు 4 నెలల ముందు బటన్ నొక్కినా ఆసరా అందలేదు.
- నోటిఫికేషన్‌కు 45 రోజుల ముందు ప్రారంభించిన విద్యాదీవెన విడుదల కాలేదు.
- నోటిఫికేషన్‌కు నెలన్నర క్రితం బటన్ నొక్కిన చేయూత ఊసేలేదు.

ఈ పథకాల గురించి పట్టించుకోని పాలకులు పింఛన్లతో సరిపెడుతున్నారు. నాలుగు నెలలుగా పింఛన్లు మాత్రం ఠంచన్‌గా అందజేస్తూ మిగిలిన పథకాలకు సంబంధించి బటన్లు నొక్కేందుకే పరిమితమవుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ బటన్లు నొక్కి నెలలు గడుస్తున్నా ఆయా పథకాల లబ్ధిదారులకు ఇప్పటి వరకు కూడా నగదు అందలేదు. అదే పింఛన్లను ప్రతీ నెల పంపిణీ చేస్తున్న పాలకులు బటన్లు నొక్కిన పథకాలకు సంబంధించిన లబ్ధి గురించి మాత్రం నోరు మెదపడటంలేదు.ఆసరా, విద్యాదీవెన, చేయూత పథకాల లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అదేమంటే ముఖ్యమంత్రి బటన్లు నొక్కారు కదా.. త్వరలో ఖాతాల్లో నగదు జమ అవుతుందంటూ అధికారులు కాలక్షేపం చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈ నెలలో వలంటీర్లతో పింఛన్ల పంపిణీ నిలిచిపోగా అందుకు కారణం ప్రతిపక్షాలు అని ఆరోపించింది. అయితే నాలుగు నెలలుగా వివిధ పథకాల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాకపోవడానికి కారణం ఎవరో ప్రభుత్వ పెద్దలే చెప్పాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అడ్రస్ లేని ఆసరా ..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ అర్హత పొందిన మహిళలు 7 లక్షల మంది ఉన్నారు. వారికి ప్రభుత్వం నాలుగు దఫాలుగా 2,800 కోట్ల రూపాయలు రుణమాఫీ కింద నగదు చెల్లించాలి. వాయిదాల పద్ధతిలో నాలుగేళ్లలో మూడు సార్లు మాత్రమే నిధులు విడుదల చేసిన ప్రభుత్వం నాలుగో దఫా కింద ఈ ఏడాది జనవరి 23న ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. నాలుగో విడతలో రూ.700 కోట్లు రుణ మాఫీ జరగాలి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ). పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) శాఖల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో విభజిత గుంటూరు జిల్లాలో 29,322 డ్వాక్రా సంఘాలకు చెందిన 2 లక్షల 86వేల మందికి 246 కోట్ల రూపాయలు, పల్నాడు జిల్లాలో 25,168 గ్రూపుల్లో 2,47,833 మందికి ఆసరా కింద రూ.190 కోట్ల రూపాయలు, బాపట్ల జిల్లాలో 30,604 గ్రూపులకు చెందిన మూడు లక్షల మందికి రూ.263 కోట్లు ఆసరా పథకం కింద నాలుగో విడత రుణ మాఫీ జరగాలి. కానీ ఈ రోజు వరకూ లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో నగదు అందలేదు. బటన్ నొక్కి నాలుగు నెలలు పూర్తయినా ఇప్పటికీ లబ్ధిదారుల్లో అత్యధికులకు ఆసరా రుణమాఫీ డబ్బులు పడలేదు. అక్కడక్కడా అరకొరగా ఆసరా డబ్బు పడినా, ఆ తర్వాత ఆగిపోయింది. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఆ ఊసే లేకుండా పోయింది. కానీ లబ్ధిదారులు ప్రతి రోజూ బ్యాంకులకు వెళ్లి నిరాశగా వెనుతిరుగుతున్నారు.



చేయూతలో జాప్యం

చేయూత పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న డ్వాక్రా మహిళలకు 4 విడతల్లో రూ.75 వేలు ఇస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 2 లక్షల 70 వేల మంది లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించింది. వారందరికీ నాలుగో విడత చేయూత కింద రూ.425 కోట్లు అందాలి. మార్చి 7న ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ పథకానికి సంబంధించి బటన్ నొక్కారు. కానీ ఈరోజు వరకూ చాలా మందికి చేయూత దక్కలేదు. దాదాపు మూడో వంతు మందికి నగదు అందలేదని తెలుస్తోంది. కాగా అధికారులు మాత్రం అందరికీ అందిందని చెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. పథకానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు కూడా లేవని వార్తలు వస్తున్నా అధికారులు మాత్రం ఇచ్చేశామని చెప్పడం విడ్డూరంగా ఉంది. కానీ లబ్ధిదారులు రెండు నెలలుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.



ఊసేలేని విద్యాదీవెన

మార్చి నెల 1న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన మూడో విడత పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని 35 వేల మంది విద్యార్థులకు రూ.41 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంటు కింద విడుదల కావాలి. ముఖ్యమంత్రి ఈ పథకానికి సంబంధించి బటన్ నొక్కి 45 రోజులైనా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని తెలుస్తోంది.

- అమలుకాని మిగిలిన పథకాలు
- బటన్లు నొక్కినా ఖాతాల్లో పడని నగదు
- ఆసరా, చేయూత, విద్యాదీవెన లబ్ధిదారుల నిరీక్షణ
- మూడు జిల్లాల్లో 10 లక్షల మంది ఎదురుచూపులు

పింఛన్లపై విషం

ఎన్నికల కోడ్ నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైసీపీ పాలకులు పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయకుండా విష ప్రచారం చేయడానికే పరిమితమయ్యారు. పైగా పింఛన్ల పంపిణీ జాప్యానికి ప్రతిపక్షాలే కారణమని ప్రకటనలతో సరిపెట్టారు. అయితే తమ అస్మదీయ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి హడావుడిగా 13 వేల కోట్లు విడుదల చేసి, పింఛన్ల పంపిణీకి ఒక్క రూపాయి కూడా లేకుండా ఖజానాను ఖాళీ చేసిన ప్రభుత్వం, ఆ విషయాన్ని మభ్య పెట్టి లబ్ధిదారులను వంచించేందుకు పూనుకుంది. పింఛన్లు ఆగిపోవడానికి కారణం ప్రతిపక్షాలేనంటూ వారిపై నెపం మోపి తాను చేతులు దులుపుకుంది. కాగా ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఒక్క పింఛన్లే కాదు, ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కినా ఏ పథకమూ ఈ రోజు వరకూ సక్రమంగా అమలు జరగలేదు. ఎన్నికల షెడ్యూల్ రాకకు ముందు హడావుడిగా నొక్కిన బటన్లతో లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా పడలేదు. అందుకు కారణం ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేయడమేనని సమాచారం. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి రావడం, సరిగ్గా అదే సమయంలో ఆర్బీఐ నుంచి అప్పు పుట్టడంతో అప్పటికప్పుడు నగదు జమ చేసి పింఛన్ల పంపిణీకి పూనుకున్నారు. సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి పంచే అవకాశమున్నా అవ్వా, తాతలు, మహిళలను నడిఎండలో గంటల కొద్దీ నిలబెట్టి వారి ప్రాణాలతో చెలగాటమాడారు.

నామినేషన్లకు.. ఏర్పాట్లు పూర్తి

- ఆర్వో కార్యాలయాల వద్ద సీసీ కెమెరాల నిఘా
- ఇప్పటి వరకు రూ.2.72 కోట్ల మద్యం, నగదు, కానుకల సీజ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన ఆర్‌వో కార్యాలయాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ స్థానాలకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్‌వో కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. లోక్‌సభ స్థానానికి సెక్యూరిటీ డిపాజిట్ రూ.25 వేలు, అసెంబ్లీ అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీగా డిపాజిట్ చేయాలన్నారు. ఎస్సీలకు రిజర్వు చేసిన స్థానాల్లో సెక్యూరిటీ డిపాజిట్ 50 శాతం మాత్రమేనని అభ్యర్థులు గమనించాలన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ వేయడానికి ఆర్‌వోల వద్దకు వచ్చే అభ్యర్థి తనతోపాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్ సమయంలో ఆర్‌వో కార్యాలయం వద్ద వీడియోలు, సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసే ప్రతి అభ్యర్థి తనను బలపరిచే అభ్యర్థి పేరు ఓటరు జాబితాలో ఉందో లేదా పరిశీలించుకోవాలన్నారు. నామినేషన్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేసుకోవడానికి కలెక్టరేట్‌లోని డీఆర్‌వోను సంప్రదించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ తదుపరి అభ్యర్థులు ఏజెంట్ల ను నియమించుకోవచ్చని తెలిపారు.



నాయకులతో సమావేశమైన జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

సరిహద్దుల్లో 24 గంటలు నిఘా

జిల్లా సరిహద్దుల్లో 24 గంటలపాటు నిరంతరం నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. 54 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు పని చేస్తున్నాయని, వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. 12 చెక్‌పోస్టుల వద్ద స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్‌లు గురువారం నుంచి పనిచేస్తాయన్నారు. కోడ్ నాటి నుంచి ఇప్పటి వరకు నగదు, మద్యం, వెండి, బంగారం, ఇతర కానుకలను సీజ్ చేయ గా వాటి విలువ రూ.2.72 కోట్లన్నారు. ఎన్నికల నోటిఫి కేషన్ వచ్చినప్పటి నుంచి జిల్లాలో ప్రవర్తనా నియమావళి పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీ-విజిల్‌లో నమోదైన 270 ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకున్నామన్నారు. కోడ్ ఉల్లంఘించిన ఉద్యోగులు, వలంటీర్లపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎంసీసీ కింద నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, మల్లేశ్వరి, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, వైసీపీ, టీడీపీ నాయకులు రామకృష్ణ, దోనేపూడి రవి, శరత్, ఇనగలూరి మాల్యాద్రి, ఫరీద్‌మస్తాన్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీలో మెరిశారు

- సీఆర్డీఏలో గ్రూప్-1 అధికారి వినీషాకు 821 ర్యాంకు
- అద్దంకి యువకుడు రాహుల్‌కు 873వ ర్యాంక్
- కోచింగ్ లేకుండా, మొదటి ప్రయత్నంలోనే ర్యాంకులు

గుంటూరు సిటీ, అద్దంకిటౌన్, ఏప్రిల్ 16: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో గుంటూరు, బాపట్ల జిల్లా పరిధిలో ఇద్దరు ఉత్తమ ర్యాంకులు సాధించారు. గుంటూరు తాడేపల్లిలో నివాసం ఉంటున్న సీఆర్‌డీఏలో మున్సిపల్ కమిషనర్ హోదాలో పని చేస్తున్న గ్రూప్-1 అధికారి వినీషా 821వ ర్యాంకు, అద్దంకిలోని శ్రీనగర్‌కి చెందిన జగన్నాథం రాహుల్ 873వ ర్యాంక్ సాధించారు. వీరిద్దరూ ఎటువంటి కోచింగ్ లేకుండా, మొదటి ప్రయత్నంలోనే ర్యాంకులు సాధించడం విశేషం. ఉత్తమ ర్యాంకులు సాధించిన వినీషా, రాహుల్‌ను కుటుంబసభ్యులు, బంధువులు అభినందనలతో ముంచెత్తారు.

- సీఆర్డీఏలో మున్సిపల్ కమిషనర్ హోదాలో విధులు నిర్వహిస్తున్న బడబాగ్ని వినీషా మంగళవారం ప్రకటించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో 821వ ర్యాంక్ సాధించారు.
- వినీషా గ్రూపు-1లో విజయం సాధించి మున్సిపల్ కమిషనర్ హోదాలో సీఆర్‌డీఏలో పని చేస్తున్నారు. వినీషా తల్లి విజయభారతి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్నారు. తాడేపల్లిలో నివాసం ఉంటున్న వినీషా పాఠశాల విద్య నెల్లూరు నారాయణ విద్యాసంస్థల్లో జరిగింది. ఈమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ సాధించారు. మద్రాసులో ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన అనంతరం మాస్టర్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లారు. ఆ తర్వాత ఇక్కడికి వచ్చి 2023లో జరిగిన గ్రూపు -1లో ఎంపికై సీఆర్డీఏలో మున్సిపల్ కమిషనర్ హోదాలో పనిచేస్తున్నారు.

- జగన్నాథం రాహుల్ తల్లిదండ్రులు బాబూరావు, ప్రభావతి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. వీరికి ముగ్గురు పిల్లలు కాగా వారిలో మొదటి కుమారుడు రాహుల్. 1 నుంచి 5 వరకు అద్దంకిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో, 6, 7 తరగతులు భాష్యం స్కూల్‌లో, 8 నుంచి 10వ తరగతి వరకు గుంటూరు భాష్యం స్కూల్‌లో చదివారు. విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్, ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ చదివారు. మొదటి ప్రయత్నంలోనే ర్యాంకు సాధించిన రాహుల్‌కు, వారి తల్లిదండ్రులకు మాదిగ ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్ కందుల గంగాధర్, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.



బడబాగ్ని వినీషా



జగన్నాథం రాహుల్

23న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 16: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరం చివరి పనిదినమైన ఈనెల 23న ప్రోగ్రెస్ కార్డులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేరోజు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాఠశాలలో సమావేశాలు నిర్వహించి వారికి తమ పిల్లల ప్రగతిని వివరించాలన్నారు. తల్లిదండ్రులు వందశాతం మంది సమావేశానికి హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహిస్తున్న వార్షిక పరీక్షలు ఒక్క 9వ తరగతి మినహా మిగిలిన అన్ని తరగతులకు ముగిశాయి. 9వ తరగతికి 18వతేదీతో ముగుస్తాయి. జవాబు పత్రాలను వెంటనే మూల్యాంకనం చేసి ఈనెల 22 నాటికి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డుల్లో కూడా మార్పులు చేశారు. పిల్లల నుంచి వారి తరగతి పాఠ్యపుస్తకాలను వెనక్కు తీసుకోవద్దని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

● రెండు దశల్లో అడ్మిషన్లు ● మే 15నుంచి దరఖాస్తులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 16: ఇంటర్మీడియట్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లపై షెడ్యూల్‌ను ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సౌరబ్‌గౌర్ విడుదల చేశారు. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలల్లో అడ్మిషన్లను ఈ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ప్రిన్సిపాల్స్‌ను ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. అడ్మిషన్లు రెండు దశల్లో నిర్వహిస్తారు. మే 15వ తేదీ నుంచి కళాశాలల్లో దరఖాస్తులు విక్రయిస్తారు. మే 22నుంచి పూరించిన దరఖాస్తులను స్వీకరించి విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తారు. మొదటి దశ అడ్మిషన్లు వేసవి సెలవులు అనంతరం కళాశాలలు పునః ప్రారంభమయ్యే జూన్ 1తో ముగుస్తుంది. అదేరోజు నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కూడా జూన్ 1 నుంచే తరగతులు ప్రారంభమవుతాయి. రెండో దశ అడ్మిషన్లకు జూన్ 10నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. జూలై 1నాటికి అడ్మిషన్లు పూర్తి చేయాలి. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీలకు 29శాతం, ప్రత్యేక అవసరాలగల విద్యార్థులకు 3శాతం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కు 5శాతం, సైనికోద్యోగులు, మాజీసైనికోద్యోగుల పిల్లలకు 3శాతం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం సీట్లను కేటాయించాలి. అడ్మిషన్లకు సంబంధించి ఎటువంటి ప్రవేశపరీక్షలు నిర్వహించకుండా కేవలం పదో తరగతి మార్కుల ఆధారంగానే అడ్మిషన్లు ఇవ్వాలి. కళాశాలల్లో గ్రూపుల వారీగా ఏ గ్రూపులో ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయో కళాశాలల్లో ప్రధాన ద్వారం వద్దే నోటీసు బోర్డులో ప్రకటించాలి. సీట్ల వివరాలు ప్రతిరోజు తాజా సమాచారం పొందుపర్చాలి. కళాశాలలకు అనుమతించిన మేరకు ప్రవేశాలు నిర్వహించాలి. జనరల్ సబ్జెక్టుల్లో సెక్షన్‌కు 88మంది, ఒకేషనల్‌లో పారా మెడికల్ కోర్సులకు 30 మంది, ఇతర కోర్సులకు 40 మందికి మాత్రమే అనుమతి ఉంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు చేయాలి. అడ్మిషన్లలో ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ మొత్తాలు జరిమానాలు విధించడంతో పాటు కళాశాలకు బోర్డు గుర్తింపును కూడా రద్దు చేస్తామని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి హెచ్చరించారు.

ప్రజలకు సమాచారాన్నిఅందించేందుకే మీడియా సెల్

● ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16: జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను, సమాచారాన్ని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసేందుకు మీడియా సెల్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని రికార్డ్‌భవనంలో ఏర్పాటు చేసిన మీడియాసెల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. మీడియా సెల్ ద్వారా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జరుగుతున్న పూర్తి సమాచారాన్ని మీడియాకు అందిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మీడియా సర్టిఫికెషన్ అండ్ మానటరింగ్ కమిటీకి 17 దరఖాస్తులు రాగా నిబంధనల మేరకు 10 దరఖాస్తులను అనుమతించామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఝాన్సీ, డీఐపీఆర్‌వో గ్రేస్‌లినోర, డీపీఆర్వో రమేష్, డీవిజనల్ పీఆర్వో దుర్గా ప్రసాదరావు, ఎంసీఎంసీ సభ్యులు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికలకు నేతలు సహకరించాలి

ఆర్వో రవీందర్.. రేపటి నుంచి నామినేషన్‌లకు ఏర్పాట్లు సిద్ధం


మాట్లాడుతున్న ఆర్వో రవీందర్

పర్చూరు, ఏప్రిల్ 16: ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ కోరారు. నామినేషన్ ప్రక్రియపై మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిదులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25వరకు సార్వత్రిక ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. అందుకోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ సెలవు రోజులు తప్ప ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల వరకు నామినేషన్‌లను దాఖలు చేసుకునే అవకాశం ఉందన్నారు. కేంద్రాల వద్ద ఎవరూ బల ప్రదర్శన చేయవద్దని సూచించారు. ప్రక్రియ ప్రారంభం నుంచి ప్రతి అంశం సీసీ కెమెరా పర్యవేక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థికి సంబంధించి కార్యాలయ ప్రాంగణానికి 4గురు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలతోపాటు, రూ.10వేల డిపాజిట్ చేయాలన్నారు. అభ్యర్థులు ఎప్పుడు నామినేషన్ దాఖలు చేసేదీ ముందుగానే పోలీసులకు చెప్పాలన్నారు. నామినేషన్ దాఖలకు 48 గంటల ముందు అభ్యర్థితన బ్యాంక్ ఖాతాను తెరవాలన్నారు. ఎన్నికల నిబంధన అమల్లోకి వచ్చిన తేదీ నుంచి ఎన్నికల ఖర్చు అభ్యర్థి ఖాతాలో జమ అవుతుందని ఆర్వో వివరించారు. ప్రతి అసెంబ్లీ అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40లక్షలు మించరాదని తెలిపారు. అభ్యర్థి తమ దరఖాస్తుతోపాటు బీఫాంను కూడా ఆర్వోకు అందజేయాలన్నారు. నామినేషన్ సమయానికి బీఫారం అందుబాటులో లేకపోతే ఆర్వో సూచన మేరకు తదుపరి అందజేయాలని తెలిపారు. ఈనెల 26న నామినేషన్ పరిశీలన, 29న నామినేషన్ ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పర్చూరు, చిన్నగంజాం, యద్దనపూడి తహసీల్దార్‌లు సీహెచ్.సుబ్బయ్య, ఫణీంద్ర, వై.నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల నేతలు తోట శివనాగేశ్వరావు, అడపాల కృష్ణ, కట్టెంపూడి సుగుణరావు, శ్రీనివాసరావు, న్యాయవాదులు కొల్లా నరేంద్రకుమార్, ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి, కరి ప్రవీణ్, తులసి రాజేష్ ఉన్నారు.

చోరీ కేసులో వీడని మిస్టరీ..!

రోజులు గడుస్తున్నా కానరాని పురోగతి

ఆందోళనలో బాధితులు.. పనిచేయని సీసీ కెమెరాలు

పర్చూరు, ఏప్రిల్ 16 : ఇద్దరు వ్యక్తులపై దాడిచేసి గాయపరిచి, నగదుతో పరారైన కేసు మిస్టరీగా మారింది. రోజులు గడుస్తున్నా పురోగతి కానరాక పోవడంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది. పర్చూరు నుంచి చిలకలూరిపేట వెళ్లే ప్రధాన రహదారిలోని దర్గా సమీప వెంచర్‌లో గత నెల 31వ తేదీ రాత్రి బహిర్భూమికి వెళ్లిన గ్రామానికి చెందిన ఆకుల మధుబాబుపై ఇద్దరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. అతని వద్ద ఉన్న రూ.40వేల నగదుతోపాటు బాధితుని ద్విచక్ర వాహనంతో పరారయ్యారు. అదేరోజు 33/11కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో పర్చూరు నుంచి వంట పని ముగించుకొని స్వగ్రామం చిలకలూరిపేటకు వెళ్తున్న దంపతులపై కూడా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నగదుతో పరారయ్యారు. ఈ ఘటన మరునాడు వెలుగు చూసింది. ఒకే రోజు రెండు ఘటనలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. అయితే రోజులు గడుస్తున్నా ఎలాంటి పురోగతి కనిపించక పోవటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇంతవరకూ దుండగులు చిక్కకపోవడంతో మరోసారి దాడి ఘటనలు జరుగుతాయేమోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి త్వరిత గతిన కేసును ఛేదించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

నిందితులను పట్టుకోవడంలో కీలకమైన నిఘానేత్రాలు (సీసీ కెమెరాలు) అలంకారప్రాయంగా మారాయి. గతంలో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయయడం లేదు. దీంతో నిందుతులను పట్టుకోవడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. కెమెరాల మరమ్మతులను పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొందరికే కోడ్!

చెప్పేవన్నీ అసత్యాలు.. చేసేవన్నీ అరాచకాలు..!

వైసీపీ నేతల అబద్ధాలపై విస్తుపోతున్న జనం

ఒంగోలులో వైసీపీ ప్రచారాల్లో మెప్మా ఆర్పీలు

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

పార్టీ కండువాలతో ఉన్న వారిని పట్టించుకోరు

అన్నీ తెలిసి కూడా మెప్మా అధికారుల మౌనం

అదే టీడీపీ నేతకు పూలబొకే ఇచ్చినందుకు

ఐదుగురు ఆర్పీలపై చర్యలు

ఆగమేఘాలపై లాగిన్ నిలిపివేత

మేం ఎన్ని అక్రమాలు చేసినా అది సక్రమమే.. అదే ప్రతిపక్ష పార్టీ వారిని మాటవరుసకు పలకరించినా పెద్ద తప్పే.. ఇదీ ప్రస్తుతం వైసీపీ నేతల తీరు. ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో రెండురోజుల క్రితం ఎమ్మెల్యే బాలినేని కొందరు ఆర్పీలు టీడీపీ ప్రచారంలో ఉన్నారని వెల్లడించడంతోపాటు, వారిపై తాను స్వయంగా ఫిర్యాదుచేసినా అధికారులు చర్యలు తీసుకోలేదంటూ ఆవేశంగా మాట్లాడారు. అయితే వాస్తవంగా పరిశీలిస్తే.. గత కొద్ది రోజులుగా కొందరు ఆర్పీలు వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పార్టీ కండువాలు కప్పకుని మరీ బహిరంగంగానే తిరుగుతున్నారు. మరోవైపు ఓ రెస్టారెంట్‌లో బాలినేని కోడలు వారికి పార్టీ కూడా ఇచ్చారు. అయితే పదిహేను రోజుల క్రితం దామచర్ల నాగసత్యలత ఓ కార్యక్రమానికి హాజరు కాగా, స్థానిక ఆర్పీలు పలకరించారు. దీనిపై వైసీపీ వారు రాద్ధాంతం చేశారు. కోడ్ ఉల్లంఘించారంటూ వారిపై ఫిర్యాదు చేయడంతో అధికారులు వారి లాగిన్‌లు నిలిపివేశారు. మరి అధికారులకు వైసీపీ ప్రచారంలో ఉన్న ఆర్పీలు కనిపించడం లేదు ఎందుకో మరి.


ప్రణీత్‌రెడ్డిని కలిసిన ఆర్పీ


కావ్యరెడ్డి ప్రచారంలో ఆర్పీ

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 16 : చెప్పేది అబద్ధాలు.. చేసేది అక్రమాలు అన్నట్లు ఉంది వైసీపీ నాయకుల వ్యవహారం. తమవైపు పనిచేస్తే అంతా సరైనదే.. అదే ఎదుటి పార్టీ వారిని కనీసం పలకరించినా తప్పే అన్నట్లు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఒంగోలు నగరంలో మెప్మా ఆర్పీలే నిదర్శనం. వారి పార్టీ తరపున కొందరు ఆర్పీలు బహిరంగంగా వైసీపీ కండువాలు, ప్లకార్డులు పట్టి ప్రచారం చేస్తుంటే ఓకే. అదే ప్రతిపక్ష పార్టీ వారిని మర్యాదపూర్వకంగా పలకరించినా తప్పు అంటూ బెదిరిస్తున్న పరిస్థితి. జిల్లా అధికారులు కూడా వైసీపీ నేతలకే వంతపాడుతుండటంతో కొందరు ఉద్యోగులు రెచ్చిపోతున్నారు. ఏకంగా వైసీపీ నేత కోడలితో కలిసి ప్రచారంలో పాల్గొనడమే కాకుండా పార్టీలకు వెళుతున్నారు. వివరాల్లోకి వెళితే.. వలంటీర్ ఎన్నికల ప్రచారంలో ఉందని ప్రశ్నించినందుకు ఐదురోజుల క్రితం ఒంగోలులో వైసీపీ నేతలు చేసిన రణరంగం రాష్ట్రం మొత్తం చూసింది. పైగా తామేమీ నిబంధనలు అతిక్రమించలేదంటూ రాద్ధాంతమే చేశారు. ఈ విషయంలో వందల సంఖ్యలో వైసీపీ శ్రేణులు జనంపై రౌడీయిజం చేశారు. చివరికి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నానా హడావుడి చేసి, పేషెంట్లను భయభ్రాంతులకు గురిచేశారు. జరిగిన ఘటనపై తమ తప్పేమీ లేదంటూ అబద్ధాలను సైతం అరిచి చెప్పారు. అయితే జరిగిన భౌతిక దాడులు, విధ్వంసంపై జీజీహెచ్ అధికారులు బాధ్యులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు టీడీపీ, వైసీపీ శ్రేణులను అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించిన విషయం విదితమే ఇదేసమయంలో ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్దకు వచ్చిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఏకంగా అధికారుల తీరును తప్పుబట్టారు. కలెక్టర్ సైతం తన ఫోన్ ఎత్తడం లేదని, కొందరు ఆర్పీలు టీడీపీ ప్రచారంలో ఉన్నారని వెల్లడించడంతోపాటు, వారిపై తాను స్వయంగా ఫిర్యాదుచేసినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు వైసీపీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ ఆవేశంగా మాట్లాడారు. కానీ వైసీపీ నేతలు, వారికి అనుయాయులుగా పనిచేస్తున్న కొందరు ఆర్పీలు చేసిన తప్పుడు ఫిర్యాదుతో అప్పటికే కొందరు ఆర్పీలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు జరిగిన ఘటనలపై తమ తప్పేమి లేదని పదేపదే నొక్కి చెబుతున్న వైసీపీ నేతలు తమ పార్టీ ప్రచారంలో ఉన్న మెప్మా ఆర్పీల గురించి ఏం సమాధానం చెబుతారో మరి. వారిపై జిల్లా ఎన్నికల అధికారి ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

వైసీపీ ప్రచారంలో ఆర్పీలు ఉంటే ఉల్లంఘన కాదా ?

గత కొద్దిరోజులుగా కొందరు ఆర్పీలు వైసీపీ కార్యకర్తలు మాదిరిగా పనిచేస్తున్నారు. ఏకంగా ప్రచార సభలు, కార్యక్రమాలలో పార్టీ కండువాలు కప్పుకొని మరీ బహిరంగంగానే తిరుగుతున్నారు. ప్లకార్డులు పట్టుకుని ఇల్లిల్లూ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఓ రెస్టారెంట్‌లో ఎమ్మెల్యే బాలినేని కోడలు వారికి పార్టీ కూడా ఇచ్చారు. అందులో పార్టీశ్రేణులతో పాటు, ప్రచారంలో పాల్గొన్న ఆర్పీలు ఉండటం విశేషం. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో అటు టీడీపీ, ఇటు వైసీపీలు నగరంలోని డివిజన్‌లలో ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఓ పదిహేను రోజుల క్రితం 47 డివిజన్‌లో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత ఓ కార్యక్రమానికి హాజరు కాగా, కొందరు ఆర్పీలు నాగసత్యలతకు పూలబొకే అందించారు. దీంతో వైసీపీ సానుభూతిరులుగా ఉండే కొందరు ఆర్పీలు ఫొటోలు తీసి మరీ రాద్ధాంతం చేశారు. తాము మాత్రమే సచ్ఛీలురమంటూ చెప్పుకునే వైసీపీ వారు, సదరు ఆర్పీలు కోడ్ ఉల్లంఘించారంటూ వేలెత్తిచూపి అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా మెప్మా అధికారులు సైతం అధికారపార్టీ ఒత్తిళ్లకు లొంగి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ చెప్పారంటూ టీడీపీ ఆర్పీల లాగిన్లు నిలిపివేశారు.

లికితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం:

- టి. రవికుమార్, మెప్మా పీడీ

మెప్మా ఆర్పీలు, ఇతర సిబ్బంది ఎవరైనా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరు ఆర్పీలపై కలెక్టర్ ఆదేశాలతో వారి లాగిన్‌లు నిలిపివేసి, చర్యలు తీసుకున్నాం. అలాగే వైసీపీ ప్రచారంలో కూడా ఆర్పీలు పాల్గొంటున్నట్లు నా దృష్టికి కూడా వచ్చింది. అందుకు సంబంధించి ఫొటోలను కూడా ఓ వ్యక్తి నాకు వాట్సాప్ చేశారు. దీనిపై విచారణ చేస్తున్నాం. అయితే లిఖితపూర్వకంగా, ఆధారాలతో ఫిర్యాదుచేస్తే వారిపైనా చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు. ఎన్నికల నిబంధనల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మా విధులు మేము నిర్వహిస్తాం.

తెలిసి కూడా మెప్మా అధికారుల మౌనం

టీడీపీ సానుభూతిపరులు అంటూ ముద్ర వేసి ఐదుగురు ఆర్పీలపై కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్న పరిస్థితి. అయితే అధికారం మాది, మమ్మల్ని అడిగేవారు ఎవరు? అంటూ యథేచ్ఛగా కొందరు ఆర్పీలు వైసీపీ ఎమ్మెల్యే బాలినేని, ఆయన సతీమణి, ఆయన కోడలితో ఎన్నికల ప్రచారంలో నిరంతరం కనిపిస్తుండగా, అధికారుల కళ్లకు మాత్రం కనిపించకపోవడం విశేషం. వైసీపీ ఆర్పీల కోడ్ ఉల్లంఘనపై పలువురు మెప్మా పీడికి సమాచారం అందించి, ఆధారాలతో సహా చూపినా స్పందన అంతంతమాత్రమే. లిఖితపూర్వక ఫిర్యాదు ఉంటేనే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పడం విశేషం. జిల్లాలో మెప్మా పనితీరుపై ఇప్పటికే చాలా విమర్శలు ఉండగా, మరోవైపు అధికార పార్టీ నేతల ఒత్తిడితో వాస్తవాలు తెలిసినా మౌనం వహించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి., అధికారం అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు చేస్తున్న అరాచకాలను ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం అలవాటుగా మారింది. ఎన్నికల కోడ్ నిబంధనలు టీడీపీకో న్యాయం. వైసీపీకో న్యాయమా? అని నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

కీలకఘట్టం సిద్ధం

రేపటి నుంచి నామినేషన్లు

18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరణ

26న నామినేషన్ల పరిశీలన

29 వరకు ఉపసంహరణకు గడువు

రిటర్నింగ్ అధికారుల వద్ద దాఖలుకు ఏర్పాట్లు

జిల్లాలో ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు

2,183 పోలింగ్ కేంద్రాలు, 18,14,371 మంది ఓటర్లు

తాజాగా మరో 8,320 మంది దరఖాస్తు

నోటిఫికేషన్ విడుదల: 18-4-24
నామినేషన్ల స్వీకరణ తుది గడువు: 25-4-24
నామినేషన్ల పరిశీలన: 26-4-24
నామినేషన్ల ఉపసంహరణ గడువు: 29.4.24
పోలింగ్ తేదీ: 13-5-24, ఓట్ల లెక్కింపు: 4.6.24

ఒంగోలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నిర్వహణలో కీలకఘట్టం ఈనెల 18 నుంచి ప్రారంభంకానుంది. అత్యంత ప్రధానమైన అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఆ రోజు నుంచి ప్రారంభమవుతుంది. తొలుత ఆయా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆ వెంటనే నామినేషన్లు స్వీకరణను చేపడతారు. ఈనెల 25 వరకు దాఖలు చేయవచ్చు. సెలవు దినాలు కాకుండా ఈనెల 18 నుంచి 25 మధ్య ప్రభుత్వ పనిదినాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఆ మేరకు ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వగా సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలు జరగనున్న విషయం విదితమే. ఒంగోలు పార్లమెంట్‌కు కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తుండగా ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ఉన్న కలెక్టర్ చాంబర్‌లోనే అందుకు సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారు. ఎస్ఎన్‌పాడు స్థానానికి జేసీ గోపాలకృష్ణ రిటర్నింగ్ అధికారిగా ఉండగా చీమకుర్తిలోని తహసీల్దార్ ఆఫీసులో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. అభ్యర్థులు చీమకుర్తిలో నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి స్థానాలకు అక్కడి ఆర్డీవోలు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. నామినేషన్లు వారి కార్యాలయాల్లో స్వీకరిస్తారు. ఇక దర్శి, గిద్దలూరు, కొండపి, వైపాలెం సెగ్మెంట్లకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్ కార్యాలయాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయాలుగా ఏర్పాటుచేశారు. తదనుగుణంగా అభ్యర్థులు అక్కడే నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఇప్పటికే అందుకు సంబంధించి అధికారిక ఏర్పాట్లను పూర్తిచేశారు. పోటీచేసే అభ్యర్థులు లేదా వారి తరఫు ప్రతినిధులకు అవసరమైన సమాచారం, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు మంగళవారం నుంచి ఆర్వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటుచేశారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో మార్చి 29 నాటికి మొత్తం 18,14,371 మంది ఓటర్లు ఉండగా వారిలో 9,10,370 మంది మహిళలు ఉండగా 9,03,894 మంది పురుషులు ఉన్నారు. అలాగే 107 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. కాగా ఈనెల 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరో 8,320 దరఖాస్తులు అధికారులకు అందాయి. వాటిని పరిశీలిస్తున్నారు. అర్హులైన వారికి తుది జాబితాలో ఓటు హక్కు కల్పించనున్నారు. ఆ ప్రకారం జిల్లాలో మరి కొద్దిమేర ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. కాగా జిల్లాలోని ఎనిమిది సెగ్మెంట్లలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియలో దాదాపు 25వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వామ్యులు అవుతున్నారు.

మూడు సిలిండర్లు.. సూపర్ సిక్స్!

ఒంగోలులో దామచర్ల వినూత్న ప్రచారం



మూడు సిలిండర్లపై సూపర్ సిక్స్ ప్రచారం అదిరింది. టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ తన ప్రచారంలో భాగంగా వినూత్న వాహనాన్ని సిద్ధం చేశారు. సరికొత్త ఐడియాతో సిద్ధం చేసిన ఆ వాహనంతో టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన ఏడాదికి ఒకింటికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల హామీని ప్రజలకు మరింత చేరువ చేశారు. అలాగే ఆ సిలిండర్లపై సూపర్‌సిక్స్ పథకాల గురించి రాయించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఆటోలో మూడు సిలిండర్ల నమూనాను ఉంచి నియోజకవర్గంలో వినూత్న ప్రచారానికి తెరతీశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా దామచర్ల ఏర్పాటుచేసిన ఉచిత గ్యాస్ సిలిండర్ల ప్రచార వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. - ఒంగోలు (కార్పొరేషన్)

చెట్టును ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

బాపట్లరూరల్, ఏప్రిల్ 16 : రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంగళవారం అప్పికట్ల గ్రామసమీపంలో చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చీరాల మండలం తోటవారిపాలెం గ్రామానికి చెందిన కిరణా వ్యాపారి గంగాధర్ అదేగ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుండుబోయన శ్రీనివాసులతో కలిసి ఆటోలో గుంటూరుకు కిరణా సరుకుల కోసం వెళుతుండగా అప్పికట్ల గ్రామసమీపంలోని నల్లమడ కాల్వ మలుపు వద్ద ఆటో అదుపుతప్పి చెట్టును వేగంగా ఢీకొట్టారు.. ఈఘటనలో ఆటోడ్రైవర్ గుండుబోయన శ్రీనివాసులు(24) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న మరో వ్యక్తి గంగాధర్‌కు గాయాలు కావటంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియావైద్యశాలకు పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు.

వైద్యారోగ్యశాఖ అక్రమాలపై విచారణ

డీఎంహెచ్ఓతోపాటు ఇతర అధికారుల పాత్రపై ఆరా

రికార్డుల పరిశీలన, పలు అంశాలపై ప్రశ్నలు

విచారణాధికారి ఆర్డీ డి.పద్మశశిధర్‌ను కలిసిన పలువురు


విచారణాధికారి పద్మశశిధర్‌కు వైద్యఆరోగ్యశాఖ అధికారి రాజ్యలక్ష్మీపై ఫిర్యాదు చేస్తున్న సృజన్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16 : వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై రాజమహేంద్రవరం వైద్యఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డి.పద్మశశిధర్ విచారణ చేపట్టారు. ప్రైవేటు వైద్యశాలల అనుమతుల మంజూరుతోపాటు డిప్యూటేషన్లు, ఉద్యోగుల తొలగింపు, నకిలీ సర్టిఫికెట్లు ఉన్న ఉద్యోగుల కొనసాగింపు తదితర అక్రమాలపై ముగ్గురు ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేసేందుకు డాక్టర్ పద్మశశిధర్‌ను నియమించిన విషయం తెలిసిందే. మంగళవారం కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ముందుగా నోటీసులు ఇచ్చిన ప్రకారం రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మిని పలు అంశాలపై విచారణ చేశారు. అదేవిధంగా అందుకు సంబంధించిన సూపరింటెండెంట్‌తోపాటు ఇతర అధికారులు, ఆయా సీట్ల గుమాస్తాలతో మాట్లాడినట్లు తెలిసింది. ముందుగా ప్రైవేటు వైద్యశాలలకు ఇచ్చిన అనుమతులపై ఆరా తీసినట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. మాన్యువల్‌గా ఎన్ని అనుమతులు ఇచ్చారు.. తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. మరోవైపు అక్రమాలపై ఫిర్యాదుచేసిన టంగుటూరుకు చెందిన శ్రీనివాసులు, కొమ్ము సృజన్, ప్రొద్దుటూరు అడ్వకేట్ విజయభాస్కర్‌రెడ్డిలను కూడా విచారణ చేశారు. ఆ సమయంలో డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మీ, కార్యాలయ సూపరిటెండెంట్ పయ్యావుల శ్రీనివాసులు పలు అక్రమాలకు పాల్పడినట్లు పలు ఆధారాలను ఇచ్చినట్లు తెలిసింది. ఇంకొకవైపు అనేకమంది నకిలీ సర్టిఫికేట్లతో ల్యాబ్‌టెక్నిషియన్ ఉద్యోగాలు చేస్తున్నారని, అన్ని అర్హతలు ఉన్నావారిని మాత్రం తొలగించారన్నారని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరోవైపు వైద్యశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులతోపాటు నియామకాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణాధికారి పద్మశశిధర్‌ను కలిసి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వైద్యశాఖ అధికారులు, ఉద్యోగులతోపాటు వివిధ రకాల వచ్చిన ఫిర్యాదులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు విచారణాధికారి చెప్పినట్లు సమాచారం.

దుర్మార్గ పాలన అంతానికే కూటమి పోరాటం

- పేదల కోసం పుట్టిన పార్టీ టీడీపీ
- జయహో బీసీలో ఎమ్మెల్యే ఏలూరి
- ఇంకొల్లు ప్రచారంలో మహిళల బ్రహ్మరథం


బీసీలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి


ఇంకొల్లులో ఏలూరితో కలిసి ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ఇంకొల్లు, ఏప్రిల్ 16 : జగన్‌రెడ్డి దుర్మార్గ పాలనను అంతం చేసేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పోరాటం చేస్తోందని కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉద్ఘాటించారు. మంగళవారం ఇంకొల్లు, పావులూరులో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా పావులూరి ఆంజనేయస్వామి గుడిలో ఏలూరి పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు ఏలూరికి బ్రహ్మరథం పట్టారు. హారతలిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఇంకొల్లులో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఏలూరి మాట్లాడారు. బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. పేదల కోసం పుట్టిన తెలుగుదేశం పార్టీకి ప్రజలు మద్దతు తెలపాలన్నారు. కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఇంకొల్లులో ఆటోనగర్‌ను ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పావులూరులో ఇంటి స్థలాల సమస్యను పరిష్కరిస్తానన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి పేదల సంక్షేమానికి పాటుపడతానన్నారు. ఇంకొల్లులో స్టాలిన్‌పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈనెల 22న నా నామినేషన్ కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచీ తరలివచ్చి ఆశీర్వదించాలని ఏలూరి కోరారు. స్టాలిన్‌పేట చర్చిలో పాస్టర్లు ఏలూరి గెలవాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇంకొల్లుకు చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు అయోషాబుడే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు రామకృష్ణ, పెదపూడి విజయకుమార్, బీసీ నాయకులు గుంజి వెంకట్రావు, వీరగంధం, బాబర్, శ్యాం, రఫీ, బట్టు శ్రీనివాసరావు, బేతపూడి, పాలేరు రామకృష్ణ, కరి శ్రీను, వలేరు మార్క్స్ పాల్గొన్నారు.

మైనారిటీలకు ఆటోనగర్‌ని ఏర్పాటు చేస్తా

- గొట్టిపాటినగర్‌లో షాదీఖానాకు కృషి : ఎమ్మెల్యే ఏలూరి
- వైసీపీని వీడి టీడీపీలో చేరిన 20 కుటుంబాలు

మార్టూరు, ఏప్రిల్ 16 : మార్టూరు గ్రామంలో మైనారిటీలకు ఆటో నగర్ ఏర్పాటు చేస్తానని, గొట్టిపాటినగర్‌లో షాదీఖానా నిర్మాణానికి కృషి చేస్తానని కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హామీ ఇచ్చారు. మంగళవారం మార్టూరు గ్రామంలోని గొట్టిపాటినగర్‌కు చెందిన 20 మైనారిటీ కుటుంబాలు వైసీపీని వీడి ఏలూరి క్యాంప్ కార్యాలయంలో టీడీపీలో చేరాయి. వారందరికీ ఎమ్మెల్యే ఏలూరి కండువాలను వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ గొట్టిపాటినగర్‌లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఇంకొల్లు మైనారిటీలకు ఆటోనగర్‌ని ఏర్పాటు చేస్తానని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. పర్చూరు, మార్టూరులో ఆటో నగర్‌ల నిర్మాణం చేపడతానన్నారు. నియోజకవర్గంలో అన్ని చోట్లా కబ్రస్థాన్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతానన్నారు. నియోజకవర్గంలో 25 వేల మంది పేదలకు 2 సెంట్ల స్థలాన్ని ఇస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో షేక్ ఇస్మాయిల్, షేక్ సుభాని, షేక్ కాలేషావలి, షేక్ కరీంబాషా, సోడాగుడి అజయ్, షేక్ బాజి, షేక్ సుభాని, షేక్ బాజి, పఠాన్ ఉమర్ అహ్మద్, షేక్ నాగూర్ వలి, షేక్ సుభాని, షేక్ జిలాని, షేక్ గౌస్, పఠాన్ బాజి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ రజాక్, షేక్ ఫరూక్, ఉస్మాన్, జిలాని, సుభాని పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన గొట్టిపాటినగర్‌కు చెందిన మైనారిటీ కుటుంబాలు

ఏలూరిని గెలిపించండి.. మహిళల ప్రచారం

ఎమ్మెల్యేగా మూడోసారి ఏలూరి సాంబశివరావును గెలిపించాలని మంగళవారం కిషోర్‌కాలనీలో టీడీపీ మహిళా కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కిషోర్ కాలనీలో ఏలూరి చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే, సమస్యలు పరిష్కారం కావాలంటే తిరిగి ఏలూరిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్రం బాగు కోసం బాబును ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వెనుక కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పుటూరి రమాదేవి, అరుణ కస్తూరి, రాధ, జంపని శ్రీను, తాటి నాగేశ్వరరావు, పుట్టా శ్రీను, కాకోలు వెంకటేశ్వర్లు, గన్నవరం బుడే, గొట్టిపాటి వెంకట్రావు కమ్మ శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఓటు హక్కు అమూల్యమైనది

చినగంజాం, ఏప్రిల్ 16 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైనదని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చినగంజాం గ్రామంలో మంగళవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వజ్రాయుధం లాంటిదని ప్రలోభాలకు గురై ఓటును దుర్వినియోగం చేయొద్దని సూచించారు. స్వేచ్ఛగా ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారలు, యువత పాల్గొన్నారు.

ఓటు వినియోగంతోనే అభివృద్ధి

చీరాలటౌన్, ఏప్రిల్ 16 : ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని దానిని సక్రమంగా వినియోగించుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, స్వీప్ నోడల్ అధికారి వై.పిచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వాడరేవులో స్వీప్ ఓటు హక్కు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్స్యకార ఓటర్లకు ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. మానవ హారం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ అధికారులు వెంకటరావు, శోభన్‌బాబు, ఏపీఎం సుబ్బారావు, స్వాతి, శ్రీనివాసులు, వీవోఎలు, స్థానికులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆత్మారావు

చినగంజాం, ఏప్రిల్ 16 : చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో చినగంజాం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రిక్షా కార్మికులు, పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. వేసవి ముగిసే వరకూ చలివేంద్రం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మస్తాన్‌రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సంతకాలకే పరిమితమైన సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ

బల్లికురవ, ఏప్రిల్ 16 : మూడు మాసాల కోసారి గ్రామాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎన్నికల కోడ్ నేపథ్యంలో సభ్యుల సంతకాలు తీసుకొని ముగించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మొత్తం 15 మంది సభ్యులుకు గాను అయిదుగురు సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎలాంటి సమీక్షా సమావేశాలు నిర్వహించరాదని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎంపీడీవో హనుమారెడ్డి సమావేశానికి వచ్చిన సభ్యు లు అధికారుల సంతకాలను తీసుకొని వెంటనే ముగించారు.

నేర నియంత్రణకు సహకరించకుంటే చర్యలు

వాడరేవు(చీరాలటౌన్), ఏప్రిల్ 16 : నియంత్రణకు అందరూ సహకరించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం వాడరేవులో పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ కోడ్ అమలులో ఉందని వివరించారు. అంతేకాకుండా అన్ని ప్రాంతాల్లో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఉల్లంఘిస్తే తప్పుకోలేరని చెప్పారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని భిన్నంగా వ్యవహరిస్తే కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, బిఎస్ఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ పోలీసుల తనిఖీలు

పర్చూరు, ఏప్రిల్ 16 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యంను అక్రమంగా తరలించకుండా ఎస్ఈబీ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ సమీప కూడలిలో ఎస్ఈబీ సీఐ ఎం.భుజంగరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

చెరువులకు చేరని సాగర్ జలాలు

- అడుగంటడంపై ప్రజల్లో ఆందోళన
- నేటికీ నూతలపాడు మైనర్‌కు చేరని నీరు
- వేసవిలో సమస్య లేకుండా చూడాలని విజ్ఞప్తి


ఎండిపోయిన నాగులపాలెం మంచినీటి చెరువు


నూతలపాడు మైనర్‌కు చేరని జలాలు

పర్చూరు, ఏప్రిల్ 16 : వేసవిని అధిక మించేందుకు మంచినీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరక పోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. నీరు విడుదల చేసి ఎనిమిది రోజులు గడుస్తున్నా నేటికీ చెరువులకు చుక్కనీరు చేరలేదు. దీంతో వేసవిలో మంచినీటి పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు మండల పరిధిలో ఉన్న 18 చెరువులు సాగర్, కొమ్మమూరి కాలువ ద్వారా నింపుకోవాల్సి ఉంది. అయితే పదిరోజుల పాటు నీటిని విడుదల చేసి ఆయా మంచినీటి చెరువులను నింపుతామని అధికారులు చెప్పున్నప్పటికీ గడువు ముగుస్తున్నా నేటికీ చెరువులకు నీరు చేరలేదు. ఇప్పటికే మండలంలోని చెరువులు నీరులేక అడుగంటాయి. ఉన్న అరకొర నీరు రంగుమారి కంపుకొడుతున్నాయి. గత్యంతరం లేక ఉన్న నీటితోనే ప్రజలు రోజులు వెళ్లదీస్తున్నారు. మంచినీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసినా ఫలితం కానరాకపోవటంతో ప్రజల్లో నైరాశ్యం నెలకొంది. దీనికి తోడు పర్చూరు ఆయకట్టు చివర ఉండడం, సాగర్ కాలువలను అభివృద్ధి చేయకపోవడంతో చిల్లచెట్లు, ముళ్లపొదలతో నిండిపోయి నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పర్చూరు, నాగులపాలెం, అడుసుమల్లి తదితర గ్రామాల్లోని చెరువులు పూర్తిగా అడుగంటాయి. సాగర్ జలాల విడుదల నేపథ్యంలో చెరువులను నింపుకునేందుకు కాలువలను సిద్ధం చేసుకున్నా నేటికీ నూతలపాడు మైనర్‌కు నీరు చేరకపోవడంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అదనంగా మూడు టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నా అచరణకు నోచుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ స్పందించి చెరువులకు నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ యువ నేతలు

టీడీపీకి వైసీపీ యువనేతల మద్దతు

గొట్టిపాటి సమక్షంలో పార్టీలో చేరిక

మేదరమెట్ల , ఏప్రిల్ 16 : మేదరమెట్లకు చెందిన వైసీపీ యువ నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో చేరి టీడీపీకి మద్దతు తెలిపారు. మంగళవారం ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో మేదరమెట్లకు చెందిన వైసీపీ యువనేతలు మన్నె వెంకటేష్, మన్నె అశోక్, మన్నె వేణు, పి.నాగరాజు, రావూరి అర్జున్, మన్నె రామకృష్ణ, నీలం దేవేంద్ర, రవి, రాంబాబు, శోభన్‌బాబు తదితరులు వైసీపీ వీడి రాగా వారికి గొట్టిపాటి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి అభ్యర్థులకు భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామని యువనేతలు ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మన్నె ప్రసాద్, వేగూరి ప్రేమ్‌కుమార్, ఓగూరి శ్రీనివాసరావు, ముప్వ నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శలు

పంగులూరు, ఏప్రిల్ 16 : మండలంలోని నూజెళ్లపల్లి, తూర్పుతక్కెళ్లపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పర్యటించారు. నూజెళ్లపల్లి ఎస్సీ కాలనీలో ఇటీవల మృతి చెందిన శానం హనుమంతరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం ఆపరేషన్ చేయించుకొని ఇంటివద్ద ఉన్న తక్కెళ్లపాడు టీడీపీ నేత మద్దిరెడ్డి పిచ్చిరెడ్డిని గొట్టిపాటి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కేవీ సుబ్బారావు, రావూరి రమేష్, గొట్టిపాటి కాజా, జాగర్లమూడి సుబ్బారావు ఉన్నారు.

వృథాగా సాగర్ జలాలు

- పొలాల్లోకి పోతున్న తాగునీరు
- పట్టించుకోని అధికారులు
- తాగునీటి చెరువులు నిండేదెలా అని ప్రశ్నిస్తున్న ప్రజలు
- వెంటనే కట్టడి చర్యలు చేపట్టాలని డిమాండ్


బ్రాంచి కాలవకు విడుదలైన సాగర్ నీరు


వల్లాపల్లి సమీప పొలాల్లోకి వృథాగా వెళ్తున్న నీరు

బల్లికురవ, ఏప్రిల్ 16 : తాగు నీటి కోసం విడుదలైన సాగర్ జలాలు వృథాగా పోతున్నాయి. వేసవిలో గ్రామాలలో తాగు నీటి ఎద్దడి పెద్ద ఎత్తున నెలకొనడంతో ప్రభుత్వం తాగు నీటి చెరువులను నింపేందుకు సాగర్ నీటిని అద్దంకి బ్రాంచి కెనాల్ కాలవకు విడుదల చేసింది. చుక్క నీటిని వృథా కానివ్వకుండా తాగు నీటి చెరువులకు పెట్టాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేసిన ఏబీసీ కాలవ నుంచి మాత్రం తాగు నీరు వృథాగా పంట దుక్కులపై గుండా ప్రవహిస్తోంది. ఇలా అయితే దిగువన ఉన్న తాగు నీటి చెరువులకు నీరు ఎలా చేరుతుందని ప్రజలు అంటున్నారు. అధికారులు కాలవకు నీరు రాకముందే కాలవకు యూటీలకు ఉ న్న రంధ్రాలను పూ డ్చక పోవడం వల నే ఇప్పుడు నీరు వృథా అవుతుందని ప్రజలు అరోపిస్తున్నారు. బల్లికురవ మండల పరిధిలోని అద్దంకి బ్రాంచి కాలవ 33వ మైలు వద్ద వల్లాపల్లి గ్రామ సమీపంలో ఉన్న యూటీ రంధ్రం ద్వారా పెద్ద ఎత్తున ఏబీసీ కాలవ నీరు పంట దుక్కులపైకి పారుతోంది. తాగునీటి చెరువులకు చేరాల్సిన నీరు ఎవరికి ఉపయెగ పడకుండా పోతుండడం చూసిన బాటసారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే అరకొరగా సాగర్ డ్యాం నుంచి వస్తున్న తాగు నీరు ఇలా చెరువులకు ఎలా చేరుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, ఎన్ఎస్పీ అధికారుల పర్యవేక్షణ చేపట్టాలని వారు కోరుతున్నా రు. వల్లాపల్లి వద్ద ఉన్న ఏబీసీ కాలువ నుంచి అంబడిపూడి వరకు పంట పొలాల మీదుగా నీరు వస్తోందని వెంటనే అధికారులు వృథా నీటిని కట్టడి చేసి చెరువులకు చేరేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాలటౌన్, ఏప్రిల్ 16 : 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్స్, పైలట్ (డ్రైవర్) పోస్టులకు అర్జీలు స్వీకరిస్తున్నట్లు జిల్లా మేనేజర్ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు పూర్తి చేసి ఉండాలన్నారు. అభ్యర్థుల వయసు 35 దాటరాదని, అర్హులైన వారు ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 830 953 0078, 888 510 7040 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రా అగ్రస్థానం

- జగన్‌రెడ్డి పాలనలో కుదేలైన వ్యవసాయం
- టీడీపీ అధికారంలోకి రాగానే రూ.20వేల పెట్టుబడి సాయం
- కూటమి అభ్యర్థి గొట్టిపాటి


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 16 : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయంలో వ్యవసాయం లాభసాటిగా ఉండేదని, ప్రస్తుతం జగన్‌రెడ్డి విధానాలతో రైతుల ఆత్మహత్యలలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యలలో 2వ స్థానంలో ఉందని అద్దంకి కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం రవికుమార్ మండలంలోని కొత్తరెడ్డిపాలెం, శింగరకొండపాలెం గ్రామాలల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందించారు. టీడీపీ అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సాయంగా రూ20వేలను అందిస్తామన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేసేలా చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎంతో ముఖ్యమైన నీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా గాలికొదిలే శారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పోలవరం, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగు, ప్ర జలకు తాగునీటి కష్టాలను తీర్చుతారన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగిన గొట్టిపాటి స్థానిక సమస్యలను మహిళల ద్వారా తెలుసు కున్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని, మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని మాటిచ్చారు. టీడీపీ హయాంలో వ్యవసాయానికి సంబంధించి ఉద్యాన వన, వాణిజ్య పంటలకు రూ20 కోట్ల రాయితీపై సామగ్రి, యంత్రాలను అందిం చి వ్యవసాయన్ని పండుగలా మార్చామన్నారు. వైసీపీ పాలనలో వ్యవసాయం దండగలా మారిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర రాక, ఆరుగాలం కష్టించిన పంటలు తుఫాన్‌లకు నష్టపోగా రైతులకు వైసీపీ చిల్లిగవ్వ కూడా చెల్లించలేదన్నారు. పంటల సాగు కోసం చేసిన అప్పులు చెల్లించ లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నారన్నారు. గొట్టిపాటి ఆందోళన వ్యక్తం చేశారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ జగన్‌రెడ్డి మాయమాటలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని చూ స్తున్నారన్నారు. రైతులు ఆలోచించి మరోసారి వైసీపీకి ఓటు వేసి మోసపోవద్దని గొట్టిపాటి అప్రమత్తం చేశారు. సిద్ధం సభలతో ప్రజలను మభ్య పెట్టేందుకు జగన్‌రెడ్డి డ్రామాలు మొదలు పెట్టారని, వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, యువతకు ఉద్యోగాలు లేకుండా చేసిన జగన్‌రెడ్డిని ఓటుతో తరిమేయాలని గొట్టిపాటి పిలుపునిచ్చారు. మీ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్ర మంలో పరిసర గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదరించండి..అందరికీ అందుబాటులో ఉంటా

కూటమి అభ్యర్థి కొండయ్య


న్యాయవాదులతో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, ఏప్రిల్ 16 : పరిస్థితులన్నీ మీకు తెలుసు.. నేను స్నేహపూర్వకంగా వ్యవహరించే వ్యక్తిని.. ఆదరించండి..అందరికీ అందుబాటులో ఉంటానని.. అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కావాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. కోర్టు భవనాల సముదాయంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం కొండయ్య న్యాయవాదులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒనగూరే ప్రయోజనాలను, రాష్ట్రాభివృద్ధి మార్గం సుమగమం అయ్యేందుకు చేపట్టే కార్యాచరణను వివరించారు. న్యాయవాదులకు సంబంధించిన ఉమ్మడి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశాలకు విశేష ఆదరణ

కూటమి అభ్యర్థి కొండయ్య సోమవారం మండల పరిధిలోని గవినివారిపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం, ఎలికవారిపాలెం, మేకలవారి దిబ్బ, కొండయ్యగారి దిబ్బ తదితర ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల వారు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి కొండయ్యకు విశేష స్పందన లభించింది. అనంతరం పుల్లాయపాలెంలో పోలేరమ్మ గుడి రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో కొండయ్య పాల్గొన్నారు. ఆయా సందర్భాల్లో కొండయ్య మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. బీసీ డిక్లరేషన్‌తో ప్రత్యేకంగా బీసీలకు కలిగే రక్షణ, ఇతర ప్రయోజనాలను వివవరాంచారు. వారి సందేహాలను నివృత్తి చేశా రు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.


అంబడిపూడిలో ప్రచారం చేస్తున్న బాబీ

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఇంటింటి ప్రచారంలో యువనేత కమల్‌కిషోర్

బల్లికురవ, ఏప్రిల్ 16 : వచ్చే ఎన్నికలలో టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) కోరారు. మంగళవారం మండలంలోని చినఅంబడిపూడి, పెద అంబడిపూడి గ్రామాలలో కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విజయాన్ని కాంక్షిస్తూ బాబీ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేసి, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. గ్రామాల నుంచి రాష్ట్రం వరకూ ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించకుండా మోసగించారన్నారు. సుభిక్ష, ప్రశాంతమైన పాలన కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని, కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అసెంబ్లీకి పంపాలని ప్రజలకు బాబీ విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ తిరిగిన బాబీ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం టీడీపీ కార్యకర్త గంగవరపు రమేష్ భార్య శ్రీదేవి అనారోగ్యంతో ఉండగా ఇంటికి వెళ్లి కమల్‌కిషోర్ వారిని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు దద్దాల అంజయ్య, మండలపు సుధాకర్, బొట్టగుంట కోటేశ్వరరావు, వేణుబాబు, సర్పంచ్ మైలా కుసుమకుమారి పాల్గొన్నారు.

కూలి పనికి రానివారికి మస్టర్లు

- వైసీపీ సానుభూతి పరులకు హాజరు వేస్తూ నిధులు స్వాహా
- విచారించి కట్టడి చేయాలని కూలీల విజ్ఞప్తి


బల్లికురవ, ఏప్రిల్ 16 : మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీలో ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వైసీపీ సానుభూతి పరులు గ్రామంలో లేకపోయినప్పటికీ వారు కూలి పనులకు వచ్చినట్లు మస్టర్లు వేసి హాజరు చూపుతున్నట్లు తెలిసింది. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున హాజరు చూపుతూ సొమ్ము కాజేస్తున్న తంతు పలు గ్రామాలలో జరుగుతున్నది. అధికారుల నామమాత్రపు తనిఖీల కారణంగానే ఉపాధిలో అవినీతి సాగుతోందని పలువురు అంటున్నారు. గ్రామాలలో అధికార పార్టీ నేతలు చెప్పిన విధంగా కొందరికి మస్టర్లు వేస్తూ పెద్ద ఎత్తున నిధులను స్వాహా చేస్తున్నట్లు తెలుస్తుంది. వెంటనే లోతైన విచారణ జరిపి దొంగ మస్టర్లకు చెక్ పెట్టాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

ఉప్పుటూరు(పర్చూరు), ఏప్రిల్ 16 : పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ కోనేటి అంజనేయస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు కాల్వ సత్యనారాయణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్వామివార్ల కల్యాణ వేడుకలకు తిరుముల, శ్రీశైలం బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత శ్రీ బృందావనం వెంకట రమణాచార్యులు సారథ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 17 ఏప్రిల్ 2024


శబరి శ్రీరామక్షేత్రంలో వధూవరులుగా సీతారాములు



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	39.7	37.0	41.0	41.0	37.0
కనిష్ఠం	26.5	28.0	27.0	26.0	27.0

రాములోరి పెళ్లికి రారండి!

- నేడు శ్రీరామ నవమి
- వైష్ణవాలయాలు, బాబా మందిరాల్లో వేడుకలు
- శబరి శ్రీరామ క్షేత్రంలో కల్యాణోత్సవం


నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 16 : దేశమంతటా.. ముఖ్యంగా ప్రతి పల్లెలో జరుపుకునే వేడుక శ్రీరామ నవమి. ధర్మానికి ప్రతీక శ్రీరామచంద్రుడు. ఆయన జన్మదినమే శ్రీరామనవమి. బుధవారం జిల్లా అంతటా ఆ పండుగ జరుపుకోవడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రముఖ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు మొదలవుతున్నాయి. అన్ని వైష్ణవాలయాలు, హనుమాన్ మందిరాలు, సాయిబాబా మందిరాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. సముద్ర తీరప్రాంతపు పట్టపుపాళేల్లో ఈ ఏడాది నవమి వేడుకలు భారీగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పైగా ఇది ఎన్నికల ఏడాది, గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుండటంతో శ్రీరామనవమి వేడుకలకు వివిధ పార్టీలు సహకారం అందిస్తున్నా యి.

శబరి శ్రీరామక్షేత్రంలో కల్యాణోత్సవం

జిల్లాకే తలమానికంగా నెల్లూరులోని శబరి శ్రీరామ క్షేత్రంలో నవమి వేడుకలు జరుగుతున్నాయి. సీతారాముల కల్యాణం కోసం భారీ వేదిక ఏర్పాటు చేశారు. సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలను తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు అకెళ్ల విభీషణశర్మ, లలిత దంపతులు అందజేస్తారు. ముత్యాల తలంబ్రాలను 1వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జీ కపర్ది, గాయత్రి దంపతులు సమర్పిస్తున్నారు. నవమి వేడుకల్లో భాగంగా శబరి శ్రీరామ క్షేత్రంలో పసుపు దంచడం, సీతామహాలక్ష్మిని పెండ్లి కుమార్తెను చేయడం, తలంబ్రాలు కలపడం తదితర కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్టీసీ..
చార్జీలతో దోచేసి!

- ఐదేళ్లలో రెండుసార్లు వడ్డన
- కిలోమీటరు, స్టేజీ, సర్‌చార్జీల పేరుతో బాదుడు
- జిల్లావాసులపై రూ.216 కోట్ల భారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 16 : ఆర్టీసీ బస్సు ఎక్కాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులను వైసీపీ పాలకులు తీసుకొచ్చారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రెండు విడతలుగా ఆర్టీసీ చార్జీలు పెంచగా, బస్సు ఎక్కాలం టేనే భయపడే స్థాయికి ప్రయాణికులు చేరిపోయారు. 2019-22 మధ్య కాలంలో కిలోమీటర్ల వారీగా పల్లె వెలుగు నుంచి అమరావతి సర్వీసుల వరకు చార్జీలు పెంచగా, 2022-24 కాలంలో స్టేజీలు, సర్‌చార్జీల రూపంలో మరింత ఎక్కువగా ప్రజల నుంచి చార్జీలు గుంజుకున్నారు. పెద్దగా పెంచినట్లు కనిపించకుండానే వైసీపీ ప్రభుత్వం జిల్లా ప్రజల నుంచి గడిచిన ఐదేళ్లలో సుమారుగా 216 కోట్ల రూపాయలు పిండుకుంది.

2019 నుంచే బాదుడు..

వైసీపీ అధికారంలోకి రాగానే 2019 సంవత్సరంలో డిసెంబరు 10వ తేదీన ఆర్టీసీ చార్జీలను పెంచింది. పల్లె వెలుగు సర్వీసు నుంచి అమరావతి సర్వీసు వరకు కిలోమీటరు చొప్పున చార్జీలను పెంచారు. డీజిల్ ధర పెరడంతో సెస్ మాత్రమే పెంచామని దీంతోనే ఆర్టీసీ చార్జీలు పెరిగాయంటూ కేంద్రంపై నిందపోపుతూ 2022 ఏప్రిల్ 14వ తేదీ రాత్రి రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఆర్టీసీ చార్జీలను పెంచింది. అయితే పెరిగిన చార్జీలను ప్రయాణికులు గమనిస్తే సెస్‌తోపాటు టోల్‌ప్లాజా ధరలు, కిలోమీటరు వారీగా ప్రభుత్వం బాదేసింది. సెస్ ధరలు పెంచితే ఆర్డనరీ బస్సులపై రూ.2 నుంచి ఏసీ బస్సులపై పది రూపాయల వరకు మాత్రమే ప్రయాణికులపై భారం పడాల్సి ఉంటుంది. అయితే పెంచిన చార్జీలను గమనించిన ప్రయాణికులు ఇదేం దోపిడీ అని ఆశ్చర్య పోయారు. ఇక స్టేజీల వారీగా రూ.5 నుంచి 10 వరకు టికెట్టుపై పెంచి ప్రయాణికుల నడ్డివిరిచారు.

రూ.216 కోట్లు పిండేశారు!

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పడంతో ప్రజలంతా కొత్త బస్సులు వస్తాయి.. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తారు.. చార్జీల భారం తగ్గిస్తారని భావించారు. అయితే, వైసీపీ పాలకులు మాత్రం గడిచిన ఐదేళ్లలో రెండు సార్లు చార్జీలు పెంచి జిల్లాప్రజలపై రూ.216 కోట్ల భారం మోపారు. వైసీపీ అధికారం చేపట్టేనాటికి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నెల్లూరు రీజియన్‌లో 10 డిపోలు ఉండేవి. రోజుకు రీజియన్ రాబడి సుమారు రూ.60 లక్షలు ఉండేది. అయితే 2019, డిసెంబరులో ఆర్టీసీ చార్జీలు పెంచిన తర్వాత రీజియన్ రాబడి రోజుకు రూ.75 లక్షలు అయ్యింది. అంటే రోజుకు జిల్లా ప్రజలపై రూ.10 లక్షలు, నెలకు రూ.3 కోట్లు, రెండేళ్లకు రూ.72 కోట్ల అదనపు భారం పడింది. 2022, ఏప్రిల్‌లో మరోమారు ఆర్టీసీ చార్జీలు పెరిగాయి. అప్పటివరకు రోజుకు సుమారు రూ.75 లక్షలు ఉన్న ఆర్టీసీ జిల్లా రాబడి సుమారు రూ.95 లక్షల నుండి 1.05 కోట్లకు వెళ్లింది. అంటే రోజుకు రూ. 20 లక్షల వరకు అదనపు భారం ప్రజలపై పడింది. ఈ క్రమంలో అంటే నెలకు రూ.6 కోట్లు, రెండు రెండేళ్లకు రూ.144 కోట్ల భారం ప్రజలపై పడింది. ఐదేళ్లలో ఆర్టీసీ చార్జీల పెంపుతో జిల్లా ప్రజలపై రూ.216 కోట్ల భారం మోపింది.

11 కొత్త బస్సులతో సరి..

వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో కాలం చెల్లిన బస్సుల వివరాలను ఆర్టీసీ అధికారులు పంపారు. జిల్లాకు 50 కొత్త బస్సులను కేటాయించాలని ఆ నివేదికలో కోరారు. అయితే ఇప్పటివరకు 11 బస్సులు మాత్రమే పంపారు. జిల్లాలో 600లకుపైగా ఆర్టీసీ బస్సులు ఉండగా వాటిలో సంగానికిపైగా కాలం చెల్లినవేనని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు. వీటి స్థానంలో కొత్తవి కేటాయించక పోవడంతో ఉన్న బస్సులనే మరమతులు చేయించి నడుపుతున్నారు. ఓ పక్క కాలం చెల్లిన బస్సులు మరో పక్క అధ్వానపు రోడ్లతో ఎక్కడ పడితే అక్కడ బస్సులు నిలిచిపోతూ ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. ఇక బస్టాండ్లలో వసతుల కల్పనపై ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

సోమశిలలో 8.523 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 16: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి ప్రాజెక్టులో 8.560 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 128, ఉత్తర కాలువకు, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కులు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు.

వినియోగానికి తగినట్లు పరికరాలుండాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు, (జడ్పీ), ఏప్రిల్ 16: వేసవిలో ఎండలు మండుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతుందని, ఇందుకు అణుగుణంగా నాణ్యమైన వైర్లు, పరికరాలను గృహాల్లో ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజ యన్ వినియోగదారులకు సూచించారు. విద్యుత్ భవన్ లోని ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలని అధి కారులను ఆదేశించారు. లోడ్‌కి తగ్గట్టుగా గేజ్ వైర్లు, ఎర్త్ వైర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తడి చేతులతో స్విచ్‌లను తాకకూడదన్నారు. జిల్లాలోనే ఏఎస్‌పేట, అనంతసాగరం, ఆత్మకూరు రూరల్, వింజమూరు, కావలి, దుత్తలూరు, ఇం దుకూరుపేట, సీతారామపురం, కొరుటూరు సెక్షన్లలో జేఐ ఎస్ సర్వే పూర్తి కాలేదని, ఆ సెక్షన్లలో వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

సివిల్స్‌లో వినీష విజయం

- నెల్లూరు యువతికి 821వ ర్యాంక్


వినీష

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 16 : యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ తుది ఫలితాల్లో జిల్లాకు చెందిన బడభాగ్ని వినీష సత్తా చాటారు. నెల్లూరు నారాయణలో పదో తరగతి వరకు చదువుకున్న ఆమె హైదరాబాద్ నారాయణలో ఇంటర్ పూర్తి చేసి ఉమ్మడి రాష్ట్రంలో ఏడవ ర్యాంకు సాధించారు. అనంతరం చెన్నై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేసి అమెరికాలో ఎంఎస్ పూర్తి చేశారు. గతేడాది గ్రూప్-1కు ఎంపికై ప్రస్తుతం విజయవాడలోని సీఆర్‌డీఏలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎవరి వద్ద శిక్షణ తీసుకోకుండానే తాజాగా సివిల్స్‌నులోనూ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఉదయగిరి మండలం, గంగులవారి చెరువుపల్లి తమ సొంత గ్రామమని, తండ్రి శ్రీనివాసరాజు వ్యవసాయాధికారిగా, తల్లి విజయభారతి వ్యవ సాయ కమిషన్ కార్యాలయంలో జేడీగా పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగరీత్యా ఎక్కువకాలం నెల్లూరులో పని చేయడంతో తాము నగరంలోనే స్థిరపడ్డామని చెప్పారు. సమాజానికి సేవ చేయాలన్న కోరికతోనే కఠిన సవాళ్లను ఎదుర్కొని సొంత ప్రిపరేషన్‌తో 821వ ర్యాంకు సాధించానని తెలిపారు.

రేపటి నుంచి కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామ స్వామి ఆలయంలో గురువారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో దుర్గయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాలు ఈనెల 27వతేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 24న ఉదయం కల్యాణం, 25న రథోత్సవం జరుగుతాయని తెలిపారు.

రేపటి నుంచే కౌంట్‌డౌన్!

- మరో కొద్ది గంటల్లో ఎన్నికల నోటిఫికేషన్
- ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- మహా సంగ్రామంలో కీలకఘట్టం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం


ట్రయల్ రన్ నిర్వహించి నామినేషన్ స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామానికి సమయం ఆసన్నమైంది. మరో 24 గంటల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుంది. గురువారం ఉదయం ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రకటిస్తారు. అదేరోజు 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలవు తుంది. ఈ నెల 25వతేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. సెలవు రోజు మినహా మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయ వచ్చు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. బుధవారం శ్రీరామనవమి కావడంతో మంగళ వారమే నామినేషన్ల ట్రయిల్ రన్‌ను కలెక్టర్ పూర్తి చేశారు. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. నామినేషన్ పత్రాలు కూడా వారం రోజుల కిందటే జిల్లాకు చేరుకోగా వాటన్నిటినీ అన్ని రాజకీయ పార్టీలు, పోటీకి ఆసక్తి కలిగిన స్వతంత్ర అభ్యర్థులకు అందజేశారు. చాలా మంది రెండేసి సెట్లు చొప్పున నామినేషన్ పత్రాలను తీసు కెళ్లారు. ఇప్పటికే చాలా వరకు ఆ నామినేషన్ పత్రాలను అభ్యర్థులు పూర్తి చేశారు. ఈ నెల 18, 19వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండడంతో ఆ రెండు రోజుల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భారీ కేడ్లు, చెక్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థితోపాటు ఐదు గురికి మించి నామినేషన్ వేసేందుకు వీలు లేదు కాబట్టి అభ్యర్థి వెంట వచ్చే వారిని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే నిలిపేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక ఇప్పటివరకూ ఎన్నికల ప్రచారాల ఖర్చులను పార్టీల లెక్కల్లోకి వేస్తున్న ఎన్నికల సిబ్బంది నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి అభ్యర్థుల ఖాతాల్లో వేయనున్నారు. అందుకోసం ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. నోటిఫికేషన్ సమయం దగ్గరకు రావడంతో జిల్లాలో రాజకీయ వేడి పెరిగింది. ఏ ఇద్దరు కలిసినా రాజకీయాల గురించే చర్చించుకుంటుండడం విశేషం.

ఆర్వోల వివరాలు..

నియోజకవర్గం	నామినేషన్ల కేంద్రం	రిటర్నింగ్ అధికారి	ఫోన్ నెం.
నెల్లూరు పార్లమెంటు	నెల్లూరు కలెక్టరేట్	ఎం హరినారాయణన్	9849904051
కందుకూరు	కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం	జీ విద్యాధరి	8712622671
కావలి	కావలి ఆర్డీవో కార్యాలయం	వీకే శీనానాయక్	9849904054
ఆత్మకూరు	ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం	కే మధులత	9963474101
కోవూరు	కోవూరు తహసీల్దార్ కార్యాలయం	సేదు మాధవన్	9849904052
నెల్లూరు సిటీ	మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం	వికాస్ మర్మత్	9849906609
నెల్లూరు రూరల్	నెల్లూరు ఆర్డీవో కార్యాలయం	ఏ మలోల	9849904055
సర్వేపల్లి	వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయం	బీ చిన్న ఓబులేసు	9492406788
ఉదయగిరి	ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం	ఎం రాజారమేష్ ప్రేమ్‌కుమార్	9704073919

నామినేషన్ల ట్రయల్ రన్

నెల్లూరు (హరనాథపురం) : కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం నామినేషన్ల స్వీకరణ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్ తన సిబ్బంది ద్వారా నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ వేసిన వ్యక్తికి సంబంధించిన ఓటర్ల జాబితా పరిశీలన, ప్రతిజ్ఞ, ఫీజు చెల్లింపు పత్రాలు ఇలా అన్ని వివరాలను పూర్తి చేయడం తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో బాపిరెడ్డి, ఎఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యో్యా కష్టజీవులే.. కడతేరిపోయారు !

- చామదలలో ఎవరినోటవిన్నా ఇదేమాట
- గ్రామంలో విషాదఛాయలు

జలదంకి, ఏప్రిల్16: 'అయ్యో.. ఆ కుటుంబంలోని వారంతా కష్టజీవులే.. రెక్కాడితేకాని డొక్కాడని బతుకులు వారివి. ఊరొదిలి వెళ్లి నాలుగు రాళ్లు సంపాదించుకున్నారు. ఇంతలోనే ఎంత విషాదం. వారిని ఆ భగవంతుడు చిన్నచూపు చూశాడు. రామకార్యం కోసం వారు వస్తే విధి వారిని ఎంత కర్కశంగా బలిగొంది. అయ్యో.. దేవుడా.. పగవారికి కూడా ఈ దారుణం జరగకూడదు.. భగవంతుడా...ఏమిటీ ఘోరం' అంటూ చామదలలో మంగళవారం సాయంత్రం ఎవరినోట విన్నా ఈ మాటలే. గౌరవరం రోడ్డు ప్రమాద ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన మృతుడు దావులూరి శ్రీనివాసుల కుటుంబ సభ్యు లు చిన్ననాటి నుంచి బెంగుళూరు, హైదరాబాద్‌లలో బేల్దారి పనులకు వెళ్లేవారు. శ్రీనివాసులు తన అన్న శ్రీరాములుతో కలసి వెళ్లి పనిచేసేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల నుంచి శ్రీరాములు చామదలలో ఇంటివద్దే ఉండేవాడు. శ్రీనివాసులు హైదరాబాద్ ఇబ్రహీంపట్నం ప్రాంతంలో బేల్దారి మేస్త్రీగా బిల్డింగ్‌లు కాంట్రాక్టుకు తీసుకుని పని చేయించేవాడు. ఈ క్రమంలో తన కుటుంబాన్ని కూడా హైదరాబాద్‌కు మార్చాడు. భార్యతోపాటు అల్లుడు గంటా సునీల్, కూతురు నీలిమలను కూడా తన వద్దే ఉంచుకుని పనులు చేయించేవాడు. రెండేళ్ళక్రితం కారు కొన్నాడు. ప్రతి ఏటా ఏకాదశికి, శ్రీరామనవమికి స్వగ్రామం వచ్చేవాడు. కుటుంబ సభ్యులతో పండుగ జరుపుకుని తిరిగి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం గ్రామానికి వారంతా చేరుకున్నారు. పండుగ సామాను కోసం కావలి వెళ్తుండగా ఈ ఘోర దుర్ఘటన జరిగింది. తల్లిదండ్రులు లేని అనాథలుగా శ్రీనివాసులు ఇద్దరు కూతుళ్లు మిగిలారు. వీరిలో ఓ కుమార్తెకు ఇంకా పెళ్లి కాలేదు. భార్య, కుమారుడి మృతితో అల్లుడు గంటా సునీల్ ఒంటరయ్యాడు. ఈ సంగతి తలుచుకుని మృతుడు శ్రీనివాసులు ఇద్దరు కూతుళ్ల, అల్లుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


గంటా నీలిమ (ఫైల్)


దావులూరి లక్ష్మమ్మ (ఆశావర్కర్) (ఫైల్)


చిన్నారి గంటా కౌశిక్ నందన్ (ఫైల్)

స్వామి కార్యానికి వచ్చి..

- ఒకే కుటుంబంలో ఐదుగురిని బలిగొన్న రోడ్డు ప్రమాదం
- మృతులంతా చామదల వాసులు
- మృత్యుశకటంలా ఆగి ఉన్న లారీ


ప్రమాదంలో మృతి చెందిన దావులూరి శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతులు (ఫైల్)

కావలి/కావలి రూరల్, ఏప్రిల్ 16: దేవుడు కార్యాన్ని నెరవేర్చేందుకు వచ్చిన ఆ కుటుంబం తిరిగిరాని లోకాలకు వెళ్లింది. కావలి రూరల్ మండలం గౌరవరం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలదంకి మండలం చామదలకి చెందిన ఓ కుటుంబంలోని ఐదుగురు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం మేరకు, చామదలకు చెందిన దావులూరి శ్రీను హైదరాబాద్‌లో బిల్డర్‌గా స్థిరపడ్డాడు. గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కుటుంబ సభ్యులతో కలసి కారులో హైదరాబాద్ నుంచి మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకున్నాడు. ఉత్సవాలకు అవసరమైన సామగ్రిని తీసుకు వచ్చేందుకు అదే కారులో కావలికి బయలు దేరారు. కారులో దావులూరి శ్రీను(50), ఆయన భార్య వరమ్మ(45), కుమార్తె గంటా నీలిమ(24), మనవడు గంటా గౌసిక్ నంద్(3), వదిన దావులూరి లక్ష్మమ్మ(52)లు ఉన్నారు. వారు వస్తున్న కారు గౌరవరం వద్ద ఆగిఉన్న లారీని ఢీకొంది. దీంతో వారంతా అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే టోల్ ప్లాజా మేనేజర్ గణేష్, హైవే సిబ్బంది కావలి డీఎస్పీ ఎం. వెంకటరమణ, సీఐ కాటూరి శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ కిందకు దూసుకుపోయిన కారులో ఎంత మంది చిక్కుకుని ఉన్నారో ..? వారిలో ఎంత మంది చనిపోయారో తెలియలేదు. అందుబాటులో ఉన్న ఎక్స్‌కవేటరను తెప్పించి కారును బయటకు తీశారు. అందులో ఉన్న వారంతా విగతజీవు లుగా కనిపించారు. వారు ఎవరో... ఎక్కడ నుంచి వస్తున్నారో తెలుసుకునేందుకు మృతుల వద్ద ఉన్న సెల్‌ఫోన్ల ద్వారా వారి బంధువులకు సమాచారం అందజేశారు. దీంతో బంధువులంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ నుంచి కావలి ఏరియా వైద్యశాలకు వచ్చారు. ఇంటి నుంచి అప్పుడే వచ్చి, అంతలోనే వారు మృతి చెందడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోయారు. కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతి చెందిన వారిలో దావులూరి లక్ష్మమ్మ ఆశావర్కర్‌గా పనిచేస్తుండగా, గంటా నీలిమ వలంటీర్‌గా పనిచేస్తున్నారు. కారులోని మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు డీఎస్పీ ఎం. వెంకటరమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కావలి ఏరియా వైద్యశాల వద్ద విలపిస్తున్న మృతుల బంధువులు

ఉదయగిరి రూపురేఖలు మారుస్తా!

- టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్
- కొండాపురం మండలంలో వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలు
- అల్లిక మధు ఆధ్వర్యంలో 200 మందికి టీడీపీ తీర్థం



గణేశ్వరపురంలో కాకర్లను పూలమాలతో సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు



కొండాపురం: వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాకర్ల

వరికుంటపాడు, ఏప్రిల్ 16: మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకే తాను తొలి అడుగు వేస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. మంగళవారం గణేశ్వరపురంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి వసతి కల్పించడంతో పాటు అర్హులందరికీ పక్కాగృహాలు, భూములు అందేలా కృషి చేస్తానన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారానే ప్రజలు దాహం తీర్చుకుంటున్నారని గుర్తుచేశారు. వైసీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎలాంటి అభివృద్ధి సాధించిన దాఖలాలు లేవని దుయ్య బట్టారు. అందుకు భిన్నంగా పార్టీ అధినేత నారా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికి అండగా ఉంటాయన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ఉద్యోగ అవ కాశాలు కల్పించేలా తాను ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఏర్పాటు యువతను ఉపాధి భరోసా కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం లో ఒకే కుటుంబాన్ని ఏళ్ల తరబడి ఆదరించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప ప్రస్తుత ప్రభుత్వం కనీసం రహదారులు కూడా నిర్మించిన పాపాన పోలేద న్నా రు. అందరికీ అందుబాటులో ఉండే తాను కరెక్టో, లేక వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కరెక్టో ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని అభ్యర్థిం చారు. మధ్యవర్తులతో సంబంధం లేకుండా సమ స్యలపై ప్రజలు నేరుగా తనను కలవాలని సూచించారు. కష్టమున్న ప్రతిచోటా తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతం అభివృద్ధి ఎందుకు సాధ్యం కాదో తాను చూస్తానని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నారసింహపురం, తూర్పు రొంపిదొడ్ల, దక్కనూరు, తూర్పు కొండారెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, వేంపాడు గ్రామాల్లోనూ ప్రచారం నిర్వహించి ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న కాకర్ల

టీడీపీలో చేరిక: తూర్పురొంపిదొడ్లలో సర్పంచ్ కూండ్ల నాగేశ్వరి, మల్లంపాటి వెంగయ్యల ఆధ్వర్యంలో వైసీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కాకి అంకయ్యతో సహా పలురురి కుటుంబాలు టీడీ పీలో చేరారు. వారికి కాకర్ల పార్టీ కండు వాలతో వేసి ఆహ్వానించి అభినం దనలు తెలిపారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండలాధ్యక్షుడు చంద్ర మధుసూదనరావు, జెడ్పీ టీసీ రావిళ్ల నాగేంద్ర, పేరం సుధాకర్‌రెడ్డి, కాకి ప్రసాద్, పావులూరి రవీంద్రబాబు, చంద్ర ఉమామ హేశ్వరరావు, ముజ్జె లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కొండాపురం: గరిమెనపెంట, వెంకటరంగాపురం, చల్లావారిపల్లి గ్రామాల నుండి స్థానిక టీడీపీ నాయకుడు అల్లిక మధు ఆధ్వర్యంలో మంగళవారం 200మందికిపైగా వైసీపీ కార్యకర్తలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వెంకటరంగాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాకర్ల మాట్లాడారు. వైసీపీ పాలన ఐదేళ్ల రాష్ట్రంలో పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక మెట్ట ప్రాంతాల ప్రజలు బతుకుదెరువు కోసం వలస ప్రాంతాలకు తరలివెళ్లడం బాధాకరం అని వాపోయారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తేనే స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి వలసలను నివారిస్తామని కాకర్ల హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట్రకార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మామిళ్ళపల్లి ఒంకారం, ముస్లిం నాయకుడు షేక్ నాయబ్ రసూల్, టీడీపీ నాయకులు యారవ కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, చెరుకూరు వెంకటాద్రి, దా మా మహేశ్వరరావు, బొట్లగుంట హరిబాబు, పోలినేని రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే టీడీపీకి ఓటేయండి !



గుంపర్లపాడులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణ రెడ్డి

ఏఎస్ పేట, ఏప్రిల్ 16: మం డలంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే ప్రతి ఓటరు టీడీపీకి ఓటెయ్యాలని ఆత్మకూరు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయ ణరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన గుంపర్లపాడు, వేల్పులగుంట, అక్బారాబాదు, హసనపురం గ్రామాల్లో పర్యటించి ఓటర్లతో మా ట్లాడారు. తాను అధికారంలో ఉన్న 5ఏళ్లలో మండలంలో ఉత్తర కాలువ నిర్మాణం, ఐటీఐ కాలేజి, ఆదర్శ పాఠశాల ఏర్పాటు ఇలా అభివృద్ధి పనులెన్నో చేశానని గుర్తు చేశారు. మరోమారు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసుకునే అవకాశం వస్తుందన్నారు. 10ఏళ్లలో వైసీపీ పాలకులు ఏం చేశారో మీరే చూశారని.. తేడాను గమనించి ఓటు వేయాలని సూచిం చారు. వలంటీర్లు రాజీనామా చేయవద్దని టీడీపీ అధికారంలోకి వస్తే రూ.10వేలు జీతం ఇస్తా మన్నారు. సూపర్ సిక్స్ పథకాలు కావాలంటే ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని తెలిపారు. అక్రమ మద్యం తయారీదారుడు..క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులు ఒకవైపు, అభివృద్ధి చేసే మంచితనం ఉన్న వ్యక్తులు మరోవైపు ఉన్నారని ఈ విషయాన్ని గుర్తిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహరెడ్డి, ఖాజామియ్య, మాల్యాద్రినా యుడు, షేక్ ఖదర్‌బాషా, అల్లంపాటి కృష్ణరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జీ.చెర్లోపల్లిలో మంగళవారం జనసేన నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే సమాజసేవకులైన వేమిరెడ్డి, కాకర్లను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కల్లూరి సురేందర్‌రెడ్డి, అలూరి రవీం ద్ర, కుర్రా కృష్ణయాదవ్, పెట్లు కిరణ్‌కుమార్, అఖిల్, హరినాథ్, పవన్ పాల్గొన్నారు.

చేజర్ల: పులనీళ్ళపల్లి, చలపనాయుడుపల్లి గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పడాలని పిలుపునిచ్చారు.



బసినేనిపల్లిలో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సీతారామపురం: తెలుగుదేశం మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, మండల కో ఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం బసినేనిపల్లిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ యువత, నాయకులు ఇంటింటికీ వెళ్లి పార్టీ సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశా రు. పథకాల ఉపయోగాలను ప్రజల కు వివరించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం సీఎంగా చంద్రబాబు నాయుడుని గెలిపించుకోవాలన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో మాజీ జెడ్పీటీసీ కలవెల జ్యోతి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బోగినేని కాశిరావు, జనసేన మండల కన్వీనర్ పాలిశెట్టి శ్రీనివాసులు, సురేష్, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, వెంకటేశ్వర్లు, ఇజ్రాయిల్, చెన్నకేశవులు, తూరక వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు కొడవటికంటి కిరణ్ పాల్గొన్నారు.

నామినేషన్ల ఘట్టానికి పటిష్ట బందోబస్తు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: ఈ నెల 18నుంచి జరగనున్న నామినేషన్ల పర్వానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 18 నుంచి 25వరకు జరిగే నామినేషన్ల ప్రక్రియకు ఇద్దరు డీఎస్పీలు, సీఐలు, ఆరు మంది ఎస్ఐలు, 50 మంది పోలీసు సిబ్బంది నియమించామన్నారు. నామినేషన్ కేంద్రానికి వందమీటర్ల దూరంలో బ్యారికేడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. ప్రధాన అభ్యర్థుల నామినేషన్ల రోజు వాహనాలను జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థుల ర్యాలీ వాహనాలను ఏబీఎం కాంపౌండ్ వద్దనే నిలుతామన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: వేసవిలో అగ్నిప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు ముందస్తు చర్యలు చేపడితే నివారించవచ్చని అగ్నిమాపకదళ అధికారి టి.రమేష్‌బాబు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మం గళవారం మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో భవన సముదాయంలో అగ్నిమాపక ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలు, విద్యార్థులు, కార్మికుల్లో చైతన్యం తేవడం కోసం వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపకదళ సిబ్బంది కె.శ్రీనివాసరావు, ఏ.సుధాకర్‌రావు, షేక్ రబ్బానీబాష, టి.రమేష్ పాల్గొన్నారు.

మ్యాపింగ్ తప్పనిసరి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: మండలంలో చదువు పూర్తి చేసి పాఠశాలలు విడిచివెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా స్కూల్ మ్యాపింగ్ చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన కుర్రపల్లి, నేలటూరు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏ పాఠశాలల్లో చదివారో ఆ వివరాలను చైల్డ్‌ఇన్‌ఫో సైట్‌లో పొందుపరచాలన్నారు. ఈ నెల 23లోపు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతికార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాషిణి, షేక్ షఫీ అహ్మద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉదయగిరి, ఏప్రిల్ 16: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రజియా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం సీడీపీవో పచ్చవ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ఫరుద్దీన్‌బాషా పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజీనామాలు

కలువాయి, ఏప్రిల్ 16: అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇదివరకే 46మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. తాజాగా మంగళవారం మరో 7గురు తమ రాజీనామాలను అధికారులకు అందజేశారు. దీంతో మండలంలో ఇప్పటివరకు 53మంది రాజీనామాలు చేసినట్లు అయ్యింది.

ఏపీ సీఆర్‌పీఎఫ్ మండలాధ్యక్షుడిగా రమణయ్య

సీతారామపురం, ఏప్రిల్ 16: పండ్రంగి గ్రామానికి చెందిన సింగాల రమణయ్యను ఏపీ సీఆర్‌పీఎఫ్ మండలాధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం అధ్యక్షుడు కుదారి తిరిపాలు నియమించినట్లు పేర్కొన్నారు.

ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఉదయగిరి, ఏప్రిల్ 16: స్థానిక చిన్నమసీదు ఆవరణలో రహమతుల్ అలమీన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచిత ఒడుగుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు 9490427421, 7013858306 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: బండగానిపల్లి పంచాయతీలోని బిజ్జంపల్లి బీసీ కాలనీకి చెందిన ఓబులాపురం వెంకటరత్నం అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి మృతదే హాన్ని సందర్శించి నివాళలర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ట్రస్టు ద్వారా అంత్యక్రియలకు రూ.15 వేలు అందజేశారు.

ఎన్నికలపై బీఎల్‌వోలకు అవగాహన

సీతారామపురం, ఏప్రిల్ 16: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు ఎన్నికల విధానంపై ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ అవగాహన కల్పించారు. మండలంలోని ప్రతిఒక్క బీఎల్‌వో వారి పరిధిలోని ఓటర్ల గడపగడపకు వెళ్లి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకునే విధానాన్ని తెలియజేయాలన్నారు. అంతేకాకుండా వారి కుటుంబంలో 50శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వికలాంగులు, మంచానికి పరిమితమైన వృద్ధులు ఉంటే ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ మస్తాన్‌వలి, తహసీల్దార్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం

ఉదయగిరి, ఏప్రిల్ 16: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని నెల్లూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు అన్నారు. మంగళవారం ఆయన ఉదయగిరిలో ఎమ్మెల్యే అభ్యర్థి సోము అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలతో కలిసి బహిరంగసభ ఏర్పాటు చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఐదు గ్యారంటీలను వివరించారు. కార్యక్రమంలో సుందర్‌రెడ్డి, ఎంపీటీసీ విజయమ్మ, సత్తెనపల్లి బాలయ్య పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 16: త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం సీఐ వేల్పుల గిరిబాబు ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, ఎస్ఐ అనూష, కమిటీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, నరసింహులు, మధు, కొండలరావు, రమ్య పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

టీడీపీ, బీజేపీ పొత్తుపై అపోహలొద్దు

- పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో ఇంటూరి నాగేశ్వరరావు



పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 16: తెలుగుదేశం పార్టీ బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో చేరడంపై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పాస్టర్లు ప్రార్థిస్తే టీడీపీ అండగా నిలుస్తుందని ఆపార్టీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఓ ఫంక్షన్‌హాలులో మంగళవారం నియోజకవర్గంలోని పాస్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలు విజయం సాధించాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ ఆలూరి కాలేబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి), పాస్టర్లు సీహెచ్ బాలసుందరం, శ్యామ్‌డానియేల్, ఆంతోనిబాబు, గడ్డం జాన్, పేముల జనార్ధనరావు, ఇమ్మానియేల్, మహేష్, చిరంజీవి, అబ్రహం, సైమన్‌బాబు, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, రెబ్బవరపు మాల్యాద్రి, చదలవాడ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని జి.మేకపాడుకు చెందిన కాలే యలమంద, నాగభూషణం, శ్రీను, విజయ్, సుబ్బారావు, శంకర్, గూడపాటి బ్రహ్మయ్య సహా పలు వైసీపీ కుటుంబాల వారు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరారు. అలాగే లింగసముద్రం మండలం చీమలపెంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ముప్పాళ్ల శ్రీనివాసరావు, కరణం వంశీ తదితరులు పసుపు కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య పాల్గొన్నారు.

ఉలవపాడు : తన సామాజిక వర్గంపైనే అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనుడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ అని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో పలువురు సీనియర్ వైసీపీ నేతలు పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ లో చేరిన మాజీ వైస్ ఎంపీపీ గొత్తుల బ్రహ్మయ్య, మాజీ సర్పంచు దార్ల కోటేశ్వరరావు, ఎండోమెంట్ మాజీ ఈవో రామ్‌కుమార్, వాకా కృష్ణారెడ్డి, కోటు బాలయ్య, అక్కల వెంకటరామిరెడ్డి, పీ.కొండపనాయుడు, కరేడు పంచాయతీ లోని మత్స్యకారులకు ఇంటూరి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో మంగళవారం రాత్రి ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. గ్రామానికి చెందిన వైసీపీ నేత రామిశెట్టి మాలకొండయ్య ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోటీ : పసుపులేటి



మాట్లాడుతున్న పసుపులేటి సుధాకర్

కావలిటౌన్, ఏప్రిల్ 16: రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రజల పక్షాన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నానని పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పీఎస్సార్ ట్రస్ట్ కార్యాలయంలో పట్టణం, రూరల్ మండలం నుంచి అనేక మంది యువత పీఎస్సార్ కండువాలు కప్పుకుని పసుపులేటికి మద్దతు తెలిపారు. పసుపులేటి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మీ వెంటే మేముంటామని మద్దతు తెలుపుతున్నారని, ప్రజల నుంచి ఊహించని విధంగా వస్తున్న స్పందన చూస్తుంటే భారీ మెజారిటీతో తప్పక గెలుస్తానన్నారు. తన ట్రస్ట్ ద్వారా చేసిన సేవలు ప్రజలు హృదయాల్లో పదిలపరుచుకున్నారని, నేటి స్పందన చూస్తుంటే చేసిన సేవ వృథాపోదన్న పెద్దల మాట నిజమని నిరూపితమౌతుందన్నారు. తాను సొంత నిధులతో కావలిని అభివృద్ధి చేస్తానన్న మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో రెండు ప్రధాన పార్టీల మధ్య ఇండిపెండెంట్‌గా పోటీ చేయనుండడం ప్రజల నుంచి అపూరూప స్పందన లభిందన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు



నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీద రవిచంద్ర, కావ్య, మాలేపాటి

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 16: దగదర్తి మండలంలోని పలు పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ నేత లు, కార్యకర్తలు మంగళవారం టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఉలవపాళ్ల పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీ య ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టీడీపీ కావలి అభ్యర్థి దగుమాటి(కావ్య) వెంకటక్రిష్ణారెడ్డి, సీనియర్ నేత మాలేపాటి రవీంద్రనాయుడు పాల్గొన్నారు. చిన్నసంఘం, వడ్డిపాలెం ప్రాంతాలకు చెందిన 20 కుటుంబాల వైసీపీ నేతలు, కార్యకర్తలు సాల్మన్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి బీద, కావ్యలు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతపురం, దామవరం, కేకేగుంట పంచాయతీలలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం బీద విలేకర్లతో మాట్లాడుతు టీడీపీ పాలనలో దగదర్తిలో ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తే, వైసీపీ పాలనలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అయన అనుచరులు ఆ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు గోతులు చేశారన్నారు.

పటిష్టమైన సంఘంగా 'హంస'

- డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రోహిత్



సత్కారం అందుకున్న హంస నూతన కార్యవర్గం

కావలిటౌన్, ఏప్రిల్ 16: వైద్య ఆరోగ్య శాఖలో హంస అసోసియేషన్ పటిష్ఠమైన సంఘంగా రూపుదిద్దుకుంటుందని డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కర్నాటి రోహిత్ పేర్కొన్నారు. మంగళవారం ఏరియా వైద్యశాల సమావేశం మందిరంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్‌ల పర్యవేక్షణలో కావలి తాలూకా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్లు రోహిత్, వెంకటలక్ష్మిలు నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందించారు. వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో డిమాండ్ల సాధనలో హంస చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేసే వారిని ఎన్నుకున్నామని, హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ నేతృత్వంలో ఉద్యోగుల హక్కుల సాధనకు హంస ముందుంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభార్గవి, హరిబాబు, ఇందిర తదితరులు పాల్గొన్నారు. తాలూకా యూనిట్ సంఘం అధ్యక్షుడిగా సోమేశ్వరరావు, కార్యదర్శిగా లక్ష్మీనరసయ్య, కోశాధికారిగా హరిప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ధనలక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు.

టీడీపీ పాలనలోనే యువతకు ఉపాధి



ఇంటింటి ప్రచారంలో గిరిధర్, బినీత్‌రెడ్డి

అల్లూరు, ఏప్రిల్ 16 : తెలుగుదేశం పాలనలోనే యువతకు ఉపాధి కల్పన జరిగిందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని అల్లిమడుగు కాలనీలో మంగళవారం రాత్రి కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డితో కలసి ఇం టింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అనురాధ, పోలమ్మ, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఎన్నార్‌పేటలో టీడీపీ ప్రచారం

బిట్రగుంట, ఏప్రిల్ 16: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, ఆయన సతీమణి పమిడి ఉమాప్రియ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుధీర్‌బాబు, దొడ్ల అంజయ్య యాదవ్, అహ్మద్‌బాషా, ఐ.తిరుపతిరెడ్డి, ఏ.ప్రసాద్, పీ.హరిబాబు, టీ.సాయిప్రసాద్, జానకి రామయ్య, డీ.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు సభ్యుడి రాజీనామా

కొండాపురం, ఏప్రిల్ 16: మండలంలోని తూర్పుయర్రబల్లి పంచాయతీ మూడో వార్డు సభ్యుడు చింతం చిన్న తిరుపతి మంగళవారం తనపదవికి రాజీనామా చేసి ఆ పత్రాన్ని ఎంపీడీవో సుజాతకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ తరఫున విజయమ సాధించినప్పటికీ పంచాయతీ సమావేశాలకు తనను ఏనాడు పిలవకపోవడం, తీర్మానాలలో తన ఆమోదం పరిగణనలోకి తీసుకోకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. తన వార్డు పరిధిలోని ప్రజలకు ఎటువంటి పనులు చేయలేదని, అలాంటప్పుడు ఈ పదవి తనకు అవసరంలేదని రాజీనామా చేస్తూ ఆమోదించాలని ఎంపీడీవోను కోరానన్నారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు

లింగసముద్రం, ఏప్రిల్ 16 : రాబోయే ఎన్నికల్లో తెలగుదేశం పార్టీని గెలిపిస్తే చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్‌లు పేర్కొన్నారు. మంగళవారం లింగసముద్రం పంచాయతీలోని బలిజపాలెంలో టీడీపీ, జనసేన నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీ, కందుకూరు ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు బింకం శేషయ్య, మైల రామకేశవులు, కొట్టే వెంకట నారాయణ, కండే మాలకొండయ్య, పి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

అల్లూరు, ఏప్రిల్ 16 : రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఒక్క అవకాశం ఇవ్వాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ రిస్ట్ కావలి నియోజకవర్గ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు కోరారు. మండలంలోని నార్తుఆములూరులో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కోహూరు బాబు, నక్కా గిరి, వెంకటరమణయ్య, కోహూరు చిన్నారావు, దాసరి దేవ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఆలయాల ముస్తాబు

బిట్రగుంట, ఏప్రిల్ 16: బోగోలు మండలంలోని పలు ఆలయాలు శ్రీరామ నవమి వేడుకలకు విద్యుత్ దీప అలంకరణలతో ముస్తాబయ్యాయి. బుధవారం నుంచి శ్రీరామ నవమి వేడుకలు జరుగనుండటం వలన ఆలయాల వద్ద చలువ పందిలు వెశారు. అయోధ్య రామ మందిర కమిటీ పిలుపు మేరకు మండలంలోని ఐదు ఆంజనేయస్వామి, రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమవుతాయని సమరసతా సేవా ఫౌడేషన్ కావలి డివిజన్ అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీరామ భక్తులు తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు యాదవ్ కోరారు.

రోడ్డు ప్రమాద మృతులకు సంతాపం

జలదంకి, ఏప్రిల్ 16: బోగోలు మండలం ముంగమూరు తోటల సమీపంలో జాతీయరహదారిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చాముదలకు చెందిన మృతులకు టీడీపీ నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, కావలి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, దేవరపల్లి క్రిష్ణారెడ్డి, మునగాల వెంకటేశ్వర్లురెడ్డి ఉన్నారు. మృతుల కుటుంబాలకు తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

శిరోముండనం కేసులో శిక్ష తగ్గించడం అన్యాయం

బిట్రగుంట, ఏప్రిల్ 16: దళితుల శిరోముండనం కేసులో నిందితులకు శిక్ష తగ్గించడం అన్యాయమని దళిత సంఘ ర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. బోగోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఆయన నిరసనతెలిపారు. 1996లో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో ఇసుక మాఫియాకు దళితులు అడ్డు వస్తున్నారని కట్టేసి పోలీస్‌స్టేషన్లో గుండు గీసి ఊరేగించారన్నారు. ఈ కేసులో అప్పటి రామచంద్రపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులకు 18నెలల శిక్ష వేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సాదుప్రసాద్, ఆత్మకూరి తేజ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

కందుకూరు, ఏప్రిల్ 16: కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గెలుపుకోసం ఆయన సతీమణి ఇంటూరి సౌజన్య మంగళవారం పట్టణంలోని 18, 19 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 19వ వార్డుకు చెందిన పలు ముస్లిం కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నగర జయకృష్ణ, పొన్నం కృష్ణమోహన్, ముచ్చు శ్రీనివాసులు, షేక్ మున్నా, చిడిపోతు కోటేశ్వరరావు, వడ్డివల్లి మాధవరావు, సోమినేని మల్లికార్జున, దివి వెంకటేశ్వర్లు, సయ్యద్ సుల్తాన్, మసూద్, ముస్తఫా, యజ్ఞాని పాల్గొన్నారు.